ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
5 Lines Rs.250 only
&
Public Notice Advertising
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

బుధవారం | 07-10- 2026 | సంపుటి: 17, సంచిక: 186, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ



కరువు పరిస్థితులపై పూర్తి స్థాయి నివేదిక

సిద్ధం చేయాలి

- అక్టోబర్ మాసాంతంలోగా నివేదిక రూపొందించాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

హైదరాబాద్, అక్టోబరు 6 (ప్రజాకలం) :

ఎల్-నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడిన కరువు పరిస్థితులపై పూర్తి స్థాయి నివేదికను వెంటనే సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖపై మంగళవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.

తరువాయి 2వ పేజీలో...

ఆ 45 ఎకరాల గుర్తింపునకు

సర్వే చేయండి

ఆ భూముల్లో తెలంగాణ అమర వీరుల కాలనీ ఏర్పాటు

వెలికట్టలో ఎడ్యుకేషన్ హబ్
మల్లన్న సాగర్ నీరు అక్రమ వినియోగదారులపై చర్యలు
ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 6 (ప్రజాకలం) :

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల పరిధిలో 45 ఎకరాల భూముల ఆచూకీ లభ్యం కానుందున, వాటి గుర్తింపునకు వెంటనే సర్వే నోటిఫికేషన్ విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. 22 ఏపై శాసనసభలో గత నెల 16వ తేదీన నిర్వహించిన చర్చలో ఆ భూములపై విచారణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆ విచారణ పురోగతిపై ఎంసీఆర్ హెచ్ ఆర్డీ బోధీ పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం రాత్రి సమీక్ష నిర్వహించారు.



సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, భూ అక్రమాలపై విచారణకు వేసిన కమిటీ,

తరువాయి 2వ పేజీలో...



విద్యారంగంలో శాశ్వత మార్పులకు

భారీ పెట్టుబడులు

పిల్లల పౌష్టికాహారం, నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం: భట్టి, ఉత్తమ్

60 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించేలా మునగాలలో మెగా కిచెన్

ఉత్తమ్, పద్మావతి విజ్ఞప్తితో సింగరేణి నుంచి రూ.9.60 కోట్ల సహకారం

వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే గడ్డిపల్లి పాఠశాల పూర్తి చేయాలని ఆదేశం

హైదరాబాద్/నూర్యాపేట, అక్టోబర్ 6 (ప్రజాకలం) : విద్యారంగంలో శాశ్వత మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం భారీ పెట్టుబడులు పెడుతోందని ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాల పిల్లలకు పౌష్టికాహారం, నాణ్యమైన విద్య, ఆధునిక వసతులు అందించేందుకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యం, చదువు, భవిష్యత్తుకు భరోసా కల్పించేలా ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా మునగాలలో అత్యాధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌కు మంగళవారం భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం గడ్డిపల్లిలో రూ. 200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను పరిశీలించి పురోగతిని సమీక్షించారు.

రోజూ 60 వేల మందికి పౌష్టిక అల్పాహారం

మునగాల కమ్యూనిటీ కిచెన్ ద్వారా నూర్యాపేట జిల్లాలోని 1,029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో

తరువాయి 2వ పేజీలో...

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి

ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోవాలి

రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల్లో నషా ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలి

డ్రగ్స్ ప్రభావానికి గురైన వారికి సమాచారం అందిస్తే తక్షణమే డీ-అడిక్షన్ చికిత్స అందిస్తాం

బొమ్మారెడ్డిపల్లిలో 'మిషన్ పరివర్తన' అవగాహన కార్యక్రమంలో

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీపీ రామ్ రెడ్డితో కలిసి పాల్గొన్న మంత్రి



ధర్మారం, అక్టోబర్ 06 : (ప్రజా కలం ప్రతినిధి) మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి యువత ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోవాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కావొద్దని, మాదకద్రవ్యాల నిర్మూలన కు సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. మంగళవారం రోజున ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లి గ్రామంలోని మహేశ్వర ఫంక్షన్ హాల్ లో పోలీస్ శాఖ ఆధ్వర్యం లో నిర్వహించిన 'మిషన్ పరివర్తన' మాదకద్రవ్యాల దుర్వినియోగం,

తరువాయి 2వ పేజీలో...

ప్రభుత్వ పథకాలను సమర్థంగా అమలు చేయాలి: ఎంపీ డీకే అరుణ

దిశ కమిటీ సమావేశంలో యు శాఖల వారీగా పథకాలు, అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రతి నియోజకవర్గంలో ఒక గ్రామంలో పీఎం సూర్య ఘర్ బిజిలీ యోజన పైలెట్ గా చేపట్టి అమలు చేయాలి

అమృత్ పథకం పనులు మున్సిపాలిటీ పనులు డిసెంబర్‌లోగా పూర్తి చేయాలి

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 06:

కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలు చేస్తున్న కేంద్ర పథకాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేసి, అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన జిల్లా అభివృద్ధి, సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశ) సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయం, ఉద్యానవన, వైద్య ఆరోగ్యం, విద్య, మార్కెటింగ్, పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్, క్రీడలు, యువజన సర్వీసులు తదితర శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనుల ప్రగతిని శాఖల వారీగా సమీక్షించారు. పథకాల అమలు, పనుల పురోగతి, లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో నగర మేయర్ జి.మమత, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక గ్రామం చొప్పున పైలెట్ ప్రాజెక్ట్ గా చేపట్టి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో పీఎం సూర్య ఘర్ బిజిలీ యోజన పథకం ద్వారా ఇంటి



పైకప్పులపై సోలార్ విద్యుత్ వ్యవస్థల ఏర్పాటును ప్రోత్సహించాలని ఎంపీ డీకే అరుణ సూచించారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని టీజీఎస్పీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్‌కు సూచించారు. సర్పంచ్‌లు ముందుకు వచ్చే గ్రామాల్లో సోలార్ విద్యుత్ వ్యవస్థల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.

తరువాయి 2వ పేజీలో...

SIR Special Intensive Revision
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్
(ప్రత్యేక సమగ్ర సవరణ)
జూన్ 25, 2026 నుండి
భారత ఎన్నికల సంఘం


17.08.2026న ప్రచురించబడిన ముసాయిదా ఓటర్ల జాబితాలో మీ వివరాలను పరిశీలించుకోండి

సందేహాలకు మీ బూత్ లెవెల్ ఆఫీసర్ (BLO)/ AERO/ERO ని సంప్రదించండి.

ఓటు V.O.T.E

క్లెయిమ్‌లు & అభ్యంతరాలు స్వీకరణ దశ
07-10-2026
వరకే

త్వరపడండి నేడే ఆఖరి రోజు



- ఫారం-6 : నూతన ఓటర్‌గా నమోదుకు
- ఫారం-7 : తొలగింపులకు
- ఫారం-8 : సవరణలకు, చిరునామా మార్పుకు

తుది ఓటర్ల జాబితా ప్రచురణ: 09-11-2026

Scan here for ecinet.eci.gov.in
Website: https://voters.eci.gov.in / https://ecinet.eci.gov.in / https://www.eci.gov.in
వివరాలకు: బూత్ లెవల్ ఆఫీసర్‌ను సంప్రదించండి (BLO)/AERO/ERO
CEOTelangana CEOTelangana ChiefElectoralOfficerTelangana CEO_Telangana
వివరాలకు, టోల్‌ఫ్రీ 1950
ఉ॥ 10:30 - సా॥5:00 వరకు

మీ ఓటు.. మీ బాధ్యత.
ఓటర్ల జాబితాలో మీ వివరాలను అప్‌డేట్ చేసుకోండి-పటిష్టమైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి

ఆ 45 ఎకరాల గుర్తింపునకు సర్వే చేయండి

మొదటి పేజీ తరువాయి...

ధరణి అక్రమాలపై ఏర్పాటు చేసిన విచారణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విచారణ పురోగతిపై సీఎం కమిటీ సభ్యులను ప్రశ్నించారు. ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 325లో మొత్తం 388 ఎకరాల భూమి ఉన్నట్లు రికార్డుల్లో నమోదై ఉందని, కానీ తాజా సర్వేలో 343 ఎకరాల భూమి మాత్రమే ఉన్నట్లు గుర్తించామని సీఎంకు అధికారుల వివరించారు. రికార్డులో ఉన్న భూమికి, వాస్తవంగా ఉన్న భూమికి మధ్య 45 ఎకరాల వ్యత్యాసం ఉందని అధికారులు తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఆ 45 ఎకరాల భూమిని తేల్చేందుకు ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల్లో సర్వేకు నోటిఫికేషన్ విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సర్వే నెంబర్ 325 సమీపంలోనే మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, ఆయన కుటుంబ సభ్యులకు భూములు ఉన్నందున, వారి భూముల రికార్డులను సమర్పించాలని నోటీసులు జారీ చేస్తామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. సర్వే నంబర్ 325లో గుర్తించే భూమిని స్థానికంగా అర్హులైన రైతులకు పంపిణీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అలాగే, తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాల కోసం 'తెలంగాణ అమరవీరుల కాలనీ'ని నిర్మించాలని సీఎం ఆదేశించారు.అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలతో కాలనీని అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. కాలనీ నిర్మాణ బాధ్యతలను గృహ నిర్మాణ శాఖకు అప్పగించాలని, వచ్చే జూన్ 2లోగా తెలంగాణ అమరవీరుల కాలనీ నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కొండపాక మండలం వెలికట్ట గ్రామ పరిధిలో అసైన్డ్ భూములు, మిషన్ భగీరథ భూములు మినహా మిగిలిన భూముల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ తోపాటు ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువుల నీటిని జాగ్రత్తగా వినియోగించాలని సీఎం అధికారులకు సూచించారు. మల్లన్న సాగర్ నీటిని అనధికారికంగా వినిగియోంచే వారిని గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

కరువు పరిస్థితులపై పూర్తి స్థాయి నివేదిక సిద్ధం చేయాలి

మొదటి పేజీ తరువాయి...

ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, విపత్తుల నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, కార్యదర్శులు దాసరి హరిచందన, గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు. ఎల్–నినో ప్రభావంతో రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 320 మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. కరువు పరిస్థితులపై ప్రణాళిక, రెవెన్యూ, గ్రౌండ్ వాటర్, వ్యవసాయం, పంచాయతీరాజ్, గ్రామీణ మంచి నీటి సరఫరా తదితర శాఖల నుంచి సమగ్ర వివరాలను సేకరించి, నిబంధనల ప్రకారం కరువు ప్రభావిత మండలాలను గుర్తించాలని ఆదేశించారు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కొనసాగిన నైరుతి రుతుపవనాల సీజన్‌లో నమోదైన వర్షపాతం సహా 12 ప్రామాణిక అంశాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర కరువు నివేదికను రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశించిన ప్రమాణాలను ప్రామాణికంగా తీసుకుని కరువు ప్రభావిత మండలాలను ప్రకటించే ప్రక్రియను చేపట్టాలని, ఇందుకు సంబంధించిన పూర్తి స్థాయి నివేదికను అక్టోబర్ మాసాంతంలోగా సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు. ఎల్–నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో, ఆ సమావేశానికి అవసరమైన అన్ని వివరాలతో సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని ఆయన అధికారులను కోరారు.

విద్యారంగంలో శాశ్వత మార్పులకు భారీ పెట్టుబడులు

మొదటి పేజీ తరువాయి...

చదువుతున్న దాదాపు 60 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ పౌష్టిక అల్పాహారం అందించనున్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేస్తున్న ఈ వంటశాలలో ఆహార తయారీ, ప్యాకింగ్, రవాణా, విద్యాసంస్థలకు పంపిణీ వరకు సమగ్ర వ్యవస్థను రూపొందిస్తున్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతిరెడ్డి చేసిన విజ్ఞప్తుల మేరకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఈ ప్రాజెక్టుకు రూ.9.60 కోట్ల ఆర్థిక సహకారం అందిస్తోంది. శంకుస్థాపన కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారం అందించడం వారి ఆరోగ్యం, చదువు, భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టడమేనని అన్నారు. సంక్షేమ కార్యక్రమాలను కేవలం ఉచితాలుగా చూడొద్దని సూచించారు. కుటుంబాలను బలోపేతం చేసి, ప్రజలు రాష్ట్రాభివృద్ధిలో మరింత సమర్థంగా భాగస్వాములయ్యేందుకు ఇవి తోడ్పడతాయని వివరించారు.

విద్యతోపాటు పౌష్టికాహారం అవసరం

పిల్లల ఎదుగుదలకు తరగతి గదిలో అందించే విద్యతోపాటు పౌష్టికాహారం కూడా అవసరమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. చిన్న వయసు నుంచే సరిపడా ఆరోగ్యకరమైన ఆహారం అందితే వారి అభ్యసనానికి తోడ్పడుతుందని చెప్పారు. మునగాల కిచెన్ ద్వారా ప్రారంభంలో దాదాపు 60 వేల మందికి అల్పాహారం అందిస్తామని, భవిష్యత్తులో లబ్ధిదారుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అల్పాహారంతోపాటు పాలు, రాగిజావ అందిస్తామని చెప్పారు. ఆహార నాణ్యత, పౌష్టిక విలువలు, పరిశుభ్రత, సురక్షిత నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని ఉత్తమ్ తెలిపారు. అవసరాలను బట్టి ఎంపిక చేసిన జూనియర్ కళాశాలలకు మధ్యాహ్న భోజనం అందించేలా కూడా కార్యక్రమాన్ని విస్తరించే అవకాశం ఉందని అధికారులు వివరించారు. విద్యార్థుల సంక్షేమం, హాజరు, అభ్యసన ఫలితాలు, విద్యావకాశాలను మెరుగుపరిచే ప్రభుత్వ ప్రయత్నాలకు ఈ కార్యక్రమం తోడ్పడుతుందని ఉత్తమ్ అన్నారు. ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, జిల్లా అధికారులు, అమలు భాగస్వాములతో సమన్వయం చేసుకుంటూ కిచెన్ నిర్మాణం, నిర్వహణను తాను స్వయంగా పర్యవేక్షిస్తానని చెప్పారు.

పాఠశాల పనులకు వారాల వారీ ప్రణాళిక

గడ్డిపల్లి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాన్ని వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. అనుకున్న ప్రకారం ప్రవేశాలు ప్రారంభించేందుకు వీలుగా అధికారులు, నిర్మాణ సంస్థ వారాల వారీగా సమగ్ర పనుల ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. నిర్మాణంలో జాప్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. నిర్ణయించిన కాలవట్టికకు అనుగుణంగా పనుల పురోగతిని జిల్లా యంత్రాంగం నిశితంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆధునిక తరగతి గదులు, వసతి గృహాలు, క్రీడా సదుపాయాలు, ఇతర విద్యార్థి వసతులన్నీ ఒకే ప్రాంగణంలో ఉండేలా గడ్డిపల్లి పాఠశాలను ఆదర్శ విద్యాలయంగా తీర్చిదిద్దుతున్నామని భట్టి తెలిపారు. గ్రామీణ తెలంగాణ భవిష్యత్తుపై పెట్టుబడిగా ఈ పాఠశాలను అభివర్ణించారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు ప్రముఖ పాఠశాలలతో సమానమైన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. గ్రామీణ, గురుకుల విద్యాసంస్థల్లో దీర్ఘకాలంగా కొనసాగుతున్న మౌలిక వసతుల కొరతను ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ద్వారా పరిష్కరిస్తున్నామని ఉత్తమ్ తెలిపారు. అనేక విద్యాసంస్థలు అద్దె భవనాల్లో లేదా సరిపడని భవనాల్లో నడుస్తూ తరగతి గదులు, వసతి, పారిశుద్ధ్య సదుపాయాల కొరతను ఎదుర్కొన్నాయని చెప్పారు. గ్రామీణ పిల్లలకు కూడా ఇతర ప్రాంతాల్లో లభించే నాణ్యమైన విద్య, సదుపాయాలు అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా 105 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 105 పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రూ.200 కోట్లతో చేపట్టిన గడ్డిపల్లి పాఠశాల ఈ కార్యక్రమంలో భాగమని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీతోపాటు ఇతర వర్గాల విద్యార్థులు కలసి చదువుకునేలా నాణ్యమైన విద్య, వసతి, క్రీడా సదుపాయాలు, సమగ్ర విద్యార్థి సహాయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తున్నామని వివరించారు. గడ్డిపల్లి ప్రాజెక్టును మంజూరు చేయడంతోపాటు మారుమూల ప్రాంతానికి స్వయంగా వచ్చి పనులను సమీక్షించిన భట్టి విక్రమార్కకు ఉత్తమ్ కృతజ్ఞతలు తెలిపారు. నిర్మాణ సంస్థకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూస్తున్న ఆర్థిక శాఖకు ధన్యవాదాలు చెప్పారు. భూమి, అనుమతులు, పాఠశాలకు చేరుకునే రహదారి ఏర్పాట్లలో సహకరించిన సూర్యాపేట జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. పాఠశాల, విద్యార్థి సంక్షేమ కార్యక్రమాలను నిర్ణీత గడువుల్లో పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, స్థానిక ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం అవసరమని పేర్కొన్నారు.


హుజూర్‌నగర్‌ను అగ్రగామిగా తీర్చిదిద్దుతాం

గడ్డిపల్లి పాఠశాలతో హుజూర్‌నగర్ నియోజకవర్గం, పరిసర గ్రామీణ ప్రాంతాల పిల్లలకు ఇంటికి చేరువలోనే నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని ఉత్తమ్ తెలిపారు. హుజూర్‌నగర్‌ను తెలంగాణలోని అగ్రగామి నియోజకవర్గాల్లో ఒకటిగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నానని చెప్పారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తానని తెలిపారు. మునగాల కమ్యూనిటీ కిచెన్, గడ్డిపల్లి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా గ్రామీణ సూర్యాపేటలోని పిల్లల జీవన ప్రమాణాలు, పౌష్టికాహారం, విద్యావకాశాలను మెరుగుపరచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రులు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఎన్. పద్మావతిరెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చిక్కుల్లో ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ: ఫారం 6 వివాదం ముదురుతోంది. ఎన్నికల సంఘం (ఈసీ) నిర్ణయాలు ఏకపక్షంగా ఉంటే వాటిని రద్దు చేస్తామని తాజాగా సుప్రీం కోర్టు చేసిన హెచ్చరికలతో ఈసీ చిక్కుల్లో పడింది. ఫారం–6 సవరణలను తాము ఆమోదించలేదని, అవి చట్టవ్యతిరేకంగా ఉంటే రద్దు చేస్తామని సోమవారం సర్వోన్నత న్యాయస్థానం హెచ్చరించిన విషయం తెలిసిందే. ఫారం–6ను కొత్త ఓటర్ల నమోదు కోసం వినియోగిస్తారు. అయితే దీనిలో ఏకపక్షంగా సవరణలు చేశారని దేశవ్యాప్తంగా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకునేవారు ఫారం 6లో.. గత ఎస్ఐఆర్‌లో తమ పేరు/ తల్లిదండ్రుల పేరు/ తాత, నానమ్మల పేరు ఉందా అన్న విషయం తెలపాలంటూ ఈసీ సాఫ్ట్‌వేర్‌లో మార్పు చేశారంటూ కోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై సుప్రీం కోర్టు ఘాటుగా స్పందించింది. ఆ సవరణలను తాము ఆమోదించలేదని స్పష్టం చేసింది.

ఫారం–6ను మార్చలేదు..మరోవైపు ఫారం–6 ఎలాంటి సవరణలూ చేయలేదని ఎన్నికల సంఘం కోర్టులో వాదించింది. తాము అదనంగా ఒక డిక్లరేషన్‌ను సమర్పించాలని ఆదేశాలు జారీ చేశామని చెప్పింది. పైగా ఈ మార్పులను బిహార్ 'సర్'పై ఇచ్చిన మే నెల తీర్పులో సుప్రీం



కోర్టు కూడా సమర్థించిందని తెలిపింది.

ఈసీఐ పోర్టల్‌లో అదనపు డిక్లరేషన్ తప్పనిసరి.. కాగా.. ఈసీఐ అధికారిక పోర్టల్‌లో ఫారం–6కు దరఖాస్తు చేసుకోవాలంటే ఈ అదనపు డిక్లరేషన్ తప్పనిసరిగా జతచేయాలి. ఇందుకోసం ఆ పోర్టల్‌లో 'ఫిల్ ఫారం–6', 'ఫిల్ డిక్లరేషన్' అని రెండు ఆప్షన్లు ఉంటాయి. ఇప్పుడు దీనిపై వివాదం రాజుకోవడంతో డిక్లరేషన్ ఆప్షన్‌ను ఈసీ తొలగించింది. ఇప్పుడు దీన్ని కోర్టు తీవ్రంగా పరిగణించింది, ఎవరి ఆదేశాలతో ఆ పత్రాన్ని తప్పనిసరి చేశారని ప్రశ్నిస్తోంది. ఈ నేపథ్యంలో ఈసీ పలు న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశముంది.

ఏడాదిలోపే ఇందిరమ్మ టవర్స్ పూర్తి చేసి లబ్ధిదారుల చేతికి తాళాలిస్తాం

ఇందిరమ్మ టవర్స్ వేగంగా నిర్మించే కాంట్రాక్టర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

5,218 మంది అర్హుల నుంచి లక్కీ డ్రా..

480 కుటుంబాలకు ఇళ్ల కేటాయింపు : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

క్యూర్ పరిధిలో తొలివిడత ప్రయోగాత్మకంగా నిర్మిస్తున్న లక్ష ఇళ్ల ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేసి ఏడాదిలోగా అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అందులో భాగంగా ఏడాది గడువును కాంట్రాక్టర్లకు నిర్దేశించామని ఒక నెల ముందుగా పూర్తి చేస్తే రూ.45 లక్షలు, రెండు నెలల ముందుగా పూర్తి చేస్తే రూ. 90లక్షలు ప్రోత్సాహక బహుమతిగా ఇస్తామని చెప్పామని వివరించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి గాజులరామారంలో మంగళవారం ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు సహచర మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే కే.పీ వివేకానంద, పలువురు లబ్ధిదారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రులు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు 23 అసెంబ్లీ నియోజక వర్గాలలో ఇందిరమ్మ టవర్స్ ను నిరంతర ప్రక్రియగా నిర్మిస్తామని తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇళ్ల కోసం 7,520 మందికి పైగా దరఖాస్తులు అందగా, పరిశీలన అనంతరం 5,218 మంది అర్హులుగా తేలారని అర్హులైన వారిలో లబ్ధిదారుల ఎంపికను బహిరంగంగా లక్కీ డ్రా ద్వారా చేపట్టి, 480 మంది లబ్ధిదారులను తుది జాబితాలో ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఎంపిక ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా నిర్వహించామని, ఎవరికి ఏ విధంగా ఇల్లు మంజూరైందనే వివరాలను లబ్ధిదారులకు తెలియజేయడంతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను అందజేస్తామని చెప్పారు. ప్రస్తుతం కేటాయించిన ఇళ్లతో కార్యక్రమం ముగియదని, మరో మూడు విడతల్లోనూ ఇళ్ల నిర్మాణాన్ని చేపడతామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం సుమారు 7.5 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని, దీనితో పాటు నియోజకవర్గంలో ఉన్న ఇతర ప్రభుత్వ, హౌసింగ్ శాఖ భూములను గుర్తించి అక్కడ పేదలకు ఇళ్లు నిర్మించే చర్యలు చేపడతామని వివరించారు. ఈమేరకు హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులకు ఇప్పటికే సూచనలు చేసినట్లు వెల్లడించారు.ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని మంత్రి అన్నారు. లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. "మీ కళ్ల ముందే మీ ఇల్లు నిర్మించబడాలి. నాణ్యతతో కూడిన ఇంటిని సొంతం చేసుకున్నామనే తృప్తి, ఆనందం మీకు కలగాలి" అనేదే ఇందిరమ్మ ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. పేదల చిన్న చిన్న కోరికలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఆ దిశగా చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి

ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోవాలి

మొదటి పేజీ తరువాయి...

అక్రమ రవాణా పై అవగాహన కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీపీ రాంరెడ్డి తో కలిసి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం పోలీస్ శాఖ చేపట్టిన 'మిషన్ పరివర్తన' కార్యక్రమం ఎంతో మంచి కార్యక్రమమని అభినందించారు. యువత భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకొని మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై నిరంతరం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

కళాశాలల్లో నషా ముక్త్ భారత్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలి

ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల విద్యార్థుల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై మరింత అవగాహన కల్పించేలా 'నషా ముక్త్ భారత్' కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ను మంత్రి ఆదేశించారు. యువత గంజాయి, డ్రగ్స్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆకర్షితులు కావొద్దని సూచించారు. కేవలం సరదా, థ్రిల్ కోసం కూడా మాదకద్రవ్యాలను ప్రయత్నించ కూడదని హితవు పలికారు. డ్రగ్స్‌కు బానిసలైతే విలువైన విద్య, కెరీర్‌తో పాటు భవిష్యత్ కూడా దెబ్బతింటుందని తెలిపారు. సింగరేణి ప్రాంతాల్లో కూడా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వ హించాలని మంత్రి సూచించారు. డ్రగ్స్ యువత భవిష్యత్‌ను అంధకారంలోకి నెడతాయని అన్నారు. ఎవరైనా 'ఒక్కసారి ప్రయత్నించు' అని చెప్పినా వారి మాటలను వినవద్దని యువతకు సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలన కు పోలీస్ శాఖతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

డ్రగ్స్ ప్రభావితులకు తక్షణమే డీ–అడిక్షన్ చికిత్స

ఎవరైనా డ్రగ్స్ లేదా గంజాయి ప్రభావానికి గురైనట్లు గుర్తిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని మంత్రి తెలిపారు. సమాచారం అందిన వెంటనే వారికి అవసరమైన డీ–అడిక్షన్ చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. డ్రగ్స్ వినియోగం వైపు వెళ్లకుండా యువతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు.

ప్రజల ఆశీర్వాదంతోనే ఈ స్థాయికి వచ్చాను

2006లో తాను జడ్పీ సభ్యుడిగా ఎన్నికయ్యానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ధర్మపురి నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆశీస్సులతో మంత్రిగా బాధ్యతలు చేపట్టే అవకాశం లభించిందని అన్నారు. ప్రజల ఆశీస్సులతో లభించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించే కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. 'మిషన్ పరివర్తన' వంటి కార్యక్రమాలను భవిష్యత్ లోనూ మరింత విస్తృతంగా నిర్వహించి యువతలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా నిరంతరం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను ప్రతి ఒక్కరికీ వివరించి, వాటి నిర్మూలనకు అవసరమైన చర్యలను సమన్వయంతో చేపట్టాలని సూచించారు.

డ్రగ్స్‌పై ప్రభుత్వం కఠిన చర్యలు

డీసీపీ రాంరెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్యాల విక్రయాలు, గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. యువత తమ విలువైన సమయాన్ని, భవిష్యత్‌ను డ్రగ్స్ కారణంగా నాశనం చేసుకోవద్దని సూచించారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ తమ ప్రతిభను పెంపొందించుకోవాలని కోరారు. యువత తమ లక్ష్యాలపై దృష్టి సారించి మంచి భవిష్యత్‌ను నిర్మించుకోవాలని సూచించారు. తమ చిన్ననాటి రోజుల్లో సారా వినియోగాన్ని నిర్మూలించేందుకు 'మార్పు' నాటికను రూపొందించి ప్రజల్లో అవగాహన కల్పించామని డీసీపీ రామ్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం మాదకద్రవ్యాల నిర్మూలన కోసం వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు చైతన్య సందేశాన్ని అందిస్తున్నామని చెప్పారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో యువత, ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి , జిల్లా కలెక్టర్ , డీసీపీ పోలీస్ అధికారులు, సిబ్బంది, యువత, ప్రజలు కలిసి మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.

డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, ఇతరులను కూడా వాటికి దూరంగా ఉండేలా చైతన్యపరుస్తామని ప్రతిజ్ఞలో పేర్కొన్నారు. మాదకద్రవ్యాల అక్రమ వినియోగం, విక్రయాలు, రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియ జేస్తామని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ప్రభుత్వ పథకాలను సమర్థంగా అమలు చేయాలి: ఎంపీ డీకే అరుణ

మొదటి పేజీ తరువాయి...

అమృత్ పథకం పనులు డిసెంబర్‌లోగా పూర్తి చేయాలి

మున్సిపాలిటీల్లో అమృత్ పథకం ద్వారా చేపడుతున్న తాగునీటి సరఫరా పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని ఎంపీ సూచించారు. సంబంధిత ఏజెన్సీలతో సమావేశాలు నిర్వహించి పనులను వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

రైతులు, మహిళా సంఘాలకు డ్రోన్ల ద్వారా పంటలకు పురుగుమందుల పిచికారీపై అవగాహన కల్పించాలని ఎంపీ సూచించారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటు హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న మహబూబ్‌నగర్ జిల్లా అవసరాలను దృష్టిలో ఉంచుకుని మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వైవిధ్యమైన పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు.

కెజిబివిల్లో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం

జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీ సూచించారు. ఫుడ్ పాయిజన్ వంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. మిడ్జిల్ ఖ+దీఎలో వర్షపు నీరు నిల్వ కాకుండా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేయడంతో పాటు నూతన డైనింగ్ హాల్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు.

పీఎం శ్రీ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలి

పీఎం శ్రీ పథకం కింద జిల్లాలోని 26 పాఠశాలల్లో ల్యాబ్‌లు, అదనపు తరగతి గదులు, టాయిలెట్లు తదితర మౌలిక వసతుల కల్పన పనులు చేపడుతున్నట్లు అధికారులు వివరించారు. ఈ పాఠశాలల్లో సీబీఎస్ఈ విద్యతో పాటు 8వ తరగతి నుంచే ఐఐటీ, మెడిసిన్ తదితర పోటీ పరీక్షలకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.

టీడీ గుట్ట ఆర్ఓబీ భూసేకరణపై చర్చ

టీడీ గుట్ట రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణానికి సంబంధించిన భూసే కరణ అంశాలపై సమావేశంలో చర్చించారు. భూసేకరణకు సంబంధించి ఎలాంటి సమ స్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని రైల్వే అధికారులకు ఎంపీ సూచించారు. జిల్లాలో జరుగుతున్న రైల్వే ఆర్.ఓ.బి పనులు,నేషనల్ హైవే రోడ్డు పనులు

సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనుల పురోగతిలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఆర్‌డబి,పంచాయతీ రాజ్ శాఖా ద్వారా చేపట్టిన రహదారుల పనులు కూడా సమీక్షించి ఆదేశాలు జారీ చేశారు.

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా స్పందిస్తూ జిల్లాలోని ప్రతి ఖ+దీఎని మండల ప్రత్యేక అధికారులు క్రమం తప్పకుండా సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నారని తెలిపారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

ఎం.పి. మాట్లాడుతూసొంత భవనాలు లేని అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వ భూమి కేటాయించేలా తహశీల్దార్ల ద్వారా ప్రతిపాదనలు పంపించాలని, వి.బి.జి. రామ్ జీ నిధులతో అంగన్వాడీ భవనాలు ,వి.ఓ భవనాలు, జి.పి.భవనాలు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఓ నర్సింహులు, జడ్పీ సీఈఓ వెంకట రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, దిశ కమిటీ సభ్యులు, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

నర్సింగాపూర్‌లో ఎస్ఐఆర్ హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించిన ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, కలెక్టర్



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 6 (ప్రజాకలం):

ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బి. బాల మాయాదేవి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను వారు పరిశీలించారు. బీఎల్ఓలను కలిసి ఇప్పటివరకు చేపట్టిన ఇంటింటి సర్వే, ఓటర్ల వివరాల పరిశీలన, ఫారాల స్వీకరణ, వెరిఫికేషన్ తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో బీఎల్ఓలు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్ అంశాలపై అబ్జర్వర్ ఆరా తీశారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ బీఎల్ఓలు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఓటర్లకు అవసరమైన సమాచారాన్ని అందించాలని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, తహసీల్దార్ హకీమ్, స్థానిక ప్రజాప్రతినిధులు, బీఎల్ఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎన్నికల్లో ఐక్య కూటమిని గెలిపించాలి



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 06 (ప్రజాకలం):- ఈ నెల 9న జరగనున్న టీజీఎస్ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఈయూ–టీఎంయూ–ఎన్ఎంయూ జేఏసీ ఐక్య కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర ఏఐటీయూసీ కౌన్సిల్ మెంబర్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఏశమేని గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. ముక్రం పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మెట్‌పల్లి ఆర్టీసీ డిపోలో ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బందిని కలిసి కరపత్రాలు పంపిణీ చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ “మోసపోతే గోసపడతాం.. ఇవి చరిత్రాత్మక ఎన్నికలు” అని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, వేతన సవరణ, పీఆర్‌సీ, పదోన్నతులు తదితర సమస్యల పరిష్కారం కోసం ఐక్య కూటమి నిరంతరం పోరాడుతోందన్నారు. గతంలో కార్మిక హక్కుల సాధన కోసం జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటాలను గుర్తుచేశారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం, ఉద్యోగ విరమణ వయస్సును 61 సంవత్సరాలకు పెంచేలా కృషి చేయడంతో పాటు రాబోయే రోజుల్లో ప్రభుత్వం, యాజమాన్యం నుంచి కార్మికులకు రావాల్సిన న్యాయమైన హక్కులను సాధించేందుకు ఐక్య కూటమికి మద్దతు ఇవ్వడం చారిత్రక అవసరమన్నారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ఈయూ–టీఎంయూ–ఎన్ఎంయూ జేఏసీ ఐక్య కూటమి బస్సు, నిచ్చెన గుర్తులపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఏశమేని గణేశ్, ఎం.డి. ముక్రం విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో డిపో యూనియన్ అధ్యక్షుడు మురళీధర్, సెక్రటరీ రాములు, నాయకులు ప్రవీణ్, ఎంపీ రెడ్డి, ఏఐటీయూసీ ప్రతినిధులు, పలువురు ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

కోరుట్ల ఆర్టీపీ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి అక్టోబర్ 6 (ప్రజాకలం): కోరుట్ల రవాణా శాఖ యూనిట్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మంగళవారం నాడు కార్యాలయం కు చేరుకున్న ఏసీబీ అధికారులు ముందుగా కార్యాలయం లోనికి ఎవరిని అనుమతి లేకుండా



కార్యాలయ రికార్డులు, చలాన్లు, పెండింగ్ దరఖాస్తులు, ఆర్థిక లావాదేవీలు, సిబ్బంది విధులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు అక్రమాలు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. రవాణా కానిస్టేబుల్ ఎన్. గిరీష్ కుమార్ ఎంవీఐ అందుబాటులో లేని సమయంలో డ్రైవింగ్ పరీక్షలు నిర్వహించడం, వాహనాల రిజిస్ట్రేషన్ తనిఖీలు చేస్తున్నట్లు గుర్తించారు. అధికారిక పనులు చేయించుకునేందుకు ఏజెంట్ల ద్వారా ప్రజల నుంచి అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైనట్లు ఏసీబీ పేర్కొంది. కార్యాలయంలో ఏజెంట్లకు స్వేచ్ఛగా ప్రవేశం ఉండటం, సిబ్బందితో నేరుగా వ్యవహరిస్తుండటం, రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, సిబ్బంది విధులపై పర్యవేక్షణ లోపించడం వంటి అంశాలను గుర్తించినట్లు తెలిపింది. డ్రైవింగ్ పరీక్షల ప్రదేశం నిబంధనలకు అనుగుణంగా లేకపోవడంతోపాటు డ్రైవింగ్ ట్రాక్ వద్ద సూచిక బోర్డులు కూడా లేవని అధికారులు గుర్తించారు. అనంతరం ఎసిబి అధికారులు మీడియాతో మాట్లాడుతూ లంచం డిమాండ్ చేసినా, అవినీతికి సంబంధించిన సమాచారం ఉన్నా ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

సైబర్ నేరాలపై వేగవంతమైన దర్యాప్తు

సైబర్ ఫిర్యాదులపై తక్షణ స్పందన - సైబర్ నేరాల దర్యాప్తును వేగవంతం చేయాలి : ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 6(ప్రజాకలం)

సైబర్ నేరాలపై అందే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి, కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సైబర్ నేరాల దర్యాప్తు, కేసుల పురోగతిపై పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో నమోదవుతున్న సైబర్ క్రైమ్ కేసులు, దర్యాప్తు పురోగతి, నిందితుల గుర్తింపు, అరెస్టులు, బాధితులకు అందుతున్న సహాయ చర్యలపై ఎస్పీ సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసి నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన సైబర్ కేసులను సీఐలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. సైబర్ నేరాల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ ఆధారాలను సమర్థవంతంగా వినియోగించాలని అన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన నిందితులను గుర్తించేందుకు ఆయా రాష్ట్రాల పోలీస్ శాఖలతో సమన్వయం చేసుకోవడంతో పాటు అవసరమైతే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్టోబర్‌ను జాతీయ సైబర్ భద్రత అవగాహన మాసంగా పాటిస్తున్న సందర్భంగా సైబర్ నేరాల నివారణపై ప్రజల్లో అవగాహన



కల్పించేందుకు రూపొందించిన ప్రత్యేక పోస్టర్లను ఎస్పీ ఆవిష్కరించారు. అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. అనుమానాస్పద కాల్, సందేశం, లింక్ లేదా ఆన్‌లైన్ ఆఫర్ వచ్చినప్పుడు తొందరపడి స్పందించకుండా ఆగి, ఆలోచించి, అధికారిక మార్గాల ద్వారా ధృవీకరించిన తర్వాతే చర్యలు తీసుకోవాలని సూచించారు.సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, cybercrime.gov.in ద్వారా కూడా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో సీఐలు రామ్ నరసింహారెడ్డి, సుధాకర్, కరుణాకర్, సురేష్ బాబు, లక్ష్మీనారాయణ, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, సైబర్ క్రైమ్ ఎస్ఐలు కృష్ణ, దినేష్‌తో పాటు సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

టేకు చెట్ల దొంగతనానికి పాల్పడిన నలుగురు వ్యక్తులు అరెస్ట్

132 టేకు దుంగలు స్వాధీనం - ధర్మపురి సిఐ ఎలపాటి రామ్ నర్సింహారెడ్డి

ఎండపల్లి, అక్టోబర్ 06 : (ప్రజా కలం ప్రతినిధి) మండలం లోని పాతగూడూర్ గ్రామానికి చెందిన పోనుగంటి రామరావు అనునతడు తన పొలంలో ని రెండు టేకు చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు కోసి దొంగలించినరనే ఫిర్యాధు మేరకు వెల్గటూర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు కాగా, అట్టి కేసు దర్యాప్తు లో భాగంగా అశోక్ కుమార్ ఐపిఎస్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, జగిత్యాల ఉత్తర్వుల మేరకు, జగిత్యాల డిఎస్పి పురుషోత్తంశీ రెడ్డి సూచనల మేరకు, ధర్మపురి సిఐ ఎలపాటి రామ్ నర్సింహారెడ్డి ఆధ్వర్యం లో ఒక టీం ను ఏర్పాటు చేయడం జరిగినది. వెల్గటూర్ గ్రామ శివారులో టేకు చెట్లను దొంగతనంగా నరికి తరలిస్తున్న ముఠాను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి పెద్ద మొత్తంలో టేకు దుంగలు, ఆటో, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో భాగంగా వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం, నిందితులు అవైజ్, ఖాజీ రహమాన్ అలీ, అర్సద్ మరియు షౌకత్ అలీ అనువారు కూలీ పనులు చేసుకుంటూ జీవించేవారు. తమ కూలీ పనుల ద్వారా వచ్చే ఆదాయం తమ అవసరాలకు సరిపోక పోవడంతో, ఆర్థిక లాభం కోసం ఒక ముఠాగా ఏర్పడి టేకు చెట్లను దొంగతనంగా నరికివేయాలని పథకం రూపొందించుకున్నారు అని నిందితులు రాత్రి సమయాల్లో



జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతాల్లో ఉన్న టేకు చెట్లను గుర్తించి, వాటిని మిషన్ సహాయం తో నరికి, ఆటోలో తరలించి, వివిధ పరిమాణాల్లో కోయించి గోదాముల్లో నిల్వ చేసేవారు. అనంతరం వాటిని విక్రయించి వచ్చిన డబ్బును తమ వ్యక్తిగత అవసరాలకు వినియోగించే వారు. ఈ క్రమంలో మేడిపల్లి, జగిత్యాల రూరల్, మల్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా టేకు చెట్ల దొంగతనం చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. నిందితుల వద్ద నుండి మొత్తం 132 టేకు దుంగలు, అశోక్ లైలాండ్ ఆటో, బైక్ , చెట్లు కోసే మిషన్ (ఎలక్ట్రిక్ రంపం) ను పోలీసులు స్వాధీనం చేసుకొని, అట్టి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు వెల్గటూర్ ఎస్సై పులిచెర్ల ఉదయ్ కుమార్ తెలిపారు.

జగ్గాసాగర్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి

- ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌ను కోరిన సర్పంచ్ పుల్ల సాయగౌడ్



మెట్ పల్లి రూరల్, అక్టోబర్ 06:(ప్రజా కలం);

మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ పుల్ల సాయగౌడ్ (జగన్) కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌ను కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యేను కలిసి గ్రామంలోని పలు సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. గ్రామంలో భవిష్యత్‌లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టడంతో పాటు రైతుల సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ కోరారు. కొండ స్వామి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం హైమాస్ లైట్లు ఏర్పాటు చేయాలని, గ్రామ శివారులోని వరద కాలువ వద్ద తెగిపోయిన మట్టుకాలువకు మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా గ్రామంలోని వివిధ వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, గ్రామపంచాయతీ భవనంపై నూతన కమిటీ హాల్ నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కమ్మరికొలిమి నుంచి పాలెపు రాజేష్ ఇంటి వరకు సీసీ రోడ్డు, మండల మనోజ్ ఇంటి నుంచి మాస రాజేందర్ ఇంటి వరకు డ్రైనేజీ, మెయిన్ రోడ్డు నుంచి వొడ్డెర కాలనీలోని అల్లకుంట ఇంటి వరకు సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం వంటి పలు పనులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

పాలకవర్గానికి సన్మానం... ఈ కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ గ్రామ సర్పంచ్ పుల్ల సాయగౌడ్‌తో పాటు పాలకవర్గ సభ్యులను సన్మానించారు. గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై ఎమ్మెల్యేకు వివరించిన సందర్భంగా పాలకవర్గాన్ని అభినందించారు. గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచించారు. గ్రామంలో ప్రతిపాదించిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలో నిధులు మంజూరు చేస్తారని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు. రహదారులు, డ్రైనేజీలు, నీటి వసతులు, ఆలయ పరిసరాల అభివృద్ధి వంటి పనులు పూర్తయితే గ్రామ ప్రజలకు మరింత మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని వారు పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన మంత్రి అడ్లూరి

-మండలంలో 108 మంది లబ్ధిదారులకు రూ.37.58 లక్షల చెక్కుల పంపిణీ

ధర్మారం, అక్టోబర్ 06 : (ప్రజా కలం ప్రతినిధి) మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం లో తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్య మంత్రి సహాయనిధి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాల కు ప్రభుత్వం అండగా నిలుస్తోందని మంత్రి తెలిపారు. అనారోగ్యం తో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక



సహాయం అందిస్తున్నా మని లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

మల్లాపూర్, అక్టోబర్ 6 (ప్రజా కలం ప్రతినిధి) కడుపు నొప్పితో కొంతకాలంగా బాధపడుతున్న ఓ యువకుడు మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న ఘటన మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మారం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన బింగి సారపు శివ (23) డిగ్రీ పూర్తి చేసి



ఇంటి వద్ద ఉంటున్నాడు. గత ఏడాది కడుపు నొప్పి రావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పెద్ద పేగుకు సంబంధించి శస్త్రచికిత్స చేయించుకున్నాడు. అయినప్పటికీ తరచూ కడుపు నొప్పి రావడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం తోట నుంచి ఇంటికి తిరిగి వచ్చిన శివ.. రేకుల షెడ్డు వద్ద ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనపై బింగిసారపు సోమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బెల్లంపల్లి లేడీస్ టైలర్స్ కార్మికులకు పెరిగిన కుట్టు రేట్లు



బెల్లంపల్లి, అక్టోబర్ 6, (ప్రజాకలం) ప్రతినిధి..

మంచిర్యాల జిల్లా, బెల్లంపల్లి పట్టణంలోని లేడీస్ టైలర్స్ యజమానులు, మహిళా కార్మికుల మధ్య కుట్టు రేట్ల పెంపుపై ఒప్పందం కుదిరింది. స్థానిక కృష్ణ మందిరంలో మంగళవారం సాయంత్రం జరిగిన సమావేశంలో లేడీస్ టైలర్స్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గెల్లి రాజలింగు అధ్యక్షతన యజమానులు, మహిళా కార్మికుల సమక్షంలో కొత్త కుట్టు రేట్లను ఖరారు చేశారు.ఈ కొత్త రేట్లు 07-10-2026 నుంచి 07-10-2028 వరకు రెండు సంవత్సరాల పాటు అమల్లో ఉండనున్నాయి. మహిళా కార్మికులకు నిర్ణయించిన కుట్టు రేట్లను అందించేందుకు టైలరింగ్ యజమానులు అంగీకరించారు.కొత్త కుట్టు రేట్లు లైనింగ్ జాకెట్ (కంప్యూటర్/మగ్గం) -- రూ.140, సాధా జాకెట్ - రూ.75, సాధా టాప్ - రూ.100, లైనింగ్ టాప్ - రూ.130, సాధా పైజామా - రూ.60, లైనింగ్ పైజామా - రూ.80, లంగా జాకెట్ - రూ.200, డిజైన్ జాకెట్ -రూ.180, కట్నర్ జాకెట్ - రూ.180, లాంగ్ ఫ్రాక్ -రూ.180, కంప్యూటర్/మగ్గం వర్క్ జాకెట్ - రూ.150, లైనింగ్ జాకెట్ - రూ.130. శారీ, పాల్స్- రూ.40 ఈ సందర్భంగా వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గెల్లి రాజలింగు మాట్లాడుతూ, మహిళా కార్మికుల కష్టాన్ని గుర్తించి కుట్టు రేట్లను పెంచేందుకు టైలరింగ్ యజమానులు అంగీకరించడం అభినందనీయమన్నారు. కొత్త రేట్లను అమలు చేయడంలో అందరూ సహకరించాలని కోరారు.మహిళా కార్మికులు అధ్యక్షుడు గెల్లి రాజలింగు ను సత్కరించారు...

కల్వర్టు నిర్మాణంతో రాకపోకలు సులభతరం

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

రూ.26 లక్షలతో కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ.



మెట్ పల్లి రూరల్ ,అక్టోబర్ 06:(ప్రజా కలం);మెట్ పల్లి మండలంలోని రాజేశ్వరరావుపేట గ్రామంలో రూ.26 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన కల్వర్టు నిర్మాణ పనులకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల శంకుస్థాపన చేశారు. కల్వర్టు నిర్మాణం పూర్తయితే శ్మశానవాటికకు వెళ్లే దారిలో గ్రామ ప్రజలు, రైతుల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని వెల్లడించారు. నియోజకవర్గంలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కల్వర్టు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మహిళా మోర్చా జిల్లా కో-కన్వీనర్‌గా నల్లుల సంగీత

బెల్లంపల్లి, అక్టోబర్ 6, (ప్రజాకలం) ప్రతినిధి

మంచిర్యాల జిల్లా బీజేపీ తెలంగాణ మహిళా మోర్చా పాలసీ రీసెర్చ్ కో-కన్వీనర్‌గా నల్లుల సంగీత నియమితులయ్యారు. మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా. మేకల శిల్పారెడ్డి ఈ నియామకాన్ని ప్రకటించారు.తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తానని సంగీత తెలిపారు.రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్, జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. బిజెపి పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు..



ప్రజా కలం
బుధవారం, అక్టోబర్ 7, 2026

వేగంగా తగ్గిపోతున్న యువ జనాభా

ప్రపంచంలోనే అత్యధిక యువజనాభా కలిగిన దేశంగా పేరుగాంచిన భారత్‌లో ఇప్పుడు జననాల రేటు భారీగా తగ్గిపోవడం తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఒకప్పుడు వేగంగా పెరిగిన జనాభా ఇప్పుడు క్రమంగా క్షీణించడం వైపు అడుగులు వేస్తోంది. తాజా నివేదికల ప్రకారం దేశంలో జననాలు గణనీయంగా పడిపోగా, సంతానోత్పత్తి రేటు కూడా 1.9కి పడిపోయింది. రాబోయే రోజుల్లో యూరప్, తూర్పు ఆసియా దేశాల మాదిరిగా భారత్ కూడా వృద్ధాప్య జనాభా సమస్యను ఎదుర్కొనే దిశగా మారుతుందా అనే దానిపై ఇప్పుడు ఆందోళన వ్యక్తమవుతోంది జనాభా పెరుగుదల నుంచి క్షీణత వైపు మలుపు: దశాబ్దాల పాటు జనాభా విస్ఫోటనం గురించి చర్చించుకున్న మన దేశం, ఇప్పుడు సరిగ్గా వ్యతిరేకమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. 2023 నాటికి దేశంలో జననాల సంఖ్య ఏకంగా 1974 నాటి స్థాయికి పడిపోవడం గమనార్హం. జనాభా స్థిరత్వానికి లేదా వృద్ధికి కనీసం 2.1 సంతానోత్పత్తి రేటు అవసరం కాగా, ప్రస్తుతం అది 1.9కి చేరింది. ఈ గణాంకాలు భవిష్యత్తులో దేశ జనాభా స్వరూపంలో రాబోతున్న పెను మార్పులకు స్పష్టమైన సంకేతాలుగా నిలుస్తున్నాయి. ప్రపంచ దేశాలన్నింటికీ మన దేశమే అతిపెద్ద శ్రామిక శక్తిని అందిస్తుందని గర్వంగా చెప్పుకునేవాళ్లం. కానీ, సంతానోత్పత్తి రేటు ఇలాగే పడిపోతూ వస్తే, రాబోయే కొన్ని దశాబ్దాల్లో మనకు యువ ఉద్యోగుల కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఒకప్పుడు దేశ అభివృద్ధికి ప్రధాన బలముగా మారిన 'డెమోగ్రాఫిక్ డివిడెండ్' క్రమంగా ముగింపు దశకు చేరుకుని, వృద్ధుల సంఖ్య పెరిగే 'డెమోగ్రాఫిక్ ట్రాన్సిషన్' వైపు భారత్ వేగంగా పయనిస్తోంది. స్థిరపడిన తర్వాతే పెళ్లి చేసుకోవాలనుకుంటారు కొంత మంది. స్థిరపడేసరికి వయసయిపోతుంది. ఇలాంటి సమస్య దేశానికి వస్తే ఎలా ఉంటుంది? ఇప్పుడు భారత్ అలాంటి పరిస్థితులోకి వెళ్తోంది. దేశం ఇప్పటికి అభివృద్ధి చెందుతున్న దేశమే. 2047కి అభివృద్ధి చెందిన దేశంగా మారాలని టార్గెట్ పెట్టుకున్నారు. అప్పటికి ఆ లక్ష్యం సాధించినా దేశం మాత్రం వృద్ధాప్యంలోకి వెళ్లబోతోంది.దక్షిణాదికి చెందిన ముఖ్యమంత్రులు, ముఖ్య నాయకులు ఎక్కువ మంది పిల్లల్ని కనండి.. జనాభాను పెంచండి అని చేసిన ప్రకటనలను చూసి సోషల్ మీడియాలో, సాధారణ చర్చల్లో చాలా మంది తేలిగ్గా నవ్వుకున్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వేధిస్తున్న ప్రస్తుత కాలంలో మళ్లీ పిల్లల్ని కనమని చెప్పడమేమిటంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కానీ, ఆ నాయకుల మాటల్లో కేవలం రాజకీయ స్వార్థం మాత్రమే కాదు.. భవిష్యత్ భారతదేశాన్ని ముంచెత్తబోతున్న ఒక పెను జనాభా సంక్షోభం తాలూకు ఆందోళన కూడా దాగి ఉందన్న కఠిన వాస్తవాన్ని ప్రముఖ అంతర్జాతీయ రేటింగ్స్ సంస్థ మూడీస్ తాజా నివేదిక కళ్లకు కట్టింది.భారత్‌లో సంతానోత్పత్తి రేటు ఇప్పటికే స్థిరీకరణ స్థాయిగా భావించే రీప్లేస్‌మెంట్ లెవల్ 2.1 కంటే కిందకు పడిపోయింది. 2024 నాటికే మన దేశంలో 65 ఏళ్లు పైబడిన వారి శాతం 7 దాటి, భారత్ అధికారికంగా ఏజింగ్ దశలోకి అడుగుపెట్టింది. 2049 నాటికి ఈ వాటా 14 శాతానికి పెరిగి ఏజ్డ్ సమాజంగా, ఆ తర్వాత కేవలం 16 ఏళ్ల వ్యవధిలోనే అంటే 2065 నాటికి 21 శాతానికి చేరి సూపర్ ఏజ్డ్ దేశంగా భారత్ మారబోతోంది. అమెరికా వంటి అగ్రరాజ్యానికి ఏజ్డ్ నుంచి సూపర్ ఏజ్డ్ కావడానికి 19 ఏళ్లు, ఇండోనేసియాకు 29 ఏళ్లు పడితే.. భారత్ అత్యంత వేగంగా ఆ విషవలయంలోకి చేరిపోతుంది.ఇక్కడ అసలైన ప్రమాదం వృద్ధుల సంఖ్య పెరగడం ఒక్కటే కాదు. మనం ఎంత సంపన్నమైన తర్వాత వృద్ధులవుతున్నామన్నదే అసలు సమస్య. జపాన్, యూరప్, అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలు ముందుగా పారిశ్రామికంగా ఎదిగి, ఆర్థికంగా పరిపుష్టమై, పూర్తిస్థాయిలో ధనిక దేశాలు గా మారిన తర్వాతే వృద్ధాప్య సమాజాలుగా మారాయి. కానీ భారత్ వంటి వర్ధమాన దేశాలు ఇంకా తలసరి ఆదాయంలో అట్టడుగున ఉన్న తరుణంలోనే వృద్ధాప్యంలోకి జారుకుంటున్నాయి. అంటే, ధనిక దేశం కాకముందే వృద్ధ దేశంగా మారే ప్రమాదం మన ముంగిట ఉంది. అత్యంత తక్కువ ఆదాయం ఉన్న దశలోనే కోట్లాది మంది వృద్ధులకు ఉచిత వైద్యం, పెన్షన్లు, దీర్ఘకాలిక సంరక్షణ భారాన్ని ప్రభుత్వాలు మోయాల్సి రావడం దేశ ఆర్థిక వ్యవస్థనే కుదేలు చేసే అంశం.పనిచేసే చేతులు తగ్గడం వల్ల ఉత్పాదకత తగ్గి, పన్నులు కట్టే యువతరం క్షీణిస్తే దేశ అభివృద్ధి చక్రం ఆగిపోతుంది. వినియోగదారులు తగ్గితే మార్కెట్ డిమాండ్ పడిపోయి పరిశ్రమలు నష్టపోతాయి. కేరళ కంటే ప్రస్తుతం చాలా రాష్ట్రాలు తక్కువ సంతానోత్పత్తి రేటును కలిగి ఉన్నప్పటికీ, అక్కడ సుదీర్ఘ కాలంగా సంతానోత్పత్తి రేటు తక్కువగా నమోదవుతోంది... 25 ఏళ్లలోపు జనాభా 37.4% జనాభాలో మూడవ వంతు ఉన్నారు. కేరళలో సంతానోత్పత్తి రేటు 1991 నాటికి 1.8కి పడిపోయింది. ప్రస్తుతం కేరళ (1.7 శాతం) కంటే తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, జమ్మూ కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్‌లో సంతానోత్పత్తి రేటు 1.6 శాతంగా ఉంది. 1991 నాటికి ఈ రాష్ట్రాల్లో సంతానోత్పత్తి రేటు 3 కన్నా ఎక్కువ ఉండగా.. తమిళనాడులో మాత్రమే 2.2 శాతంగా ఉంది. తత్ఫలితంగా కేరళ కంటే 25 ఏళ్లలోపు జనాభా ఎక్కువ ఉంది.పట్టణ ప్రాంతాల్లో సంతానోత్పత్తి తక్కువగా ఉన్నందున, 25 ఏళ్లలోపు వారి సంఖ్య గ్రామీణ ప్రాంతాల కంటే తక్కువగా ఉంది. పట్టణ ప్రాంతాలకు వలసలు కూడా ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో మహిళల్లో ఎక్కువ ఆయుఃప్రమాణం.. దశాబ్దాలుగా లింగ నిష్పత్తులు క్షీణించడం వల్ల మహిళల్లో 25 ఏళ్లలోపు వారి నిష్పత్తి పురుషుల కంటే తక్కువగా ఉంటుంది. జాతీయంగా 47.4 శాతం ఉన్న పురుష జనాభాతో పోలిస్తే 25 ఏళ్ల కంటే తక్కువ వయస్సు మహిళల శాతం 46.3 శాతంగా ఉంది.దేశానికి లభించిన అతిపెద్ద వరం డెమోగ్రాఫిక్ డివిడెండ్ . ఈ కాలం ముగిసిపోవడానికి మనకు మిగిలి ఉన్న సమయం చాలా తక్కువ. ఈ ముప్పును గుర్తించి హెచ్చరిస్తున్న నాయకులను ఎగతాళి చేస్తూ కాలం గడిపితే.. యువ భారతం అతి త్వరలోనే భరించలేని ఆర్థిక భారంతో కుంగిపోయే వృద్ధ భారతం గా మిగిలిపోవడం తథ్యం.

జగిత్యాలలో మానవత్వం చాటుకున్న పట్టణ సీఐ కరుణాకర్

- భిక్షాటన చేస్తున్న చిన్నారులను చేరదీసి, చదివిస్తానని భరోసా
- జిల్లా బాలల సంరక్షణ అధికారులకు అప్పగింత



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 6 (ప్రజాకలం)

చేతుల్లో పుస్తకాలు పట్టుకుని బడికి వెళ్లాల్సిన పసిప్రాయంలో, భిక్షాపాత్రలు పట్టుకుని రోడ్డెక్కిన ఇద్దరు చిన్నారుల దీనస్థితి జగిత్యాల పట్టణంలో అందరినీ కలచివేసింది. ఎండను సైతం లెక్కచేయకుండా తల్లిదండ్రులతో కలిసి భిక్షాటన చేస్తున్న నాలుగైదేళ్ల వయసున్న చిన్నారులను జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్ చూసి చలించిపోయారు. విధులకు వెళ్తున్న సమయంలో తహసీల్ చౌరస్తా వద్ద ఈ హృదయ విదారక దృశ్యం ఆయన దృష్టికి వచ్చింది. క్షణం కూడా ఆలోచించకుండా తన వాహనాన్ని ఆపి, వెంటనే చిన్నారుల వద్దకు వెళ్లారు. వారిని ఎంతో ఆప్యాయంగా చేరదీసి కొద్ది సేపు మాట్లాడారు. "చదువుకుంటారా.. మిమ్మల్ని చదివిస్తా" అంటూ వారిలో ఆత్మస్థైర్యం, భరోసా నింపారు. పోలీస్ అధికారి వెంట వస్తామని చిన్నారులు అమాయకంగా చెప్పడంతో, వారిని ఆటోలో సురక్షితంగా తరలించారు. అనంతరం వెంటనే జిల్లా బాలల సంరక్షణ అధికారులకు సమాచారం అందించి, ఆ చిన్నారుల సంక్షేమం, విద్య మరియు భద్రతకు అవసరమైన తదుపరి చర్యలు చేపట్టారు. కేవలం నేర నియంత్రణకే పరిమితం కాకుండా, సమాజంలోని బలహీన వర్గాలు ముఖ్యంగా నిస్సహాయులైన చిన్నారుల సంక్షేమంపై కూడా పోలీసులు బాధ్యతగా దృష్టి సారించాలనే నిజాన్ని ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది. సమయస్ఫూర్తితో వ్యవహరించి చిన్నారుల జీవితంలో వెలుగు నింపడానికి ముందుకొచ్చిన సీఐ కరుణాకర్ చొరవను స్థానికులు, ఉన్నతాధికారులు అభినందిస్తున్నారు.

ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలి

ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలి – పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట వామపక్షాల నిరసన



పెద్దపల్లి,అక్టోబర్ 06:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) ఎస్ఐఆర్‌ను వెంటనే రద్దు చేసి,కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను బాధ్యతల నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ఎదుట వామపక్ష పార్టీలు సీపీఐ,సీపీఎం,సీపీఐ–ఎంఎల్ న్యూ డెమోక్రసీ,మాస్ లైన్ ఆధ్వర్యంలో భారీ నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం సహా వామపక్ష నాయకులు మాట్లాడుతూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.కేంద్రంలో బీజేపీకి కొమ్ముకాసే విధంగా గత పది నెలలుగా ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా నమోదు ప్రక్రియ పేరిట దేశవ్యాప్తంగా దాదాపు13 కోట్ల ఓట్లను కేంద్ర ఎన్నికల కమిషనర్ ఏకపక్ష నిర్ణయంతో తొలగించారని మండిపడ్డారు.భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడికి రాజ్యాంగబద్ధంగా కల్పించిన పవిత్రమైన ఓటు హక్కును కాలరాసే నైతిక హక్కు ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు ఎక్కడిదని ప్రశ్నించారు. బీజేపీ వ్యతిరేక ఓట్లను లక్ష్యంగా చేసుకుని ముస్లిం,క్రైస్తవ మైనార్టీలు,దళితులు,ఆదివాసీల ఓట్లను కుట్రపూరితంగా తొలగించారని నేతలు ఆరోపించారు. ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీలో 10 నెలల కాలంలో 14 సార్లు ఇద్దరు సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ,వారి మాటలను ఏమాత్రం ఖాతరు చేయకుండా ఏకపక్ష నిర్ణయాలతో ఓట్లను తొలగించడం దారుణమన్నారు. అన్యాయంగా తొలగించిన13 కోట్ల ఓట్లను తక్షణమే పునరుద్ధరించాలని,అర్హులైన కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని,రాజ్యాంగాన్ని,ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ డిమాండ్లను నెరవేర్చకపోతే రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం,సీపీఎం జిల్లా నాయకులు భిక్షపతి,సీపీఐ–ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె.రాజన్న, మాస్ లైన్ జిల్లా నాయకులు గుమ్మడి వెంకన్న,సీపీఐ రాష్ట్ర నాయకులు గౌతమ్ గోపర్ధన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కె. కనకరాజ్,స్వామి,కౌన్సిల్ సభ్యులు లెనిన్,మానస్,పట్టణ కార్యదర్శి కల్లేపల్లి నవీన్,నాయకులు పద్మ,శంకరన్న,రాధా, నరేష్,రాజేష్,తోకల రమేష్,అశోక్,సిపెల్లి రవీందర్,జి.జ్యోతి, గుమ్మడి కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

సహకార స్ఫూర్తితో సౌర శక్తి

- శ్రీరాంపూర్‌లో విద్యుత్ ప్లాంట్ చార్జింగ్
- విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వడ్లకొండ గంగాధర్




పెద్దపల్లి,అక్టోబర్ 06:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి విద్యుత్ నిర్వహణ విభాగం పరిధిలోని కాల్వ శ్రీరాంపూర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 1 మెగావాట్ సామర్థ్యం గల సౌర విద్యుత్ కేంద్రాన్ని మంగళవారం సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ వడ్లకొండ గంగాధర్ విద్యుద్దీకరణ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా పర్యవేక్షక ఇంజనీర్ గంగాధర్ మాట్లాడుతూ పర్యావరణహిత సౌర విద్యుత్ ఉత్పత్తి వల్ల పునరుత్పాదక ఇంధన వినియోగం మరింత పెరుగుతుందని,తద్వారా స్థానిక ప్రాంత విద్యుత్ అవసరాలకు అదనపు విద్యుత్ సమకూరుతుందని తెలిపారు.రైతాంగం, సామాన్య వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సౌర విద్యుత్ ప్రాజెక్టులను విస్తృతంగా ప్రోత్సహించేందుకు తెలంగాణ ఉత్తర మండల విద్యుత్ పంపిణీ సంస్థ నిరంతరం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి శ్రీమల,పెద్దపల్లి నిర్వహణ విభాగ ఈఈ సిహెచ్. రాజబ్రహ్మచారి,ఎంఆర్‌టీ డీఈఈ కె.శ్రీనివాస్ రెడ్డి,కాల్వశ్రీరాంపూర్ ఏడీఈ టి.రవీందర్,ఏఈ శ్రీనివాస్,ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి,విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సేవా సంకల్ప అభియాన్‌లో విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం

- మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్



(వరంగల్/ పర్వతగిరి) అక్టోబర్ 06, ప్రజాకలం ప్రతినిధి:

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని, ప్రజా ప్రతినిధిగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్లో భాగంగా పర్వతగిరి మండలం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని బీజేపీ పర్వతగిరి మండల అధ్యక్షులు హార్కవత్ వినోద్ కుమార్, మాజీ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వర్ధన్నపేట నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు, బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షులు కొండేటి శ్రీధర్ పాల్గొని విద్యార్థులను అభినందించారు. వ్యాస రచన పోటీలలో ప్రథమ స్థానం – సాత్విక్ 10వ తరగతి, ద్వితీయ స్థానం – ఎం. అర్వి 10వ తరగతి, తృతీయ స్థానం జీ. హారిక, విజేత విద్యార్థులకు షీల్డులు అందజేసిన బీజేపీ శ్రేణులు ఈ సందర్భంగా కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ, విద్యార్థుల్లోని సృజనాత్మకతను, ఆలోచనా శక్తిని, ప్రతిభను వెలికితీయడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి డా. వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్, కూడికలా శ్రీధర్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు గాయత్రి విద్యార్థులు ఎంపిక




పెద్దపల్లి,అక్టోబర్ 06:(ప్రజకలం జిల్లా ప్రతినిధి) ఇటీవల గోదావరిఖనిలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-13 సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలలో పెద్దపల్లికి చెందిన గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించి జిల్లా జట్టులో స్థానం దక్కించుకున్నారు.రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్,కరస్పాండెంట్ రజనీదేవి పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలోనూ ముందంజలో ఉండాలని సూచించారు.క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని,నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని ఉన్నత స్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్రానికి, దేశానికి మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ నెల 16న హనుమకొండ వేదికగా జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో ఈ ఎనిమిది మంది విద్యార్థులు ఉమ్మడి జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు.ఈ అభినందన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విజేందర్,వ్యాయామ ఉపాధ్యాయులు అజయ్,మహేందర్,ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

పసికందు భవిష్యత్తుకు భరోసా

- పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో అరుదైన చికిత్స విజయవంతం

పెద్దపల్లి:అక్టోబర్ 06:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

లక్ష మందిలో ఏ ఒక్కరికో కనిపించే అత్యంత అరుదైన పుట్టుకతో వచ్చే మోకాలి లోపాన్ని పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి వైద్యులు సమర్థవంతంగా సరిదిద్ది తమ ప్రతిభను చాటుకున్నారు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం జీడీనగర్‌కు చెందిన గీత అనే మహిళకు జన్మించిన శిశువులో మోకాలు సాధారణ దిశకు విరుద్ధంగా వెనక్కి వంగి ఉండటాన్ని పసికందు పుట్టిన వెంటనే పిల్లల వైద్యులు గుర్తించారు. వైద్య పరిభాషలో కంజెనిటల్ నీ డిస్లోకేషన్ అని పిలిచే ఈ అరుదైన సమస్యపై డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్ పర్యవేక్షణలో పిల్లల వైద్య విభాగం,ఎముకలు-కీళ్ల వైద్య నిపుణులు తక్షణమే స్పందించారు.ఇరు విభాగాల వైద్యులు సమన్వయంతో ఆధునిక పద్ధతుల్లో చికిత్స ప్రారంభించి,మోకాలి అమరికను విజయవంతంగా సరిచేశారు.ప్రస్తుతం శిశువు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని,ఇలాంటి సమస్యలను పుట్టిన వెంటనే గుర్తించి చికిత్స అందించడం వల్ల భవిష్యత్తులో నడకలో తలెత్తే తీవ్ర వైకల్యాన్ని నివారించవచ్చని డాక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు.కార్పొరేట్ స్థాయికి దీటుగా జిల్లా ఆసుపత్రిలోనే ఈ సంక్లిష్ట చికిత్సను విజయవంతం చేయడంపై చిన్నారి తల్లిదండ్రులు వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.



నిరంతర విద్యుత్ సరఫరాకు పటిష్ట చర్యలు


- టీజీఎన్పీడీసీఎల్ డైరెక్టర్ టి.మధుసూదన్



పెద్దపల్లి,అక్టోబర్06:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ, మౌలిక వసతులను బలోపేతం చేయాలని టీజీఎన్పీడీసీఎల్ డైరెక్టర్ టి.మధుసూదన్ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఆయన పెద్దపల్లి డివిజన్ పరిధిలోని సుగ్గాంపల్లి 132/33 కేవీ సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి,132 కేవీ సర్క్యూట్‌తో పాటు అన్ని 33 కేవీ ఫీడర్లలో నమోదవుతున్న గరిష్ఠ విద్యుత్ లోడ్ల పరిస్థితిని సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ సీజన్ నేపథ్యంలో రైతులకు నాణ్యమైన,అంతరాయం లేని నిరంతర విద్యుత్ సరఫరా అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు.సబ్‌స్టేషన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లపై రోజువారీ లోడ్లను నిశితంగా గమనిస్తూ,అధిక లోడ్ ఉన్న ప్రాంతాలను ముందే గుర్తించి లోడ్ బ్యాలెన్సింగ్ మరియు ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలను సిద్ధం చేయాలని సూచించారు.సబ్‌స్టేషన్‌లోని పరికరాలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ సాంకేతిక లోపాలు తలెత్తకుండా చూడాలని,సరఫరాలో ఏదైనా అంతరాయం ఏర్పడితే క్షేత్రస్థాయి సిబ్బంది తక్షణమే స్పందించి పునరుద్ధరించాలని హెచ్చరించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో సీఈ, ఎస్ఈ,పెద్దపల్లి ఆపరేషన్ ఎస్ఈ,డీఈ,స్థానిక డీఈ,ఏడీఈలు తదితర విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కిష్టన్న కుటుంబానికి అండగా సర్పంచ్, మాజీ ఎంపీటీసీ

గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 6, ప్రజా కలం:జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం అమరవాయి గ్రామానికి చెందిన తోక కిష్టన్న (48) అనారోగ్య కారణాలతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ తూమ్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి కిష్టన్న పార్థివదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియల నిర్వహణ కోసం ఆర్థిక సహాయం అందజేసి కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. మృతుడు తోక కిష్టన్నకు ఇద్దరు కుమారులు ఉన్నారు.



భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి,అక్టోబర్ 06:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో అదనపు కలెక్టర్ శ్రీరాములు తో కలిసి అటవీ, నీటిపారుదల,రెవెన్యూ శాఖల అధికారులతో భూ సేకరణ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

కానంపల్లి చెరువు భూ సేకరణ పూర్తి చేయాలి....ధర్మారం మండలం కానంపల్లి చెరువుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.భూ సేకరణకు సంబంధించి ఇంకా పరిష్కరించాల్సిన అంశాలను గుర్తించి,సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

పెద్దపల్లి బైపాస్ రైతులతో చర్చలు...పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి భూములు కోల్పోతున్న రైతులతో చర్చలు నిర్వహించాలని సూచించారు. రైతుల సమస్యలు,అభిప్రాయాలను తెలుసుకుని,వారికి అవసరమైన వివరాలను స్పష్టంగా తెలియజేస్తూ పరస్పర అవగాహనతో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అభివృద్ధి పనులకు రైతులు సహకరించాలి.... పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణం జిల్లా అభివృద్ధి,ప్రజల రవాణా సౌకర్యం దృష్ట్యా ఎంతో అవసరమైనదని తెలిపారు. అభివృద్ధి పనుల ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకుని రైతులు సహకరించాలని కోరారు.రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా వారి సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

చట్ట ప్రకారం పరిహారం చెల్లింపు

భూ సేకరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు చట్టం, నిబంధనల ప్రకారం అందాల్సిన పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతులతో చర్చలు జరిపి, వారి సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కరించడంతో పాటు, చట్ట ప్రకారం న్యాయమైన పరిహారం అందేలా చర్యలు చేపడతామని తెలిపారు.భూ సేకరణకు సంబంధించిన రికార్డులు,పరిహారం చెల్లింపులు, పెండింగ్‌లో ఉన్న ఇతర అంశాలను శాఖల వారీగా సమీక్షిస్తూ నిర్దిష్ట సమయంలోగా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్డీఓ బి. గంగయ్య,తహసిల్దార్ రాజయ్య,అటవీ, నీటిపారుదల,రెవెన్యూ శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ఇన్నోవా వాహనాల తనిఖీ

- వాహనాల కండిషన్‌తో పాటు డ్రైవర్ల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్



నాగర్‌కర్నూల్, అక్టోబర్ 6 (ప్రజా కలం): జిల్లాలోని పోలీస్ వాహనాల నిర్వహణ, డ్రైవర్ల ఆరోగ్యం, రోడ్డు భద్రతపై జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ జిల్లా పోలీస్ శాఖకు చెందిన ఇన్నోవా వాహనాలను తనిఖీ చేసి వాటి స్థితిగతులను పరిశీలించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన ఇన్నోవా వాహనాలను పరిశీలించిన ఎస్పీ వాహనాల కండిషన్, టైర్లు, ఇంజిన్, బ్రేకులు తదితర అంశాలపై సంబంధిత సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. వాహనాల్లో ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే వాటిని వెంటనే గుర్తించి మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ వాహనాలు నిరంతరం విధుల్లో ఉండే నేపథ్యంలో వాటి నిర్వహణలో నిర్లక్ష్యం చేయరాదని ఎస్పీ సూచించారు. వాహనాలను ఎప్పటికప్పుడు సర్వీసింగ్ చేయిస్తూ, చిన్నపాటి లోపాలు కూడా పెద్ద ప్రమాదాలకు దారితీయకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాహనాలను నడిపే డ్రైవర్ల ఆరోగ్యం కూడా వాహనాల భద్రతకు అంతే ముఖ్యమని అయన పేర్కొన్నారు. ప్రతి డ్రైవర్‌కు నెలకు ఒకసారి మెడికల్ చెకప్‌తో పాటు కంటి పరీక్షలు నిర్వహించాలని పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి రాఘవరావును ఆదేశించారు. అనారోగ్య సమస్యలు ఉన్న డ్రైవర్లను గుర్తించి అవసరమైతే వారిని డ్రైవింగ్ విధుల నుంచి తప్పించాలని సూచించారు. అటువంటి సందర్భాల్లో కొత్త డ్రైవర్లకు అవసరమైన శిక్షణ అందించి విధుల్లో నియమించాలని చెప్పారు. డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలని, వేగ నియంత్రణ పాటిస్తూ పోలీస్ వాహనాలు, అందులో ప్రయాణించే సిబ్బంది భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని డ్రైవర్లకు ఎస్పీ సూచించారు. పోలీస్ వాహనాలను జాగ్రత్తగా నిర్వహించడం ద్వారా అనవసరమైన ప్రమాదాలను నివారించవచ్చని, వాహనాల నిర్వహణతో పాటు డ్రైవర్ల ఆరోగ్యంపై కూడా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఎస్పీ స్పష్టం చేశారు.ఈ తనిఖీ కార్యక్రమంలో ఎంటీఓ ఆర్ఐ రాఘవరావు, అడ్మిన్ ఆర్ఐ జగన్, ఎస్‌బీ ఎస్ఐ శ్రీనివాసులు, ఆర్ఎస్ఐ గౌస్ పాషా, వాహనాల మెకానిక్‌లు, జిల్లాలోని ఇన్నోవా వాహనాల డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

దాసరి కుట్రలో భాగమే బీసీలపై దాడులు

నాలుగు బీసీ సంఘాల సంయుక్త ప్రకటన - వ్యక్తిగత దాడులు కాదు.. బీసీ సమాజంపైనే దాడి

తప్పుడు అట్రాసిటీ కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలి - రాష్ట్రంలో బీసీ రక్షణ చట్టం తేవాలని డిమాండ్



పెద్దపల్లి,అక్టోబర్ 06:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి నియోజకవర్గంలో ఇటీవల జరిగిన బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో బీసీ వర్గాలపై జరిగిన దాడులు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ప్రేరేపిత దాడులేనని నాలుగు ప్రధాన బీసీ సంఘాల నాయకులు తీవ్రస్థాయిలో ఖండించారు.ఈ దాడులు ఏ ఒక్క వ్యక్తికో పరిమితమైనవి కావని,యావత్ బీసీ సమాజంపై జరిగిన దాడిగా వారు అభివర్ణించారు.మంగళవారం పెద్దపల్లిలోని ఆర్కే గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బహుజన ప్రజాస్వామిక వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు తాడూరు శ్రీమన్నారాయణ,పెద్దపల్లి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నల్లవెల్లి శంకర్,తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కందుల సదాశివ్,జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామిని రాజేశం సంయుక్తంగా మాట్లాడారు.దాసరి మనోహర్ రెడ్డి బీసీలపై దాడులు చేయించడమే కాకుండా,వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పోలీసులపై ఒత్తిడి తేవడం ఆయన కక్షసాధింపు వైఖరికి నిదర్శనమని నాయకులు మండిపడ్డారు.దాసరి అనుచరులతోనే ఈ కేసులు పెట్టించారని ఆరోపిస్తూ,ఆ అక్రమ కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.కేసులు ఎత్తివేసేవరకు జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున బీసీ ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఎస్సీ,బీసీల మధ్య ఉన్న సోదరభావాన్ని దెబ్బతీసేందుకే ఈ తరహా కుట్రలు పన్నుతున్నారని వారు విమర్శించారు.పెద్దపల్లి నియోజకవర్గంలో పెరుగుతున్న బీసీల ఐక్యత,రాజకీయ చైతన్యాన్ని ఓర్వలేకనే ఆధిపత్య వర్గాలు ఇలాంటి హింసాత్మక దాడులకు ఉసిగొల్పుతున్నాయని పేర్కొన్నారు.భవిష్యత్తులో ఏ రాజకీయ పార్టీకి చెందిన ఆధిపత్య శక్తులైనా బీసీలపై దాడులకు దిగితే వారి రాజకీయ భవిష్యత్తును బొందపెట్టడం ఖాయమని స్పష్టం చేశారు.రాష్ట్రంలో బీసీలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే బీసీ రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.ఆధిపత్య శక్తుల కుట్రలను సూక్ష్మంగా గమనించి,బీసీ సమాజం ఏకతాటిపై నిలబడి వాటిని భగ్నం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో వివిధ బీసీ సంఘాల నేతలు కందుల అశోక్ పటేల్,చర్లపల్లి సురేష్ గౌడ్,శంకర్ గౌడ్,రాజేందర్,సురేష్,బొల్లం భూమేష్,సురేష్ విశ్వకర్మ,మహేష్,మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మేడగోని శ్రీనివాస్ గౌడ్,బొడ్డుపల్లి లక్ష్మణ్‌తో పాటు వివిధ బీసీ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జర్నలిస్టులందరికీ ఇండ్లు ఇవ్వాలి

పట్టాలున్న పంపిన శూన్యం - ప్రభుత్వాలు మారినా జర్నలిస్ట్ ల బతుకులు మారలేదు

మహబూబ్‌నగర్ అర్బన్ తాసిల్దార్ కార్యాలయం ముందు టిడబ్ల్యూజేఎఫ్ ధర్నా

ఈనెల 10న పాలమూరు టు ప్రజా భవన్ జర్నలిస్టుల పాదయాత్ర - ప్రజా ప్రభుత్వం జర్నలిస్టులకు వెంటనే ఇండ్లు ఇవ్వాలి

ధర్నాలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయకుమార్. జాతీయ కమిటీ సభ్యులు పసుపుల శ్రీనివాస్.

జిల్లాలో ప్రతి జర్నలిస్టులకు ఇండ్లు ఇవ్వాలి- టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి మొలకపల్లి గోపాల్ మహారాజ్. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గండిటి నరసింహులు. - చనిపోయిన జర్నలిస్టు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 06:

మహబూబ్ నగర్ పట్టణంలో అనేక సంవత్సరంలో పనిచేస్తున్న సీనియర్ జర్నలిస్టులకు ఇండ్లు లేక చాలా ఇబ్బందులతో ఉన్నారని తక్షణమే ప్రభుత్వం జిల్లా అధికారులు జర్నలిస్టులకు ఇండ్లు ఇవ్వాలని టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉ పాధ్యక్షులు బండి విజయకుమార్ అన్నారు. మంగళవారం టి డబ్ల్యూ జె ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అర్బన్ తహసిల్దార్ కార్యాలయం ముందు జరిగిన ధర్నా కార్యక్రమానికి ఆయన ముఖ్య హాజరై మాట్లాడారు. ఇండ్ల కోసం అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న పాలక యంత్రాంగం గాని జిల్లా అధికారులు పట్టించుకోవడంలేదని ఆయన అన్నారు. జర్నలిస్టులకు ఇల్లు ఇవ్వాలంటే 360 డిగ్రీల పేరుతో సర్వేలు చేయించి అనర్హులుగా ప్రకటించే ఆలోచన విధానాన్ని స్వస్తి పలకాలని ఆయన కోరారు. అర్హు లైన ప్రతి జర్నలిస్టులకు ఇల్లు ఇవ్వకపోగా కాలయాపన చేస్తూ నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఇల్లు నిర్మించి పట్టాలు ఇచ్చినా కూడా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో టీ డబ్ల్యూజె ఎఫ్ ఆధ్వర్యంలో చేసిన రిలే దీక్షల వల్ల హామీల వల్ల దీక్షలను విరమించడం జరిగిందని కానీ ఆ హామీలు నేటి వరకు అమలు కాలేదని ఆయన అన్నారు. కొంతమంది జర్నలిస్టులు సొంత గూడు లేకపోవడంతో అనారోగ్యాల బారిన పడి చనిపోయినట్లు ఆయన తెలిపారు. చాలామంది జర్నలిస్టులు కిరాయిలు కట్టలేక చాలా ఆర్థిక ఇబ్బందులతో ఉన్నారని ఆయన అన్నారు. గతంలో పట్టాలు ఇచ్చిన జర్నలిస్టులకు వెంటనే తాళాలు ఇవ్వాలని ఆయన అన్నారు. ప్రభుత్వాలు మారిన జర్నలిస్ట్ ల బతుకుల మారలేదనితెలిపారు.అనేకమంది జర్నలిస్టులకు ఇల్లు / పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. ఇండ్ల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి జర్నలిస్టులకు అండగా నిలవాలని ఆయన కోరారు. లేనియెడల ఈనెల ఈనెల 10వ తారీఖున పాలమూరు టు ప్రజా భవన్ వరకు జర్నలిస్టుల పాదయాత్ర ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.జిల్లాలో ప్రతి జర్నలిస్టులకు ఇండ్లు ఇవ్వాలి మహబూబ్‌నగర్ జిల్లాలో మండలాలు తాలూకాలు లో పనిచేస్తున్న జిల్లాలో పనిచేస్తున్న మండల తాలూకాలలో మండల కేంద్రాల్లో తాలుకాల్లో వర్కింగ్ జర్నలిస్ట్ గా పనిచేస్తున్న జర్నలిస్టుల అందరికీ ఇంట్లో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి గోపాల్ మారాజ్.గండిటి నరసింహులు డిమాండ్ చేశారు. మీడియా రంగంలో అనేకమంది యువత ముందుకు వచ్చి ప్రజాసేవ కోసం పని చేస్తున్నారని తెలిపారు. యూట్యూబ్ ఛానల్ లో పనిచేసేవారికి కూడా ఇండ్లు ఇవ్వాలని అయన కోరారు.ప్రభుత్వం చనిపోయిన జర్నలిస్ట్ లను ఆదుకోవాలని ఐ ఎఫ్ డబ్ల్యూజె జాతీయ కమిటి సభ్యులు పసుపుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. కొంతమంది ఇండ్లు లేని జర్నలిస్ట్ లు చనిపోయారని జిల్లా అధికారులు వెంటనే ఇవ్వలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మెట్టు కాడిప్రభాకర్ మాట్లాడారు. తక్కణమే ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మహబూబ్ నగర్ అర్బన్ తహసీల్దార్ ఘని నాయక్ కు బండి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు.జర్నలిస్ట్ లకు ఇండ్లు ఇవ్వాలని జర్నలిస్ట్ లు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం నశించాలని నినాదాలు చేసి జర్నలిస్ట్ ఐక్యత ను చాటారు. ఈ కార్యక్రమం లో జిల్లా జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి లింగగల్ల నరసింహులు, అటఇయ జాతీయ కమిటీ సభ్యులు మోయాజ్,ఎయట జిల్లా కమిటి నాయకులు రామకృష్ణ,మేకల శ్రీనివాస్ లు,చందు,జర్నలిస్ట్ లు శ్రీనివాస్ లు గౌడ్,జి. శ్రీనివాస్, వెంకట్,అప్రోజ్, నమీర్,జక్కా గోపాల్,నిరంజన్,బాలరాజ్, రాఘవేందర్,తదితరులు జర్నలిస్ట్ లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

నిజమైన లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి


ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు -జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ అక్టోబర్ 06 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటిస్తూ, నిజమైన అర్హులకే ప్రభుత్వ ప్రయోజనం అందేలా క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టాలని సూచించారు. మంగళవారం ఖానాపూర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్థానిక శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం తదితర అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన వారికే అందేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. లబ్ధిదారులను ఎంపిక చేసే ముందు క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయిలో పరిశీలన నిర్వహించి, అర్హతలను నిర్ధారించిన తర్వాతే ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని, నిర్మాణ పనులు వేగంగా జరిగేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి వివిధ శాఖల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. ప్రభుత్వ భూములు, ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే భూ సంబంధిత సమస్యలను పరిశీలించి, అర్హత మేరకు పరిష్కరించాలని అన్నారు. మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, అధికారులు ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ భూములు, ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అందే ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చూడాలని, లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకత పాటించాలని అన్నారు. ముఖ్యంగా స్థానిక గిరిజనులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు ఎదురవుతున్న సమస్యలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని, అర్హులైన పేదలకు సొంతింటి కలను సాకారం చేసే దిశగా పనిచేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఆర్డీవో దేవీదాస్, డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, తహసీల్దార్లు సుజాత, ఖాజా మొయినుద్దీన్, ఎంపీడీవో రాధా రాథోడ్, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన దివ్యాంగులందరికీ సదరం పత్రాలు అందించాలి:- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ అక్టోబర్ 06 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) అర్హులైన దివ్యాంగులందరికీ సదరం ధ్రువీకరణ పత్రాలు అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సదరం ధ్రువీకరణ పత్రాల జారీపై సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇప్పటివరకు నిర్వహించిన శిబిరాలు, జారీ చేసిన సదరం సర్టిఫికెట్లు, పెండింగ్ సంఖ్య, తదితర వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు సదరం శిబిరాలు నిర్వహించి, అర్హులకు పారదర్శకంగా సదరం పత్రాలు అందజేయాలన్నారు. దివ్యాంగులకు ఇబ్బందులు కలగకుండా ప్రక్రియను నిర్వహించాలన్నారు. సదరం శిబిరం వద్ద అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. వెయిటింగ్ లిస్టులో ఉన్న దివ్యాంగులకు శిబిరాల నిర్వహణ తేదీ, సమయం వివరాలు ముందుగానే అందజేయాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ విజయలక్ష్మి, జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానేష్ కుమార్‌ను తొలగించే వరకు ఉద్యమిస్తాం

- సిపిఐ సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి



నాగర్‌కర్నూల్ అక్టోబర్ 6 (ప్రజా కలం): కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ గుప్తాను తక్షణమే పదవి నుంచి తొలగించి, ఆయనపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ముట్టడి, ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను సీపీఎం జిల్లా సీనియర్ కార్యవర్గ సభ్యులు ఆర్.శీనువాసులు అధ్యక్షతన వహించగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్, సీపీఎం జిల్లా కార్యదర్శి బి.పర్వతాలు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని ఎన్నికల కమిషన్, సీబీఐ, ఈడీ, న్యాయవ్యవస్థ, మీడియా వంటి ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రతను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య సంస్థల్లో జోక్యం చేసుకుంటూ తమకు అనుకూలమైన విధానాలను అమలు చేసుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ బీజేపీ, కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని వారు విమర్శించారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాలో జరిగిన మార్పులు, ఓట్ల తొలగింపు వంటి అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తొలగించబడిన ఓట్లను పునరుద్ధరించాలని, వివాదాలకు కారణమైన ఫామ్-6 నిబంధనలను సవరించాలని కోరారు. ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలోనూ అవసరమైన మార్పులు తీసుకురావాలని అన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు, యువత, విద్యార్థులు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆందోళనలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఫయాజ్, పర్వతాలు ఆరోపించారు. ఢిల్లీలో ఆందోళనలను కవర్ చేసేందుకు వెళ్లిన మహిళా జర్నలిస్టులు, విద్యార్థినుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును ఖండించారు. జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించి, ఆరోపణలపై విచారణ చేపట్టే వరకు ప్రజా ఉద్యమాన్ని కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కేశవులు గౌడ్, సీపీఎం జిల్లా నాయకురాలు గీత, సీపీఐ జిల్లా నాయకులు మారేడు శివశంకర్, తుమ్మల బీజ్జు, శ్రీనివాసులు, శివుడు, బండి లక్ష్మీపతి, కృష్ణాజి, టి.కిరణ్ కుమార్, వి.రవీందర్, పి.పరశురాం, ఖుడబాద్దీన్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు టి.మల్లేష్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ప్రేమ్ కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మధుగౌడ్, శివకృష్ణ, ఎండీ యూసుఫ్, కొత్త రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

యువత మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మార్పీఎస్ టి మండల ఉపాధ్యక్షులు ఇందారపు మొగిలి



మల్హర్, అక్టోబర్ 6 ప్రజాకలం ప్రతినిధి.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 9న భూపాలపల్లిలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ టి మండల ఉపాధ్యక్షుడు ఇందారపు మొగిలి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అర్హత కలిగిన యువతీ యువకులు ఈ జాబ్ మేళాకు పెద్ద సంఖ్యలో హాజరై తమ విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను పొందాలని ఆయన కోరారు. డిగ్రీ, పీజీ, ఎంబీఏ వంటి విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు మెగా జాబ్ మేళాకు హాజరై వివిధ రంగాల్లో అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను పరిశీలించవచ్చని పేర్కొన్నారు.

వెల్కులపల్లి పాఠశాలలో అల్పాహారం ప్రారంభం

మంత్రి శ్రీధర్‌బాబు చొరవ.. ప్రారంభించిన సర్పంచ్ బండి స్వామి

మల్హర్, అక్టోబర్ 6 ప్రజాకలం ప్రతినిధి... మల్హర్ రావు మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామంలోని వెల్కులపల్లి ఎం.పి.పి.ఎస్. పాఠశాలలో విద్యార్థులకు అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చొరవతో, హెచ్‌కేఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ బండి స్వామి చేతుల మీదుగా ఈ కార్యక్రమం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బండి స్వామి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పమ్మిడి నిరంజన్ రావు, చల్లా మహేందర్, ఉపాధ్యాయులు సురేష్, గంగరాజు, సీఆర్పీ సమత, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యా బోధనలో ఉత్తమ సేవలకు గౌరవం

ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన తాడిచర్ల సర్పంచ్ బండి స్వామి



మల్హర్, అక్టోబర్ 6 ప్రజాకలం ప్రతినిధి మల్హర్ మండల కేంద్రంలోని తాడిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా, మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి తాడిచర్ల సర్పంచ్ బండి స్వామి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా బండి స్వామి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని, వారి సేవలు సమాజానికి ఆదర్శమని కొనియాడారు.సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి, పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా లభించిన గుర్తింపు తమపై మరింత బాధ్యతను పెంచిందన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్. తిరుపతి, సన్మాన గ్రహీతలు సిహెచ్. పూర్ణచందర్, రాధిక, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పద్మతో పాటు ఉపాధ్యాయులు తిరుపతి, కవిత, మానస, అరుణ్, శ్రీనివాస్, సురేష్, గంగరాజు, రమేష్, సాంబయ్య, సీఆర్పీ సమత తదితరులు పాల్గొన్నారు.

మట్టి పరీక్షా కేంద్రం భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

రైతులకు భూసార పరీక్ష సేవలు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలి

కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నాగర్‌కర్నూల్ అక్టోబర్ 06 (ప్రజా కలం): జిల్లా కేంద్రంలో రూ.65 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న మట్టి పరీక్షా కేంద్రం భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పరిశీలించారు. భూసార పరీక్షలకు అవసరమైన పరికరాల ఏర్పాటు, మిగిలిన పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో చర్చించారు.



మట్టి పరీక్షా కేంద్రానికి సంబంధించిన పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనులకు అవసరమైన నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టాలని, భవనంలో అవసరమైన మరమ్మతులను గుర్తించి వాటికి సంబంధించిన అంచనాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. మట్టి పరీక్షా కేంద్రానికి అందుబాటులో ఉన్న స్థలాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి, రైతులకు భూసార పరీక్షల సేవలు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు స్పష్టం చేశారు. రైతులకు ఉపయోగపడే విధంగా కేంద్రంలో అవసరమైన పరికరాలు, ఇతర సౌకర్యాలను సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నూతన రేషన్ కార్యవర్గ కమిటీ ఎన్నిక

- సెక్రటరీగా నల్లగట్ల కృష్ణ

తల్లాడ,అక్టోబర్ 6 (ప్రజా కలం న్యూస్): తల్లాడ మండలం రేషన్ డీలర్ల కార్యవర్గ సమావేశం లో భాగంగా నాయకోటి రాజు కార్య వర్గ అధ్యక్షతన ఖమ్మం జిల్లా అధ్యక్షులు డి,దర్గయ్య ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగినది. ఈ కమిటీలో భాగంగా గౌరవ అధ్యక్షులుగా పత్తిపాటి ఏసోబు,అధ్యక్షులు. తూము నరసింహారావు ఉపాధ్యక్షులు, ఉపాధ్యక్షులుగా మేడేపల్లి వెంకటాచారి, మండల సెక్రెటరీగా నల్లగట్ల కృష్ణ,కోశాధికారి బానోతు బాలకృష్ణ,మహిళా ప్రతినిధి. రాయల బిందు మాధవి, పాల్గొన్నారు ఈ సందర్భంగా నల్లగట్ల కృష్ణ మాట్లాడుతూ ఇంతటి అవకాశాన్ని కల్పించిన ఖమ్మం జిల్లా అధ్యక్షులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో మండల రేషన్ సీనియర్ డీలర్ల టి బాబు, రామారావు, మణికంఠ, మాన్సింగ్, తదితరులు పాల్గొన్నారు.



గ్రామాల్లో ఉపాధి హామీ ద్వారా పాలం రోడ్ల పనులు పూర్తి చేయండి

- రైతుల సహకారం తీసుకొని పనులు చేయించండి

- ఉపాధి హామీ అధికారులకు సిబ్బందికి సూచించిన ఎమ్మెల్యే పవా ర్ రామారావు పటేల్



నిర్మల్, అక్టోబర్ 6(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): ముధోల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పాలం రోడ్ల పనులు పూర్తిచేయాలని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ సూచించారు. మంగళవారం బైంసాలోని తన నివాసంలో ఎంపీడీవోలు, ఉపాధి హామీ ఏపీవోలు, టి ఏ లు, ఈసీలతో సమీక్షా సమావేశం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వి బి జి రాంజీ పథకంలో గ్రామాల్లో ఫార్మేషన్ రోడ్లకు పెద్ద మొత్తంలో నిధులు ఉన్నాయని, రోడ్లు వేసి, రైతులకు సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గత మూడు సంవత్సరాలుగా పనులు చేయాలని సమీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ పనులు నత్తనడకనా కొనసాగుతున్నాయని ఇకనైనా ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా సూచించారు. ప్రతి ఒక్కరు రైతు బిడ్డలేనని రైతులకు పొలాలకు వెళ్లడానికి రహదారి బాగుంటే ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. రోడ్లకు అవసరమైనన్ని నిధులు ఇస్తానని, కావాలంటే 24 గంటల్లో ప్రొసిడింగ్ అందజేస్తానని పనులు పూర్తి చేయాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. గ్రామ సభలు నిర్వహించి రైతుల సహకారం తీసుకొని రోడ్లు పూర్తి చేయాల్సిందిగా చెప్పారు. అదేవిధంగా ఇంకుడు గుంతల నిర్మాణం, నీటి కుంటల నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు... నిధులు కాగితాలకే పరిమితం కాకుండా వాటిని సద్వినియోగం చేసుకొని ప్రజలకు ఉపయోగపడేలా చూడాలన్నారు. లక్ష్య సాధన తో ముందుకు సాగి పనులను దశలవారీగా పూర్తి చేయాల్సిందిగా సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సమావేశంలో ఏపిడి నాగవర్ధన్, ఎంపీడీవోలు, ఏపీవోలు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

లింగాలపల్లిలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

190 మందికి వైద్య పరీక్షలు.. 85 మందికి రక్త నమూనాల సేకరణ

ఉదయ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచితంగా మందుల పంపిణీ

మహిళల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపిన డాక్టర్ సాత్విక

ప్రజాకలం ప్రతినిధి ఎటపాక, అక్టోబర్ 06:

గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఎటపాక మండలం లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని లింగాలపల్లి ఎంపీపీ పాఠశాల ప్రాంగణంలో మంగళవారం భద్రాచలం డాక్టర్ ఉదయ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్విరామంగా కొనసాగిన ఈ శిబిరంలో సుమారు 190 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, 85 మందికి ఉచితంగా రక్త పరీక్షలు చేపట్టారు. ఈ శిబిరంలో ప్రముఖ స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ రేపాక సాత్విక, డాక్టర్ ఉదయ్ పాల్గొని రోగులను స్వయంగా పరీక్షించి, వారి అనారోగ్య సమస్యలకు అనుగుణంగా తగిన చికిత్సతో పాటు విలువైన సలహాలు, సూచనలు అందజేశారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా ఔషధాలను పంపిణీ చేశారు. ముఖ్యంగా గ్రామీణ మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్త్రీ సంబంధిత దీర్ఘకాలిక సమస్యలు, గర్భాశయ,



రక్తహీనత వంటి అంశాలపై డాక్టర్ సాత్వికను సంప్రదించి చికిత్స పొందారు. గ్రామీణ ప్రాంత ప్రజల ముంగిటకే నాణ్యమైన వైద్య సేవలను తీసుకురావడం అభినందనీయమని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఏజెన్సీ పరినర గ్రామాల్లో ఇలాంటి శిబిరాలను నిరంతరం కొనసాగించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామ ప్రముఖులు రంబాల నాగేశ్వరరావు, మొల సతీష్, కందుల కిరణ్, మాలోత్ గోపి, సవలం రాము, పర్శిక రమేష్, రంగయ్య, అలవాల ప్రభాకర్, ఉదయ్ ఆసుపత్రి సిబ్బంది, స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

అమరజీవి కామ్రేడ్ దొడ్డ కృష్ణయ్య వర్ధంతి సభను విజయవంతం చేయాలి

బాలపేట గ్రామం నుంచి భారీగా తరలిరావాలి - మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు పిలుపు

ఉదయం 7 గంటలకు అన్నారుగూడెం నుంచి భారీ బైక్ ర్యాలీ



తల్లాడ అక్టోబర్ 6, ప్రజా కలం న్యూస్

అమరజీవి కామ్రేడ్ దొడ్డ కృష్ణయ్య 33వ వర్ధంతి సందర్భంగా ఈనెల 7న నిర్వహించనున్న వర్ధంతి సభను విజయవంతం చేయాలని తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.బాలపేట గ్రామ మాజీ సర్పంచ్ కోసూరి వెంకట నరసింహారావు అధ్యక్షతన బాలపేటలో నిర్వహించిన నన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని,వర్ధంతి సభ ఏర్పాట్లు,కార్యక్రమాలపై కార్యకర్తలు,ప్రజలకు దిశానిర్దేశం చేశారు. అమరజీవి కామ్రేడ్ దొడ్డ కృష్ణయ్య ప్రజా సమస్యల కోసం సాగించిన పోరాట స్ఫూర్తిని నేటి తరానికి చాటిచెప్పేలా వర్ధంతి సభను ఘనంగా నిర్వహించాలని దొడ్డ శ్రీనివాసరావు కోరారు.రేపు ఉదయం 7 గంటలకు అన్నారుగూడెంలోని దొడ్డ కృష్ణయ్య భవనం నుంచి భారీ బైక్ ర్యాలీ ప్రారంభం కానుందని,బాలపేట గ్రామం నుంచి ప్రతి ఒక్కరూ పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సంద్ర వెంకట వీరయ్య హాజరు..సాయంత్రం జరగనున్న దొడ్డ కృష్ణయ్య 33వ వర్ధంతి సభకు సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు,ప్రజల అభిమాన నాయకులు సంద్ర వెంకట వీరయ్య ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు.ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు,అభిమానులు,పార్టీ శ్రేణులు, యువత పెద్ద ఎత్తున తరలివచ్చి అమరజీవి కామ్రేడ్ దొడ్డ కృష్ణయ్యకు ఘన నివాళులర్పించాలని దొడ్డ శ్రీనివాసరావు కోరారు. అమరజీవి దొడ్డ కృష్ణయ్య ఆశయాలు, ప్రజా పోరాట స్ఫూర్తిని స్మరించుకునే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. బాలపేట నుంచి భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని వర్ధంతి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పింఛన్ల వెరిఫికేషన్‌పై డీపీఓ ఆరా

సోక్‌పిట్లు, డ్రైనేజీ ఎండ్ పాయింట్ల పరిశీలన

గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 6, ప్రజా కలం:

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం ఎల్కూర్ గ్రామంలో మంగళవారం గ్రామ సర్పంచ్ పి. వినోద్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) శ్రీకాంత్ పర్యటించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పింఛన్ల లబ్ధిదారుల వివరాలను పరిశీలిస్తూ వెరిఫికేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే పింఛన్లు అందేలా వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, వెరిఫికేషన్ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

అనంతరం గ్రామంలోని సోక్‌పిట్లు, డ్రైనేజీ ఎండ్ పాయింట్లను పరిశీలించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సుభావతి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ భవన్ స్థలాన్ని పరిశీలించిన తాళ్ల జోసెఫ్, రావుల గోపి గౌడ్




తల్లాడ ఆగస్టు 6 ప్రజా కలం న్యూస్ తల్లాడ పట్టణంలోని అంబేద్కర్ భవన్ పక్కన నిర్మిస్తున్న స్థలాలను కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల ఉపాధ్యక్షులు తాళ్ల జోసెఫ్, అంబేద్కర్ భవన్ కమిటీ గౌరవ సలహాదారు రావుల గోపి గౌడ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ భవన్ కు వచ్చే వారు సమావేశాలు నిర్వహించుకునే సమయంలో అవస్థలు పడే అవకాశం ఉందని అన్నారు. ఇరుకుగా భవనాలు ఉండటం వల్ల నూతనంగా కట్టే భవనాలకు కూడా గందరగోళం అయ్యే పరిస్థితి ఉందని అన్నారు. అంబేద్కర్ భవనం పక్కన కాకుండా ప్రభుత్వ స్థలాలు ఇంకా అనేక చోట్ల ఉన్నాయని, ఆ స్థలాల్లో ఇతర భవనాలు నిర్మించుకోవాలని సూచించారు. గతంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఐకెపి భవన్ నిర్మాణానికి వైరా రోడ్డులోని ప్రధాని రహదారి పక్కన శంకుస్థాపన కూడా చేశారని, ఆ ప్రదేశంలో నూతన భవనాన్ని నిర్మించుకోవాలని సూచించారు. ఐకెపి నిర్మాణం కోసం తీసిన గుంతలను తక్షణమే పూడ్చివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ ప్రాంతంలో నిరాహార దీక్ష చేపడుతామని ఘాటుగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ నాయకులు నారపోగు ప్రసాద్, కాంపాటి రవి, జీ నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు..

తాడిచర్లలో తాగునీటికి తిప్పలు

వారం రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు బంద్

బోరుబావులు, ప్రైవేట్ ట్యాంకర్లను ఆశ్రయిస్తున్న ప్రజలు

మల్హర్, అక్టోబర్ 6 ప్రజాకలం ప్రతినిధి... మల్హర్ మండల కేంద్రమైన తాడిచర్లలో గత వారం రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి కోసం కాలిబిందెలతో విద్యుత్ బోరుబావుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మరికొందరు తప్పనిసరి పరిస్థితుల్లో సొంత ఖర్చులతో ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటిని తప్పించుకుంటున్నారు. తాడిచర్ల ఏడవ వార్డు, పెద్ద తాడిచర్ల, ఎస్సీ కాలనీ, సుంకరిపల్లె, బీసీ కాలనీల్లో తాగునీటి కష్టాలు తీవ్రంగా ఉన్నాయని స్థానికులు తెలిపారు. నిత్యావసరాలకు నీరు అందక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా తాగునీటి కోసం ఇంతటి కష్టాలు పడాల్సి వస్తోందని వాపోయారు. తమ సొంత ఖర్చులతో ప్రైవేట్ ట్యాంకర్లతో అదనపు ఖర్చుల బారిన పడాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ ఏఈఈ వెంకటేష్ ..“తాడిచర్లలో నీటి సరఫరాకు ఏర్పడిన సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. త్వరలోనే సమస్యను పరిష్కరించి మిషన్ భగీరథ నీటి సరఫరా పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటాం.



గుబ్బగుర్తి పాఠశాలలో వన్యప్రాణుల వారోత్సవాలు



కొణిజర్ల గుబ్బగుర్తి అక్టోబర్ 6 ప్రజా కలం న్యూస్ తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 72వ వన్యప్రాణుల వారోత్సవాల సందర్భంగా ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, అడవుల ప్రాధాన్యతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబరిచి గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను అందజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దంతాల ప్రశాంతి నరసింహారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివన్నారాయణ, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ జీ. ఉపేంద్రయ్య, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బి. సైదా, యు. అయోధ్యమ్మ, జ్యోతి, ఏఏపీసీ చైర్‌పర్సన్ నాగమణి పాల్గొన్నారు. అలాగే ఉపాధ్యాయులు మురళీకృష్ణ, లలిత భారతి, వెంకటేశ్వర్లు, చారి, సుజాత, భాస్కర్తో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వన్యప్రాణులు, అడవులు మరియు పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కార్యక్రమ నిర్వాహకులు ఉపేంద్రయ్య తెలిపారు.

ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి:

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

నిర్మల్, అక్టోబర్ 06(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): ఫార్మర్ రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియలు వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ వ్యవసాయ సంబంధిత అంశాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండలాల వారిగా పూర్తి చేయాల్సిన ఫార్మర్ రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వే, ఇప్పటి వరకు పూర్తయిన ప్రక్రియ, ఇంకనూ పూర్తి చేయాల్సిన ప్రక్రియ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏకకాలంలోనే డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియలను పూర్తి చేయాలని సూచించారు. వాలంటీర్లు అందరూ డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియ వేగవంతంగా పూర్తిచేసేలా అధికారులు పర్యవేక్షణ ఉంచాలని పేర్కొన్నారు. పంటల కోతల సమయానికి మునుపే డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియ మొత్తాన్ని పూర్తిచేయాలని ఆదేశించారు. రాబోయే రబీ పంట కాలంలో రైతులు పంట మార్పిడి విధానాలు విస్తృతంగా పాటించేలా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి రైతుతో మాట్లాడి పంట మార్పిడి విధానాల ఆవశ్యకతను వివరించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, మండల వ్యవసాయ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



దళితుల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేయాలి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- రంగారెడ్డి జిల్లా ఎస్సీ విభాగం చైర్మన్ క్యారగారి శ్రీధర్

రంగారెడ్డి జిల్లా , అక్టోబర్ 06 (ప్రజా కలం):

షాద్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, దళితుల అభివృద్ధి కోసం ఎస్సీ విభాగం నాయకులు అహర్నిశలు కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా ఎస్సీ విభాగం చైర్మన్ క్యారగారి శ్రీధర్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన



షాద్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం చైర్మన్, ఐదు మండలాల చైర్మన్లకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల ప్రజా పాలనలో రైతులు, మహిళలు, యువత, పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. షాద్‌నగర్ నియోజకవర్గ ఎస్సీ విభాగం చైర్మన్ జాంగారి రవి, మండల చైర్మన్లు ఫరూఖ్‌నగర్ – చిన్న చినోళ్ల శివకుమార్ (బూర్గుల), కొత్తూరు – పెంటనోల్ల ఆంజనేయులు (ఇన్ముల్ నర్వ), కొందుర్గ్ – మల్లని యాదయ్య (చెరుకుపల్లి), నందిగామ – గునుగుర్తి రాజశేఖర్ (చేగురు), కేశంపేట్ – గోపని భీమయ్య (కాకునూర్) గౌరవ సలహాదారులు బాధేపల్లి సిద్ధార్థ, కరోల్ల సురేందర్, కొమ్ము కృష్ణ, కేకే కృష్ణ, ఏరోల్ల జగన్ తదితరులు 15 మంది, తమకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రాష్ట్ర ఎస్సీ విభాగం అధ్యక్షులు డా. కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, జిల్లా చైర్మన్ క్యారగారి శ్రీధర్ లకు నూతన బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, సీనియర్ నాయకులు బాధేపల్లి సిద్ధార్థ, కరోల్ల సురేందర్, వడ్ల జంగయ్య తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిరుద్యోగ కళాకారుల రిలే దీక్ష

సాంస్కృతిక సారథిలో అవకాశం కల్పించాలని

ఉద్యమ నిరుద్యోగ కళాకారుల

సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్

సిద్దిపేట టౌన్:అక్టోబర్ 06 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ప్రజా గొంతుకలై పాటలు పాడి ఉద్యమానికి ఊపుతెచ్చిన కళాకారులు నేటికీ దుర్భర జీవితం గడుపుతున్నారని తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిన్నింటి దాసు, జిల్లా అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్ అన్నారు.ఉద్యమంలో పాల్గొన్న నిరుద్యోగ కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిరుద్యోగ కళాకారులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు.దీక్షకు పలు రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా



జిల్లా అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కళాకారులు కీలక పాత్ర పోషించారని తెలిపారు.తమ పాటలు, కళారూపాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే కాకుండా ఉద్యమాన్ని గ్రామగ్రామాన విస్తరించడంలో కళాకారుల సేవలు మరువలేనివని అన్నారు.రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన కళాకారులకు ప్రభుత్వం తగిన గుర్తింపు ఇచ్చి,సాంస్కృతిక సారథిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఉద్యమంలో కీలకంగా పనిచేసిన కళాకారులను ఆదుకోవడంతో పాటు వారి కుటుంబాలకు భరోసా కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి ఉద్యోగాలు ప్రకటించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ కళాకారుల సంఘం నాయకులు శ్రీనివాస్ యాదవ్, భుజంగం,కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రకమిటి సభ్యులు కుంచం శ్రీనివాస్, పిల్లిట్ల భుజంగం,జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్ చిన్నగుండవెల్లి, ఉపాధ్యక్షులు తునికి రాజు,పాకాల భూపతి,గౌరవ అధ్యక్షులు శ్యామ్ సుందర్,ప్రచార కమిటీ సభ్యులు రాజు చిన్నగుండవెల్లి,కోశాధికారి రాజు కందకట్ల,సలహాదారులు శశిధర్,బోడ భాగ్య రేణుక గజ్జెల సీరియల్ ప్రవీణ్ లక్షణ్ సూర్య వంశీ తదితర నిరుద్యోగ కళాకారులూ పాల్గొన్నారు పాల్గొన్నారు.

బృందావన్ కాలనీలో డీసీ పర్యటన

పౌర సమస్యలపై ప్రత్యక్ష పరిశీలన.. సత్వర పరిష్కారానికి ఆదేశాలు



రాజేంద్రనగర్, అక్టోబరు 6 (ప్రజా కలం):

'వన్ డే--వన్ వార్డు' కార్యక్రమంలో భాగంగా నార్సింగి సర్కిల్--45 డిప్యూటీ కమిషనర్ కోకాపేట్ వార్డు నం.125 పరిధిలోని బృందావన్ కాలనీలో సోమవారం పర్యటించారు. స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, సంబంధిత విభాగాల సిబ్బందితో మాట్లాడి కాలనీలో నెలకొన్న పౌర సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. వివిధ ప్రాంతాలను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల పనులపై సమీక్షించారు.

సీసీ రోడ్లకు చర్యలు..

బృందావన్ కాలనీలో సుమారు 0.5 కిలోమీటర్ల మేర పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. వాహనదారుల భద్రత దృష్ట్యా అవసరమైన ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

వీధిదీపాలపై ఫిర్యాదులు

పలు ప్రాంతాల్లో పనిచేయని, తగినంత వెలుతురు ఇవ్వని వీధిదీపాలపై స్థానికులు ఫిర్యాదు చేయగా.. వాటిని వెంటనే పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ప్రజలకు మెరుగైన వెలుతురు, భద్రత కల్పించేందుకు అవసరమైన చోట సింగిల్ ఆర్మ్ స్ట్రీట్ లైట్ పోల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.

కుక్కల బెడద.. ఆక్రమణలపై దృష్టి

కాలనీలో వీధికుక్కల సమస్యను స్థానికులు డీసీ దృష్టికి తీసుకురాగా.. అవసరమైన చర్యలు చేపట్టాలని శానిటేషన్, వెటర్నరీ విభాగాల అధికారులను ఆదేశించారు. రహదారులను ఆక్రమించి నిర్మించిన ర్యాంపులు, పారపెట్ గోడలు, ఇతర నిర్మాణాలను పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానికులు తెలిపిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి, సాంకేతికంగా సాధ్యమైన మేరకు, అందుబాటులో ఉన్న వనరులతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ హామీ ఇచ్చారు. గుర్తించిన సమస్యలను ఇంజినీరింగ్, శానిటేషన్ తదితర విభాగాల సిబ్బంది వెంటనే పరిశీలించి అవసరాలను అంచనా వేసి తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ లక్ష్మీకాంత్‌రెడ్డి, డీఈలు కార్తీక్, అన్వేష్‌రెడ్డి, వార్డు అధికారి సుష్మ, బిల్ కలెక్టర్ నరేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లచ్చిరాం, వర్క్ ఇన్‌స్పెక్టర్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసును ఛేదించిన సంగారెడ్డి జిల్లా పోలీసులు

- 15 ఏళ్ల బాలుడిని గుర్తించిన సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగింత.

-సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్.



సంగారెడ్డి ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్06 : సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నెంబర్.559/2026, బాయ్ మిస్సింగ్ కేసును పోలీసులు సమర్థవంతంగా ఛేదించారు.కంది మండలం కోయగుండు తండాకు చెందిన మెన్సోత్ గోపాల్ తన 15 ఏళ్ల కుమారుడు ప్రదీప్ రాజ్‌ను 21.09.2026 ఉదయం కొలంపేట్ గ్రామ బస్టాండ్ వద్ద పాఠశాలకు వెళ్లేందుకు బస్సు ఎక్కించగా, సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. పాఠశాలకు కూడా హాజరు కాలేదని తెలుసుకున్న తల్లిదండ్రులు బాలుడి కోసం బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అదే రోజు సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ-II హారిక, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రూరల్, క్రైమ్ పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, బాలుడి ఆచూకీ కోసం అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి, సాంకేతిక ఆధారాలతో పాటు క్షేత్రస్థాయిలో గాలింపు చర్యలలో భాగంగా తేది 06.10.2026 సాయంత్రం హైదరాబాద్‌లోని భారత్ నగర్ మార్కెట్ ప్రాంతంలో బాలుడిని గుర్తించి సురక్షితంగా తీసుకొని వచ్చి, తల్లిదండ్రులకు అప్పగించడం జరిగింది.ఈ కేసులో సమర్థవంతంగా పనిచేసిన సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సైలు మధుసూదన్ రెడ్డి హారిక, కానిస్టేబుళు రాజు, షకీర్, సదాశివపేట పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ, సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ సాయికుమార్లను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అభినందించారు. మిస్సింగ్ కేసుల్లో ప్రతి నిమిషం కీలకమని, పోలీసులు సమన్వయంతో పనిచేసి తప్పిపోయిన బాలుడిని సురక్షితంగా గుర్తించడం అభినందనీయమని ఎస్పీ తెలిపారు.

ఆర్టీసీ టీజెఎంయూ పదవికి తోపాజీ అనంత్ కిషన్ రాజీనామా..

సంగారెడ్డి ఆర్టీసీ ఎన్నికల్లో భారీ ట్విస్ట్..

పోలింగ్‌కు ముందే టీజెఎంయూకు షాక్!

టీడబ్ల్యూయూ కు సంపూర్ణ మద్దతు ప్రకటించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్.



సంగారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 06(ప్రజా కలం):

తెలంగాణ ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్‌కు మరో మూడు రోజులు మాత్రమే సమయం ఉన్న వేళ, సంగారెడ్డి డిపోలో ఊహిం చని రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ సంగారెడ్డి డిపో గౌరవ అధ్యక్ష పదవికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్ హఠాత్తుగా రాజీనామా చేశారు. ఎన్నికల ముంగిట ఆయన తీసుకున్న ఈ నిర్ణయం డిపో కార్మికుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తోపాజీ అనంత్ కిషన్ తన రాజీనామా విషయాలను అధికారికంగా వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అధికారికంగా తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ కు పూర్తి మద్దతు ప్రకటిస్తోందని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు, కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ గల నాయకుడిగా తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ఈ నెల 9న జరగనున్న అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆర్టీసీ ఎన్నికల్లో టీడబ్ల్యూయూ అభ్యర్థుల భారీ గెలుపు కోసం తామంతా శాయశక్తులా కృషి చేస్తామని అనంత్ కిషన్ ప్రకటించారు. డిపోలోని కార్మికులందరూ కాంగ్రెస్ అనుబంధ సంఘానికే ఓటు వేసి గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ముఖ్యమైన మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కూన సంతోష్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్ తో పాటు పలువురు ముఖ్య నాయకులు, ఆర్టీసీ కార్మిక ప్రతినిధులు పాల్గొన్నారు.

బీసీ హామీలపై బీజేపీ నిరసన

- పూలే విగ్రహానికి వినతిపత్రం.. - కామారెడ్డి డిక్లరేషన్ అమలుకు డిమాండ్

హైదరాబాద్, అక్టోబరు 6 (ప్రజా కలం):

బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో హైదరాబాద్ ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ నేతల హామీలను గుర్తు చేస్తూ జ్యోతిరావు పూలే విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ.. 2023 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి వేదికగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను విస్మరించారని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న మహేశ్‌కుమార్‌గౌడ్ మళ్లీ బీసీ ముఖ్యమంత్రి అంశాన్ని ప్రస్తావించడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

'ఇప్పుడే బీసీ సీఎం చేయాలి'

రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్తి మెజారిటీ ఉందని, బీసీ ముఖ్యమంత్రి చేయాలన్న సంకల్పం ఉంటే ఇప్పుడే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో రాజీనామా చేయించి బీసీ నేతను ముఖ్యమంత్రిగా నియమించాలని ఆనంద్‌గౌడ్ సూచించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్న హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని కోరారు.

రాష్ట్రవ్యాప్తంగా బీసీ డిక్లరేషన్ హామీలపై నిరసనలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి జిల్లా కేంద్రంలో జ్యోతిరావు పూలే విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించి కాంగ్రెస్ హామీలపై ప్రజలకు వివరిస్తామని చెప్పారు.

'బీసీలకు బీజేపీ ప్రాధాన్యం'

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. బీసీలకు రాజకీయంగా, సామాజికంగా ప్రాధాన్యం కల్పించడంలో బీజేపీ ముందుందని పేర్కొన్నారు.

దేశ ప్రధానిగా బీసీ వర్గానికి చెందిన నరేంద్ర మోదీ ఉన్నారని, కేంద్ర మంత్రివర్గంలోనూ ఓబీసీ వర్గాలకు ప్రాతినిధ్యం ఉందని తెలిపారు. పలు రాష్ట్రాల్లో బీసీ నాయకులను ముఖ్యమంత్రులుగా బీజేపీ అవకాశం కల్పించిందని చెప్పారు.

బీజేపీ ఉపాధ్యక్షుడు శాంతికుమార్ మాట్లాడుతూ.. బీసీలకు న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం సాధించేందుకు బీజేపీతోనే సాధ్యమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, ఉపాధ్యక్షులు సంజయ్ ఘనాతే, వై.నుజాత, కార్యదర్శులు పారాసోని వెంకటేశ్, జక్కలి రాజుయాదవ్, సుమన్‌గౌడ్, కార్యాలయ కార్యదర్శి రామన్‌సింగ్, ప్రభు పూజారి, దీపికా పదుకొనేతో పాటు రాష్ట్ర పదాధికారులు, ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు, పదాధికారులు పాల్గొన్నారు.



వేధింపులపై మౌనం వద్దు.. ఫిర్యాదు చేయండి

- ఆకతాయిలపై రెండు నెలల్లో 4 ఎఫ్ఐఆర్‌లు.. 5 పెట్టి కేసులు.

- హాట్‌స్పాట్లలో మఫ్టీలో నిఘా..

మహిళల భద్రతకు షీ టీమ్ భరోసా. - జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

రాజన్న సిరిసిల్ల అక్టోబర్ 07 (ప్రజా కలం ప్రతినిధి) :

మహిళలు, బాలికలు, విద్యార్థినులు వేధింపులకు గురైనప్పుడు మౌనంగా భరించకుండా నిర్భయంగా ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. ఒక్క ఫోన్ కాల్ చేస్తే షీ టీమ్ రక్షణగా నిలుస్తుందని తెలిపారు. జిల్లాలో గడిచిన రెండు నెలల్లో షీ టీమ్‌కు అందిన ఫిర్యాదులపై చర్యలు చేపట్టి 4 ఎఫ్ఐఆర్‌లు, 5 పెట్టి కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. వేధింపులకు పాల్పడుతున్న ఆకతాయిలను గుర్తించి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు. మహిళలు, విద్యార్థినుల భద్రత కోసం పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నా రని పేర్కొన్నారు. జిల్లాలో గుర్తించిన హాట్‌స్పాట్ల వద్ద షీ టీమ్ సిబ్బంది మఫ్టీలో నిరంతరం నిఘా ఉంచుతున్నారని తెలిపారు. మహిళలు, విద్యార్థినులను వేధించే ఆకతాయిలను అదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైన చోట తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు చెప్పారు.విద్యాసంస్థలు, మహిళలు పనిచేసే ప్రాంతాలు, రద్దీ ప్రదేశాల్లో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో చట్టం, సోషల్ మీడియా మోసాలు, మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.అపరిచిత వ్యక్తులతో మహిళలు, విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని, సోషల్ మీడియాలో పరిచయమయ్యే వ్యక్తులతో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. విద్యాసంస్థల్లో, రోడ్డుపై వెళ్లేటప్పుడు లేదా పని చేసే ప్రదేశాల్లో ఎవరైనా అసభ్యంగా మాట్లాడినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా వెంటనే జిల్లా షీ టీమ్ నంబర్ 8712656425కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ మహేష్ బి. గితే కోరారు. ఫిర్యాదు అందిన వెంటనే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కలశ ఆరాధనతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న గజ్వేల్

శ్రీరామ హృదయ కలశ ఆరాధనకు పోటెత్తిన భక్తులు

గజ్వేల్, అక్టోబర్ 6 (ప్రజా కలం ప్రతినిధి):

గజ్వేల్ పట్టణ కేంద్రంలోని రామాలయంలో శ్రీరామ హృదయ కలశ ఆరాధన కార్యక్రమాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. వికాస తరంగిణి గజ్వేల్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ

ఆధ్యాత్మిక కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి రామాలయం వరకు శ్రీరామ హృదయ కలశంతో శోభాయాత్ర నిర్వహించారు.అనంతరం శ్రీ సీతారామ ఉమామహేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేపట్టారు. భక్తులు కలశ ఆరాధన పూజల్లో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలు,సమాజ శ్రేయస్సు, లోకకల్యాణం కోసం ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు శేషం శ్రీనివాసాచార్యులు, ఉదయ్ ఆచార్యులు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు, లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ వికాస తరంగిణి ఆధ్వర్యంలో నిరంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పూజా మహోత్సవంలో పట్టణ ప్రజలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ అధ్యక్షులు టీఎండీ లక్ష్మణ్, ఉపాధ్యక్షులు తిరుపతిరెడ్డి,ఎడెల్లి శ్రీనివాస్,నాయకులు రాజారాం, రామాలయం పురోహితులు శ్రీనివాసాచార్యులు,వికాస తరంగిణి సభ్యులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధికి సీఎం ప్రత్యేక దృష్టి

- భవిష్యత్ రద్దీకి అనుగుణంగా వసతులు.. పనులు వేగవంతం చేయాలి.

- అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సీఎం ఓఎస్డీ శ్రీనివాసులు ఆదేశం.



వేములవాడ, అక్టోబరు 06 (ప్రజా కలం ప్రతినిధి) :

వేములవాడ శ్రీ రాజరాజేశ్వ ర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ముఖ్యమంత్రి ఓఎస్డీ శ్రీనివాసులు తెలిపారు. భవిష్యత్‌లో పెరిగే భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయాన్ని అభివృద్ధి చేయడంతోపాటు అన్ని మౌలిక వసతులు కల్పించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం, ఇతర నిర్మాణ పనుల పురోగతిపై మంగళవారం హైదరాబాద్‌లోని డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీడీఏ) ఆధ్వర్యంలో చేపడుతున్న పనులపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, సంబంధిత అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటే షన్ ద్వారా వివరించారు. అనంతరం ఆది శ్రీనివాస్, సీఎం ఓఎస్డీ శ్రీనివాసులు పనుల పురోగతిని సమీక్షించి పలు సూచనలు చేశారు.భవిష్యత్ అవసరాలే ప్రాతిపదికగా.. రాజన్న ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య భవిష్యత్‌లో మరింత పెరిగే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఆలయ విస్తరణతో పాటు భక్తులకు అవసరమైన అన్ని వసతులను సమగ్రంగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ప్రతి పనిపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సీఎం ఆదేశాల మేరకు ముందుకు..రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులపై సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారని ఆది శ్రీనివాస్, శ్రీనివాసులు తెలిపారు. అవసరమైన నిధులు మంజూరు చేస్తూ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సూచనలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా అభివృద్ధి

శ్రీ విధుశేఖర భారతి స్వామి, సీఎం రేవంత్‌రెడ్డి సూచనలను పరిగణనలోకి తీసుకుని భక్తుల విశ్వాసాలు, ఆలయ ప్రాశస్త్యానికి అనుగుణంగా విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులు సూచించారు. ఆలయ నిర్మాణాల విషయంలో ఆధ్యాత్మికత, సంప్రదాయా లకు ప్రాధాన్యమిస్తూ ఆధునిక సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు.ఆలయ విస్తరణ, నిత్యాన్నదాన సత్రం, ఇతర అభివృద్ధి పనులను అధికారులు తమ బాధ్యతగా భావించి పూర్తిస్థాయిలో నిమగ్నం కావాలని ఆదేశించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో ముందుకు సాగాలని, నిర్ణీత గడువులోగా అన్ని పనులు పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేస్తే.. ఉద్యమం ఉధృతం!

- ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం తప్పదు.

- తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.

వేములవాడ,
అక్టోబర్ 7 (ప్రజా కలం ప్రతినిధి) :

వేములవాడ--సిరిసిల్ల ప్రాంత ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాజకీయాలకు అతీతంగా ఉద్యమాలు చేపడతామని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుం ట్ల కవిత ప్రకటించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తే ప్రజల పక్షాన పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం వేములవాడకు చేరుకున్న కవిత ముందుగా దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వరస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు, వేదపండితులు ఆమెకు వేదాశీర్వచనం అందించారు. అనంతరం మున్నూరు కాపు మండపంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉందని కవిత పేర్కొన్నారు,ఆలయ అభివృద్ధి పనులు ఆగమశాస్త్ర నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని కోరారు. ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్యం, డ్రైనేజీ, తాగునీరు, భక్తులకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచాలని సూచించారు,ఆలయ అభివృద్ధికి కేటాయించిన నిధులు భక్తులు, ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడేలా వినియోగించాలని కోరారు. వేములవాడ పట్టణాన్ని ఏళ్లుగా వేధిస్తున్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో రహదారులు, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర మౌలిక వసతులను మెరుగుపరచాలని సూచించారుస్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకుని ఈ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. వేములవాడ--సిరిసిల్ల ప్రాంత రైతులు బోరుబావులపైనే ఆధారపడుతున్నారని కవిత తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, లిఫ్ట్ ఇరిగేషన్ పనులను వేగవంతం చేసి రైతులకు శాశ్వత సాగునీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. రుద్రంగి చెరువు సమీపంలోని రిజర్వాయర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. రెండు నియోజకవర్గాల రైతులకు సాగునీరు అందేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం ప్రజాప్రతినిధులంతా పార్టీలకు అతీతంగా ఏకమై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. రైతుల సమస్యలు పరిష్కారం కాకపోతే సైకిల్ యాత్రలు, పాదయాత్రలు చేపట్టి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రకటించారు. సిరిసిల్ల--సిద్దిపేట--జనగాం రైల్వే లైన్ ఏర్పాటు ప్రజల చిరకాల డిమాండ్ అని కవిత పేర్కొన్నారు. రవాణా సౌకర్యాల కొరతతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైల్వే లైన్ ఏర్పాటుపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ప్రజలతో కలిసి రైల్వే లైన్ కోసం ఉద్యమిస్తామని తెలిపారు.గల్ఫ్ దేశాల్లో మృతి చెందిన తెలంగాణ కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఇప్పటికే ప్రకటించిన పరిహారం బాధిత కుటుంబాలకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక విధానం రూపొందించాలని కోరారు. సిరిసిల్ల--వేములవాడ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించాలని కవిత కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులను బలోపేతం చేయాలని, మెడికల్ కాలేజీ విద్యార్థులకు హాస్టల్, తాగునీరు, పారిశుద్ధ్య నదుపాయాలను తక్షణమే కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడంతో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధిక ఫీజులు, వైద్య ఖర్చులపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలని పేర్కొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు ప్రత్యేక విద్యా కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు, మిడ్‌మానేరు ప్రాజెక్టు కారణంగా మిగిలిపోయిన ముంపు గ్రామాల బాధితుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పరిహారం, పునరావాసం, ఇతర పెండింగ్ సమస్యలను పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. బాధితుల తరఫున ప్రభుత్వంతో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.నేరెళ్ల బాధితులకు గతంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా తెలంగాణ రక్షణ సేన పనిచేస్తుందని కవిత పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ప్రధాన రాజకీయ పార్టీలు స్పందించకపోతే కొత్త రాజకీయ శక్తులు ప్రజాక్షేత్రంలోకి వచ్చి పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు, వేములవాడ రాజన్న స్వామి ఆశీస్సులతో రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజల నంక్షేమం కోనం నిరంతరం పోరాడుతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల అధ్యక్షులు సుమలత సుధాకర్ శర్మ, కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ లింగంపల్లి నాగరాజు, సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ మజీద్, జిల్లా నాయకులు వరద సతీష్, కుమార్, నూనె మల్లేష్ యాదవ్, పూసల వినయ్, వేములవాడ వట్టణ నాయకులు తోట కనుకయ్య, నాయకులు శైలజ, నవీన్, వినయ్, సురేష్, రమేష్, భాస్కర్, శ్రీనివారెడ్డి, జావీద్, పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శేరీల్లా పంచాయతీలో నిధుల వినియోగంపై విచారణ


ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుపై అధికారుల పరిశీలన- రికార్డులు స్వాధీనం

మెదక్ అక్టోబర్ 06(ప్రజాకలం ప్రతినిధి)

మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం శేరీల్లా గ్రామపంచాయతీలో నిధుల వినియోగానికి సంబంధించి ప్రజావాణిలో అందిన ఫిర్యాదుపై అధికారులు విచారణ చేపట్టారు. మంగళవారం తూప్రాన్ డీఎల్‌పీవో సాయిబాబా శేరీల్లా గ్రామపంచాయతీ



కార్యాలయాన్ని సందర్శించి సంబంధిత రికార్డులను పరిశీలించారు. పంచాయతీ నిధుల వినియోగం, అభివృద్ధి పనులకు సంబంధించిన చెల్లింపులపై ఫిర్యాదు అందడంతో అధికారులు ఈ పరిశీలన చేపట్టినట్లు తెలిపారు. గ్రామస్తుల సమక్షంలో పంచాయతీకి సంబంధించిన పలు రికార్డులను స్వాధీనం చేసుకుని, నిధుల వినియోగం, చేపట్టిన అభివృద్ధి పనులు, ఖర్చుల వివరాలు, బిల్లులు తదితర అంశాలను పరిశీలిస్తున్నారు. పంచాయతీ ఖాతాల్లో జరిగిన నిధుల వినియోగం, వివిధ అభివృద్ధి పనులకు చేసిన చెల్లింపులు, రికార్డుల్లో నమోదైన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించనున్నట్లు డీఎల్‌పీవో సాయిబాబా తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలతో పాటు పంచాయతీ నిధుల వినియోగానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి,నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించారా లేదా అనే విషయాన్ని నిర్ధారించనున్నట్లు పేర్కొన్నారు. విచారణ పూర్తయిన అనంతరం పరిశీలనలో వెల్లడైన అంశాలను నివేదిక రూపంలో జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని డీఎల్‌పీవో తెలిపారు. విచారణలో వెలువడే వివరాల ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. ఈ విచారణలో ఎంపీవో నవీన్‌రెడ్డి, పంచాయతీ ఈవో కృష్ణతో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. అధికారులు రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలన ప్రారంభించడంతో ఈ అంశం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.



ఉద్యమ యోధుడికి తుది వీడ్కోలు..

పటాన్‌చేరులో విషాదం..

- అంబేద్కర్‌వాది డా. యాదయ్య కన్నుమూత..పటాన్‌చేరులో విషాదం..

- వైద్యుడిగా సేవ.. ఉద్యమకారుడిగా పోరాటం..

- బుద్ధుని బాటలో అంతిమ ప్రయాణం..

- అంబేద్కర్ సర్కిల్ వద్ద ఘన నివాళులు..

- ఉద్యమ లోకానికి తీరని లోటు..

పటాన్‌చేరు,
అక్టోబర్ 6 (ప్రజా కలం) ప్రతినిధి

ఒక యుగం ముగిసింది. ఒక గళం మూగబోయింది. కుల వివక్షపై జీవితాంతం కదనం చేసిన తొలితరం అంబేద్కర్‌వాది, పేదల పాలిట ప్రాణదాత డాక్టర్ యాదయ్య 77 ఏళ్ల వయసులో అనారోగ్యంతో చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచారు. ఆ వార్త వినగానే పటాన్‌చేరు నేల కన్నీటితో తడిసిపోయింది. ఎవరి నోట మాట రాలేదు, ఎవరి కళ్ళూ ఆగలేదు..

చేతిలో వైద్యం...గుండెల్లో అంబేద్కర్...బతుకంతా పోరాటం..

ఆ చేతులు రోగుల నాడి పట్టాయి, అదే చేతులు అణగారిన వర్గాల హక్కుల కోసం జెండా పట్టాయి. కుల వ్యవస్థే సమాజ అభివృద్ధికి ప్రధాన అడ్డంకి, ప్రతి మనిషి సమానత్వంతో, స్వేచ్ఛతో జీవించాలి అన్నదే ఆయన జీవిత మంత్రం. ఆ ఆశయం కోసం తన బతుకునే బహుజన ఉద్యమానికి అంకితం చేసిన ఆ మహనీయుడు ఇక లేడన్న నిజాన్ని ఉద్యమ శ్రేణులు నమ్మలేకపోతున్నాయి..

బుద్ధుని బాటలోనే అంతిమ ప్రయాణం..

బుధవారం ఆయన స్వగ్రామమైన పటాన్‌చేరులో కుటుంబ సభ్యుల సమ్మతితో, ఆయన స్వీకరించిన బౌద్ధమత సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. బతికినంత కాలం అంబేద్కర్ చూపిన దారిలో నడిచిన యాదయ్య, తన చివరి ప్రయాణాన్ని కూడా అదే దారిలో ముగించారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, దళిత సంఘాల నాయకులు, అంబేద్కర్‌వాదులు, బహుజన ఉద్యమకారులు కన్నీటి పర్యంత మవుతూ, నివాళులు అర్పించారు. అక్కడి గాలిలో కూడా విషాదం ఘనీభవించింది..

మాటే ఆయన ఆచరణ... బతుకే ఆయన సందేశం..

మాటకు కట్టుబడి, ఆచరణలో ముందుండే గురువు, నాయకుడు, అంబేద్కర్ ఆశయాలకు వారధి అని వక్తలు గొంతు పూడుకుపోతుండగా స్మరించుకున్నారు. 1993లో అఖిల భారత సమతా సైనిక్ దళ్‌లో చేరిన యాదయ్య, రాష్ట్ర అధ్యక్షుడిగా మొదలుపెట్టి జాతీయ ప్రధాన కార్యదర్శి వరకు సాగిన ప్రస్థానాన్ని గుర్తు చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రత్యేకమైన అంబేద్కర్‌వాదిగా, బహుజన ఉద్యమకారుడిగా వెలుగొందిన ఆయన, పటాన్‌చేరు ప్రాంతంలో ఎందరికో అంబేద్కర్ భావజాలాన్ని పరిచయం చేసి, ఎందరి జీవితాల్లోనో చైతన్య దీపం వెలిగించిన జ్ఞాని అని కొనియాడారు..

మనుధర్మంపై గర్జించిన గళం శాశ్వతంగా మూగబోయింది..

మనుధర్మం పేరుతో కుల, మత విభజనలు కొనసాగుతూ, ఒక వర్గం ప్రజలు వివక్ష సెగలో మగ్గుతున్న వేళ, వారి పక్షాన నిలబడి తన రచనలతో, ఉద్యమాలతో గర్జించిన మహోన్నత వ్యక్తి యాదయ్య అని పలువురు కొనియాడారు. కులం, మతం సమాజ సమానత్వానికి అడ్డంకులుగా మారకూడదు అని ఆయన నిరంతరం చెప్పిన మాటలు ఇప్పుడు ప్రతి గుండెలో ప్రతిధ్వనిస్తున్నాయని భావోద్వేగంతో గుర్తు చేసుకున్నారు..

యాదయ్య లేని లోటు... తరాలు గడిచినా తీరనిది..

అంబేద్కర్ చరిత్రను, ఆలోచనా విధానాన్ని లోతుగా అధ్యయనం చేసి, చివరి శ్వాస వరకు ఆ భావజాలానికి కట్టుబడిన యాదయ్యను కోల్పోవడం సమాజానికి తీరని లోటని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనకు నిజమైన నివాళి ఒక్కటే, ఆయన నడిచిన అంబేద్కర్ మార్గంలో పయనించడమే అని ముక్తకంఠంతో పిలుపునిచ్చారు..

నివాళులర్పించిన ప్రముఖులు..

యాదయ్య భౌతిక కాయానికి నివాళులు అర్పించిన పటాన్‌చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి తదితరులు ఉన్నారు..

తరలివచ్చిన ఉద్యమ లోకం..

అంబేద్కర్ యువజన సంఘం నేతలు భయగల్ల కృష్ణ, ప్రధాన కార్యదర్శి కర్నే శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బౌద్ధిస్ట్ వైద్యనాథ్, సమతా సైనిక్ దళ్ నాయకుడు చంద్రయ్య, ఎస్సీ ఆర్‌పీఎస్ నాయకుడు రుద్రారం శంకర్, జాతీయ కార్యదర్శి గణేష్ భూపాల్ రావు, నర్రా భిక్షపతి, బాయికాడ విజయ్, న్యాయ వాది బలవంత్, శంకర్, పద్మారావు, ఎండిఆర్ మధు, జర్నలిస్టు నరసింహాతో పాటు

పలువురు పాత్రికేయులు, ఉద్యమకారులు పాల్గొని, డాక్టర్ యాదయ్యకు కన్నీటి వీడ్కోలు పలికారు..

ఆయన వెళ్లిపోయారు...కానీ ఆయన వెలిగించిన దీపం ఆరిపోదు..




డాక్టర్ యాదయ్య భౌతికంగా దూరమై ఉండవచ్చు. కానీ ఆయన రాసిన అక్షరాలు, ఆయన చేసిన ఉద్యమాలు, ఆయన నేర్పిన సమానత్వ పాఠాలు పటాన్‌చేరు గడ్డపై ప్రతి అడుగులో, ప్రతి గుండెలో జీవించే ఉంటాయి. ఆయన చికిత్స పొందిన పేదల కళ్ళల్లో కృతజ్ఞత కన్నీళ్లై నిలిచాయి. ఆయన చైతన్యపరిచిన తరాల గళంలో ఆయన మాటలు ప్రతిధ్వనిస్తున్నాయి. కులం పేరుతో గోడలు కట్టే వారికి ఆయన జీవితమే ఒక సమాధానం. వివక్షకు గురయ్యే ప్రతి గుండెకు ఆయన పోరాటమే ఒక ధైర్యం. ఆయన కలగన్న కుల రహిత సమాజం సాకారమయ్యే రోజు వరకు ఆయన ఆశయం ఆగదు, ఉద్యమం ఆగదు. అంబేద్కర్ బాటలో నడిచిన ఆ యోధుడి అడుగుజాడల్లో నడవడమే, ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి..



మీడియా మంథన్ - 2026 సెమినార్, వర్క్ షాప్, ముఖాముఖి ప్రత్యేక కార్యక్రమం

-విజ్ఞత, విచక్షణ, నైతికతతోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మానవాళికి మేలు.

--యూట్యూబ్ యుగంలో డిజిటల్ జర్నలిజంపై క్లుప్తంగా విద్యార్థులకు వివరణ.





కూకట్ పల్లి, అక్టోబర్ 06, ప్రజా కలం ప్రతినిధి:

నూరవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఆచార్య విసి వెల్దండ నిత్యానందరావు, ఆచార్య రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు సహకారంతో జర్నలిజం శాఖ ఆధ్వర్యంలో బాచుపల్లి ప్రాంగణంలోని జీ వీ సుబ్రహ్మణ్యం సెమినార్ హాల్ పరిపాలనా భవనంలో సోమవారం రోజు మీడియా మంథన్ - 2026 సెమినార్, వర్క్ షాప్, ముఖాముఖి ప్రత్యేక కార్యక్రమం డీన్ ఆచార్య బి హెచ్ వర్మప్రియ పర్యవేక్షణలో అధ్యాపకులు డా షేక్ హసీనా, డా కె అనిత సమన్వయంతో, జర్నలిజం విద్యార్థులు, పరిశోధకులు, మీడియా రంగంపై ఆసక్తి ఉన్న వారందరూ పాల్గొని విజయవంతం చేశారు. ముఖ్య అతిథులుగా సీనియర్ జర్నలిస్ట్ గుండవజ్జుల జ్యోతిర్మయి పరిశోధనల్లో కృత్రిమ మేధ విశ్లేషణ, సీనియర్ జర్నలిస్టు, కంటెంట్ క్రియేటర్ నోముల తిరుమల్ రెడ్డి హాజరై యూట్యూబ్ యుగంలో డిజిటల్ జర్నలిజం గురించి భవిష్యత్తులో జర్నలిజం అభ్యసించే విద్యార్థులకు క్షుణ్ణంగా తెలియజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ గుండవజ్జుల జ్యోతిర్మయి మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచ వ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో దాని వినియోగంలో విజ్ఞత, విచక్షణ, నైతికత అత్యంత కీలకమని పేర్కొన్నారు. సాంకేతికతను కేవలం అభివృద్ధి కోసం కాకుండా మానవాళి సంక్షేమానికి ఉపయోగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు, జర్నలిజం, పరిపాలన తదితర అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులకు దోహదపడుతోంది. సమాచారాన్ని వేగంగా విశ్లేషించడం, క్లిష్టమైన సమస్యలకు పరిష్కార మార్గాలను సూచించడం, సమయాన్ని ఆదా చేయడం వంటి అనేక ప్రయోజనాలను ఏఐ అందిస్తోంది. అయితే, దీనిని బాధ్యతారహితంగా ఉపయోగిస్తే తప్పుడు సమాచారం, గోప్యతకు భంగం, మానవ విలువలకు విఘాతం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరిస్తూ, ఈ నేపథ్యంలో విజ్ఞత, విచక్షణ, నైతికత ఈ మూడు అంశాలను సమన్వయం చేసుకుంటేనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మనిషి మనుగడకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఏఐ అందించే సమాచారాన్ని యథాతథంగా నమ్మకుండా, దాని నిజానిజాలను పరిశీలించే విచక్షణ ప్రతి వినియోగదారుడికి అవసరం అని ముఖ్యంగా జర్నలిజం, విద్య, ప్రజా సమాచార రంగాల్లో ఏ ఐ ద్వారా లభించే సమాచారాన్ని వాస్తవాలతో సరిపోల్చి నిర్ధారించుకోవడం అత్యంత ముఖ్యం అని అదేవిధంగా ఏ ఐ వినియోగంలో నైతికతకు పెద్దపీట వేయాలి. వ్యక్తుల గోప్యతను కాపాడటం, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయకుండా ఉండటం, సాంకేతికతను దుర్వినియోగం చేయకుండా చూడటం వంటి అంశాలు ప్రతి ఒక్కరి బాధ్యతగా మారాయని ఏఐ మనిషికి ప్రత్యామ్నాయంగా కాకుండా, మనిషి సామర్థ్యాలను మరింత పెంచే సాధనంగా ఉండాలని ఆమె పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని మానవ విలువలతో అనుసంధానం చేసినప్పుడే సమాజానికి నిజమైన ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. భవిష్యత్తులో ఏఐ మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉన్నందున, దాని వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు విద్యా సంస్థలు, ప్రభుత్వాలు, సాంకేతిక నిపుణులు, మీడియా సంస్థలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని సూచించారు. విజ్ఞతతో సాంకేతికతను అర్థం చేసుకుని, విచక్షణతో దాన్ని వినియోగించి, నైతికతతో దిశానిర్దేశం చేసినప్పుడే ఏఐ మానవాళికి వరంగా మారుతుందని జ్యోతిర్మయి మాట్లాడారు.

కంటెంట్ క్రియేటర్ నోముల తిరుమల్ రెడ్డి యూట్యూబ్ యుగంలో డిజిటల్ జర్నలిజంపై అవగాహనా ప్రసంగం మాట్లాడుతూ యూట్యూబ్, సోషల్ మీడియా వంటి డిజిటల్ వేదికలు జర్నలిజం స్వరూపాన్ని వేగంగా మారుస్తున్న నేపథ్యంలో జర్నలిస్టులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని ప్రముఖ జర్నలిస్టు నోముల తిరుమల్ రెడ్డి అన్నారు. మీడియా మంథన్--2026'' కార్యక్రమంలో భాగంగా "యూట్యూబ్ యుగంలో డిజిటల్ జర్నలిజం కంటెంట్, పరిధి, ఆదాయ మార్గాలు" అనే అంశంపై విద్యార్థులకు ఆయన ప్రత్యేక గెస్ట్ లెక్చరర్ నిర్వహించారు. దాదాపు 23 సంవత్సరాల జర్నలిజం అనుభవాన్ని కలిగిన తిరుమల్ రెడ్డి, రేడియో జాకీగా తన కెరీర్‌ను ప్రారంభించి ఎలక్ట్రానిక్ మీడియా నుంచి డిజిటల్ మీడియా వరకు సాగిన తన ప్రయాణాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. జీ తెలుగు, సాక్షి, టీవీ9 తదితర ప్రముఖ మీడియా సంస్థల్లో పనిచేసిన అనుభవాలను వివరించారు. డిజిటల్ జర్నలిజంలో కంటెంట్ ఎంపిక, ప్రేక్షకులను ఆకట్టుకునే విధానం, యూట్యూబ్ ద్వారా వార్తలను ప్రజల్లోకి తీసుకెళ్లే పద్ధతులు, సోషల్ మీడియా వేదికల వినియోగం, డిజిటల్ మీడియా ద్వారా ఆదాయ అవకాశాలు వంటి అంశాలపై ఆయన వివరంగా మాట్లాడారు. జర్నలిజం అంటే కేవలం వార్తలను అందించడం మాత్రమే కాదని, ప్రజలకు నిరైన నమాచారాన్ని అందించడంతో పాటు సమాజాన్ని అప్రమత్తం చేయడం కూడా జర్నలిస్టుల బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. తిరుమల్ రెడ్డి ప్రసంగానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. డిజిటల్ మీడియా రంగంలో ఎదురవుతున్న అవకాశాలు, సవాళ్లపై ఆయన అందించిన సూచనలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచాయి. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు నోముల తిరుమల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా అతిథులకు శాలువాతో ఘనంగా సన్మానం చేసి, జర్నలిజం విద్యార్థులు రచించిన అంజిబాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రచురించిన గురు దక్షిణ కవితా సంకలన పుస్తకాన్ని బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిజం అధ్యాపకులు డా ఎస్ షమీర్, రీసెర్చ్ స్కాలర్ గోపాల్, డా పి వెంకటేశ్వరరావు పెద్ద సంఖ్యలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా రూపకల్పనలో పూర్తి పారదర్శకత ఉండాలి

- రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ నిరసన

- రంగారెడ్డి జిల్లా డీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

- ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణ రెడ్డి

రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, అక్టోబర్ 06 (ప్రజా కలం):

ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ ఏకపక్ష ధోరణికి నిరసనగా, సర్ ప్రక్రియలో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా ఇండియా కూటమి మరియు ఏఐసీసీ పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద భారీ నిరసన మార్చ్



ధర్నా నిర్వహించారు.టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారి ఆదేశానుసారం, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మరియు అఖిల పక్షం (ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల) ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవడానికి ఇండియా కూటమి పక్షాన అందరం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాలని, ఓటర్ల జాబితా రూపకల్పనలో పూర్తి పారదర్శకత ఉండాలని డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ అనుసరిస్తున్న ఏకపక్ష విధానాలను తీవ్రంగా ఖండిస్తూ ఇండియా కూటమి శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణ రెడ్డి, చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, సీపీఎం కార్యదర్శి బోడ సామేలు, చేవెళ్ల ఇంచార్జీ భీమ్ భరత్, శేరిలింగంపల్లి ఇంచార్జీ జగదీశ్వర్ గౌడ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్, కాంగ్రెస్, ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల నేతలు, సీనియర్ నాయకులు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఇండియా కూటమి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పోరాటం నిరంతరం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.

ఆటో కార్మికుల నమ్మకమే నా బలం!

-వేములవాడ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా సంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్.

వేములవాడ, అక్టోబరు 06 (ప్రజా కలం ప్రతినిధి) :

వేములవాడ డివిజన్ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా సంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్ ఘన విజయం సాధించారు. మంగళవారం నిర్వహించిన ఎన్నికల్లో ఆయనకు 743 ఓట్లు లభించగా తన సమీప ప్రత్యర్థిపై 211 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు, డివిజన్ పరిధిలో మొత్తం 1,281 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం సంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్‌ను ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు, అనంతరం విజయోత్సవంలో భాగంగా వేములవాడ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కనికరపు రాకేష్ శ్రీనివాస్ గౌడ్ ను నుశాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ



తనపై నమ్మకం ఉంచి ఓటు వేసి గెలిపించిన ప్రతి ఆటో కార్మికుడికి కృతజ్ఞతలు తెలిపారు,ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు,ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు,ఆటో కార్మికుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని, వారి హక్కులు, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు.ఆటో కార్మికులకు ఏ సమస్య వచ్చినా యూనియన్ తరపున అండగా నిలుస్తానన్నారు. ఆటో కార్మికుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేసి యూనియన్‌ను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తానని పేర్కొన్నారు.తనపై ఆటో కార్మికులు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వారి కోసం పనిచేసే అధ్యక్షుడిగా కాకుండా ప్రతి కార్మికుడికి నమ్మకమైన సేవకుడిగా ఉంటానని శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. గెలుపు తన ఒక్కరి విజయం కాదని, తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఆటో కార్మికుడి విజయమని పేర్కొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా డబిల్ గూడ రోడ్డు

- నిధులు మంజూరైన పట్టించుకోని అధికారులు

- సంవత్సరాలు గడుస్తున్నా ఈ రోడ్డు పరిస్థితి మారదా...

- ఎన్నో ప్రభుత్వాలు మారిన ఈ రోడ్డు మాత్రం మారదా...

-స్థానిక ఎమ్మెల్యే అధికారులు జోక్యం చేసుకొని వెంటనే రోడ్డు పనులు మొదలు పెట్టాలి

-డబిల్ గూడ సర్పంచ్ బుగ్గని యాదమ్మ యాదయ్య



మహేశ్వరం, అక్టోబర్ 06 (ప్రజా కలం):

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం డబుల్ గూడ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. నిధులు మంజూరైనా పట్టించుకునే నాథుడే లేకపోవడంతో స్థానిక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంవత్సరాలు గడుస్తున్నా ఈ రోడ్డు పరిస్థితి మారడం లేదు. సుమారు 800 మీటర్ల మేర రోడ్డు పూర్తిగా గుంతలమయమై ప్రయాణికులకు నరకం చూపిస్తోంది. ఎన్నో ప్రభుత్వాలు మారినా, ఎంతో మంది అధికారులు వచ్చినా ఈ రోడ్డు మాత్రం మారడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గుంతల కారణంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, వర్షం వస్తే రోడ్డు బురదమయమై నడవడానికి కూడా వీలు లేకుండా పోతోందని గ్రామస్తులు వాపోతున్నారు. విద్యార్థులు, రైతులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకుని రోడ్డు పనులు మొదలుపెట్టాలని డబుల్ గూడ సర్పంచ్ బుగ్గని యాదమ్మ యాదయ్య డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణాన్ని చేపట్టకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

డబుల్ గూడ రోడ్డు టెండర్లు పూర్తి
దసరా తర్వాత పనులు ప్రారంభం
-ఏఈ రాంప్రసాద్

మహేశ్వరం మండలం డబుల్ గూడ రోడ్డు సమస్యపై పంచాయతీరాజ్ శాఖ స్పందించింది.డబుల్ గూడ రోడ్డుకు సంబంధించి టెండర్లు పూర్తి చేసి అగ్రిమెంట్ చేయడం జరిగిందని మహేశ్వరం పంచాయతీరాజ్ ఏఈ రాంప్రసాద్ తెలిపారు.రోడ్డు పనులను దసరా పండుగ తర్వాత ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు. గుంతలమయంగా మారిన 800 మీటర్ల రోడ్డు వల్ల ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులకు త్వరలోనే పరిష్కారం లభించనుందని తెలిపారు.

ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న రేవంత్ సర్కార్

- 3 కోట్ల 18 లక్షల 50 వేలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, అక్టోబర్ 05 (ప్రజా కలం):

మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మంకల్ డివిజన్ పరిధిలో మొత్తం రూ.3 కోట్ల 18 లక్షల 50 వేల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు.రావిర్యాల ఓల్డ్ బ్రిడ్జి నుంచి సర్దార్‌నగర్ గ్రామం వరకు చేపట్టనున్న డ్రైనేజీ పనులు, సూర్యగిరి ఎల్లమ్మ దేవాలయం ఆర్చ్ నుంచి రావిర్యాల వరకు చేపట్టనున్న బీటీ రోడ్డు, సీసీ రోడ్డు విస్తరణ పనులు, అలాగే ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు నుంచి జన్నాయిగూడ వరకు చేపట్టనున్న రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ దేవస్థానానికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వస్తుంటారని, సరైన రోడ్డు, డ్రైనేజీ సౌకర్యాలు లేక వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ పనులతో భక్తులు, స్థానిక ప్రజల సమస్యలకు పరిష్కారం లభించనుందని అన్నారు. అనంతరం శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ దేవస్థానాన్ని సందర్శించిన సబితా ఇంద్రారెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడేలా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.గత ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో మున్సిపల్ ఫండ్ ద్వారా పలు రోడ్లు, డ్రైనేజీ పనులకు నిధులు మంజూరయ్యాయని, అయితే ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక అభివృద్ధి పనులను నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ ద్వారా నిలిచిపోయిన పనులకు మళ్లీ నిధులు మంజూరు చేయడం జరుగుతోందని తెలిపారు.ప్రజా సమస్యలను గాలికి వదిలి ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆమె విమర్శించారు. ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక వసతులపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. మంజూరైన పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ళ రత్నం, బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు జెల్ల లక్ష్మయ్య, సామెల్ రాజు,సుమన్, బంటు రమేష్, హర్షగూడ ఉప సర్పంచ్ రవి నాయక్, బాట సురేష్,లింగం సురేష్,మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

6 గంటల కరెంట్‌తో మూడు ఎకరాల పొలం ఎట్లా పండించాలి?

- రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలి

- విద్యుత్ లేక ఎండిపోతున్న పంట పొలాలు

- కందుకూరు రైతుల కన్నీరు మున్నీరు

- కందుకూరు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మన్నె జయేందర్

- మహేశ్వరం నియోజకవర్గ ఉపాధ్యక్షులు లక్ష్మీనరసింహారెడ్డి

- బీఆర్ఎస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం సెక్రటరీ సామ మహేందర్ రెడ్డి



కందుకూరు, అక్టోబర్ 06,(ప్రజా కలం)

రైతులకు వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని కందుకూరు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మన్నె జయేందర్, మహేశ్వరం నియోజకవర్గ ఉపాధ్యక్షులు లక్ష్మీనరసింహారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం సెక్రటరీ సామ మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. కందుకూరు మండల కేంద్రంలో రైతుల విద్యుత్ సమస్యలపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ"ఆరు గంటల కరెంట్‌తో మూడు ఎకరాల పొలం ఎట్లా పండించాలి? ఇచ్చే కరెంట్‌లో కూడా గంట గంటకు అంతరాయాలు వస్తే పంటలకు నీళ్లు ఎట్లా అందుతాయి?" అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వ్యవసాయ బోర్లు కరెంట్‌పై ఆధారపడి ఉన్నాయని, విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా పంటలకు సకాలంలో నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రధాన డిమాండ్లు: వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలి. కరెంట్ కోతలు, తరచూ ట్రిప్పులు లేకుండా చూడాలి, పంటలకు అవసరమైన సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి, విద్యుత్ అంతరాయాల వల్ల పంటలు నష్టపోతే రైతులకు నష్టపరిహారం అందించాలి., గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలి, విద్యుత్ సరఫరా సమయాలపై రైతులకు ముందుగానే స్పష్టమైన సమాచారం ఇవ్వాలి, రైతు పంట పండించాలంటే నీళ్లు కావాలి.. నీళ్లు రావాలంటే కరెంట్ కావాలి. కరెంట్ సరిగ్గా ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెట్టొద్దు. రైతుల గోడును ప్రభుత్వం వెంటనే పట్టించుకోవాలి" అని సామ మహేందర్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమం లో కందుకూరు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మన్నె జయేందర్, మహేశ్వరం నియోజకవర్గ ఉపాధ్యక్షులు లక్ష్మీనరసింహారెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో అవకతవకలు:

మళ్లీ విచారణ చేపట్టాలని బీఎస్పీ డిమాండ్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 06:

నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగాయని బీఎస్పీ మాజీ రాష్ట్ర కార్యదర్శి మోత్కు ముత్తెన్న ఆరోపించారు. అర్హులైన దరఖాస్తుదారులందరికీ న్యాయం జరిగేలా, ఈ కేటాయింపులపై ఉన్నతాధికారులు స్పందించి సమగ్రంగా మళ్లీ విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.



మంగళవారం మోర్తాడ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముత్తెన్న మాట్లాడుతూ.. మండల కేంద్రంలో మొత్తం 69 డబుల్ బెడ్‌రూం ఇళ్లకు గానూ కేవలం 13 ఇళ్లకు మాత్రమే అధికారులు డ్రా (చీటీలు) నిర్వహించారని, మిగిలిన 56 ఇళ్ల కేటాయింపుల్లో ఎలాంటి స్పష్టత లేదని మండిపడ్డారు. ఇందులో 25 ఇళ్లను స్పెషల్ ఆఫీసర్ కోటా కింద కేటాయించగా, మిగిలిన 31 ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై దరఖాస్తుదారుల్లో తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు.

అర్హుల జాబితా ఏమైంది?

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇళ్లు, గోవింద్‌రెడ్డి కాలనీ, పోచమ్మగల్లీలో ప్లాట్లు పొంది, వాటిని విక్రయించుకున్న కొందరికి ఇప్పుడు మళ్లీ డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించారని ముత్తెన్న ఆరోపించారు. సొంత ఇల్లు ఉన్నవారికి, ఒకే కుమారుడు ఉన్న కుటుంబాలకు సైతం ఇళ్లను కేటాయించడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. గతంలో ఎనిమిది మంది గెజిటెడ్ అధికారుల బృందం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి రూపొందించిన అర్హుల జాబితాను అధికారులు ఎందుకు పక్కనబెట్టారో సమాధానం చెప్పాలన్నారు.

నిజమైన పేదలకు అన్యాయం చేస్తూ, గతంలో రద్దు చేసిన జాబితాను మళ్లీ ఎలా పరిగణనలోకి తీసుకున్నారో అధికారులు ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారుల ఎంపికపై సమగ్ర విచారణ జరిపి, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు దక్కేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంక్షేమ సంఘం అధ్యక్షులు మల్లూరి రాజారాం, జాంబవ చమార్, కాన్సిరాం మాల, సంఘం నర్సయ్య (రామన్నపేట), బెడ్డం బాబు, మామిడి భూమన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలి

- సబితా ఇంద్రారెడ్డి వైఫల్యంతోనే మహేశ్వరంలో అభివృద్ధి కుంటు

-మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ అందెల శ్రీరాములు

మహేశ్వరం, అక్టోబర్ 05 (ప్రజా కలం):

మహేశ్వరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి వైఫల్యం కారణంగానే అభివృద్ధి కుంటుపడిందని మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ అందెల శ్రీరాములు విమర్శించారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బడంగ్‌పేట్ సర్కిల్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, ఫాగింగ్ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బడంగ్‌పేట్ సర్కిల్ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో ఈరోజు భారీ నిరసన, రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీరాములు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగంపై



తగిన స్థాయిలో సబితా ఇంద్రారెడ్డి పోరాటం చేయడం లేదని మండిపడ్డారు.బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని బడంగ్‌పేట్, నాదర్‌గుల్, బాలాపూర్, మీర్‌పేట్, జిల్లెలగూడ, ప్రశాంతి హిల్స్ తదితర ప్రాంతాల్లో ప్రజలు రోడ్ల దుస్థితి, డ్రైనేజీ సమస్యలు, పారిశుధ్య లోపం, ఫాగింగ్ కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలు అధికంగా పన్నులు చెల్లిస్తున్నప్పటికీ అందుకు తగిన మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.స్థానిక ఎమ్మెల్యేగా సబితా ఇంద్రారెడ్డి గారు ఈ ప్రాంత ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం అసెంబ్లీలో ఎన్నిసార్లు మాట్లాడారు? ఆమె హయాంలో నియోజకవర్గంలో చారిత్రాత్మకంగా చెప్పుకునే ఏ అభివృద్ధి కార్యక్రమం జరిగింది?" అని ప్రశ్నించారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం ప్రజల తరఫున పోరాడుతుందని, అధికార యంత్రాంగం ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.అనంతరం బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక కాలనీ వాసులతో కలిసి బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయానికి చేరుకుని డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య గారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా రేడియల్ రోడ్ నంబర్-26 పనులను వెంటనే పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ పదాధికారులు, మహిళా మోర్చా నాయకురాళ్లు, బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్

తక్షణమే రాజీనామా చేయాలి

-ఇండియా కూటమి పక్షాలు కాంగ్రెస్,సిపిఐ,సిపిఎం,సిపిఐ ఎంఎల్ (మాస్ లైన్),టీజేఎస్ నాయకుల పిలుపు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, అక్టోబర్ 06(ప్రజా కలం)

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామాను కోరుతూ మంగళవారం రోజున ఇండియా కూటమి పిలుపుమేరకు కాంగ్రెస్, సిపిఎం,సిపిఐ,సిపిఐ ఎంఎల్ (మాస్ లైన్) టీ.జే.ఎస్ పార్టీల ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా ధర్నా నిర్వహించి జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ కి వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, సిపిఎం జిల్లా కార్యదర్శి పి.సత్యం,సిపిఐ జిల్లా కార్యదర్శి ఉ మామహేష్, సిపిఐ ఎంఎల్ (మాస్ లైన్) జిల్లా కార్యదర్శి సదానందం, తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సమాజ్ వాదీ పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేష్ యాదవ్ పాల్గొన్నారు ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ దేశంలో ఎప్పుడూ లేనట్టు సర్ పేరుతో బిజెపి కనుసన్నల్లో ఎన్నికల కమిషన్ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంది చెప్పారు.ఇప్పటివరకు జరిగిన ఎస్ఐఆర్లో ఎప్పుడూ ఇంత ఇబ్బందులు జరగలేదని, బిజెపి కావాలని తన పాలనను సుస్థిరం చేసుకోవడానికి ప్రజలకు ఓటు లేకుండా చేస్తుందని బిజెపిని గద్దెదించే వరకు ఇండియా కూటమి పక్షాలు ఉద్యమిస్తాయని తెలిపారు. ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



సిపిఎం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం మాట్లాడుతూ ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఎన్నికల కమిషన్ లోని మిగిలిన ఇద్దరు సభ్యులు గడిచిన 10 నెలల కాలంలో 14 సార్లు వివిధ అంశాలలో అసమ్మతి తెలిపినప్పటికీ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారు.ఇది రాజ్యాంగ విరుద్ధమైన అని అన్నారు. ఎస్.ఐ.ఆర్ పేరుతో అధికార బిజెపి కి లబ్ధి చేకూర్చేందుకు మూకుమ్మడిగా ప్రజల ఓట్లు తొలగించడం ఇది భారత రాజ్యాంగానికి, ప్రజా స్వామ్యానికి, ప్రజల పౌరసత్వాన్ని దెబ్బతీయటమేనని అన్నారు. దేశ పౌరులకు ఓటు హక్కు లేకుండా చేసే హక్కు సీఇసి కి లేదని అన్నారు. తక్షణం ఎస్.ఐ.ఆర్ ను రద్దు చేసి కోల్పోయిన ఓట్లను తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఫారం 6 లు నూతన ఓటరు చేరికకు చేర్చిన కొత్త నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమని నిన్న సుప్రీంకోర్టు కూడా దానికి ఆమోదం ముద్ర వేయలేదని చెప్పడం జ్ఞానేష్ కుమార్ యొక్క అక్రమాలను ధ్రువీకరిస్తుందని తెలిపారు. స్వతంత్రంగా, పారదర్శకంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ తన జేబు సంస్థగా మార్చిన బిజెపి ప్రభుత్వం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్ల నియామక చట్టం 2023ను రద్దు చేసి పాత చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అప్పుడే ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించగలదని తెలిపారు.సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బోస్ మరియు జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చాక అన్ని రాజ్యాంగబద్ధ, స్వతంత్ర సంస్థలను బలహీనపరిచి ఎన్నికల్లో గెలవడానికి ఉపయోగించుకుంటున్నా యని అన్నారు. ప్రజలు పొందినటువంటి ఓటు హక్కును సర్ పేరుతో తొలగించి మరోసారి పేద మధ్య తరగతి ప్రజలను ఓట్లకు దూరం చేస్తుందని దీని ద్వారా రాబోయే ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తుందని , ఓటు ప్రతి భారతీయుడు యొక్క హక్కు కాబట్టి సర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ మోడీ అమిత్ షా ల కనుసన్నులతో నడుస్తూ వారు చెప్పినట్టు చేస్తున్నారని దానికి నిదర్శనమే నేడు జ్ఞానేష్ కుమార్ పై వస్తున్న ఆరోపణలని కాబట్టి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ రాజ్యాంగబద్ధ హక్కును కాలరాస్తున్నటువంటి జ్ఞానేష్ కుమార్ ని వెంటనే రాజీనామా చేయించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసేంతవరకు అన్ని రాజకీయ పార్టీలు పోరాటాలను కొనసాగిస్తాయని అన్నారు.

ఇప్పటివరకు తొలగించిన 13 కోట్ల ఓటర్లకు వారి ఓటు హక్కును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.అక్టోబర్ 8న ఛలో రాజభవన్ నవంబర్ 1న ఛలో పార్లమెంటు ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోస్ కోమటి రవి,ఎ.అశోక్,జి. శ్రీనివాసులు,ఐ. రాజశేఖర్ జిల్లా కమిటీ సభ్యులు ఎం.పినరేష్, సంతోష్, లింగస్వామి, శంకర్,సబిత, చింతల యాదయ్య, బంగారు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

దసరా ప్రయాణమా?

ఈ జాగ్రత్తలు తప్పనిసరి: పోలీస్ కమిషనర్ హెచ్చరిక

నిజామాబాద్,
(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబర్ 06:

దసరా పండుగ సెలవుల్లో సొంత ఊర్లకు వెళ్లే ప్రజలు ఇళ్ల భద్రత విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సూచించారు. పండుగ రోజుల్లో చోరీల నివారణే ధ్యేయంగా ప్రజలు పాటించాల్సిన పలు కీలక నిబంధనలు మరియు జాగ్రత్తలను ఆయన విడుదల చేశారు.

నిఘా మరియు అప్రమత్తత:

ఉదయం వేళల్లో కాలనీల్లో తిరిగే పాత పేపర్ల వ్యాపారులు, ఖాళీ సంచులు, పూల మొక్కలు, హార్ ఏక్ మాల్ వస్తువులు విక్రయించే అపరిచిత వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలి. రాత్రి సమయాల్లో అనుమానాస్పదంగా సంచరించే వారిని ప్రశ్నించడంతో పాటు, శివారు ప్రాంతా ల్లోని తాళం వేసిన ఇళ్లను గమనించే అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండాలి. ఇరుగు-పొరుగు సహకారం, కమ్యూనికేషన్:

ఊరికి వెళ్లేటప్పుడు ఇరుగు-పొరుగు వారికి సమాచారం అందించి, ఇంటిని కనిపెట్టి ఉండమని కోరాలి. చుట్టుపక్కల వారి ల్యాండ్ ఫోన్ లేదా సెల్ ఫోన్ నెంబర్లను అందుబాటులో ఉంచుకోవాలి. ఇంట్లో ఒంటరిగా ఉండే మహిళలు, వృద్ధులు అపరిచితులు చెప్పే మాటలను నమ్మకూడదు.

విలువైన వస్తువుల భద్రత:

ఖరీదైన వస్తువులు, నగదును ఇళ్లలో ఉంచడం కంటే బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవడం ఉత్తమం. విలువైన వస్తువులను పక్కింటి వారిని నమ్మి ఇచ్చి వెళ్లకూడదు. ప్రయాణాన్ని వీలైనంత త్వరగా ముగించుకుని తిరిగి వచ్చేలా ప్లాన్ చేసుకోవాలి. కాలనీల వారీగా స్థానికులు 'గస్తీ దళాలను' ఏర్పాటు చేసుకోవడం మంచిది.

సోషల్ మీడియా, సాంకేతిక జాగ్రత్తలు:

తాళం వేసి ఊరు వెళ్తున్న విషయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సోషల్ మీడియాలో వెంటనే పోస్ట్ చేయవద్దు.



ప్రయాణం పూర్తయి, సురక్షితంగా ఇంటికి తిరిగొచ్చిన తర్వాతే ఫోటోలు, సమాచారాన్ని షేర్ చేయాలి.

ఇల్లు విడిచి వెళ్లే ముందు విద్యుత్ ఉపకరణాలు, గ్యాస్ కనెక్షన్, ఫ్రిజ్ మొదలైన వాటిని సరిగ్గా ఆఫ్ చేశామో లేదో సరిచూసుకోవాలి.

తాళం వేసి ఊరు వెళ్లేవారు ముందుగా తమ నమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని సీపీ కోరారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు, దొంగతనాల నివారణకు పోలీసులకు సహకరించాలని, ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా లేదా అనుమానితుల సమాచారం ఉన్నా వెంటనే డయల్ 112 ను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు ఐదేళ్ల కఠిన జైలుశిక్ష

పోలీసు సిబ్బందిని అభినందించిన సీపీ సాయి చైతన్య

నిజామాబాద్, ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 06:

వరకట్న వేధింపులతో భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి జీవీఎన్ భారతలక్ష్మి మంగళవారం తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ధర్పల్లి రాజేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఇందల్వాయి మండలం చంద్రాయన్‌పల్లి గ్రామానికి చెందిన వేముల సాయిలుకు, డిచ్‌పల్లికి చెందిన మనోజతో 2016లో వివాహమైంది. పెళ్లి సమయంలో ఎలాంటి వరకట్నం తీసుకోలేదు.

కొన్నాళ్ల తర్వాత అదనపు కట్నం తేవాలంటూ సాయిలు తన భార్యను శారీరకంగా, మానసికంగా వేధించడం ప్రారంభించాడు. 'నువ్వు చనిపోతే మరో పెళ్లి చేసుకుని కట్నం డబ్బులు తెచ్చుకుంటా' అంటూ తీవ్ర హింసకు గురిచేసేవాడు. భర్త వేధింపులు భరించలేక మనోజ 2024 అక్టోబరు 13న చంద్రాయన్‌పల్లి శివారులోని పెద్ద పోషవ్వ గుడి సమీపంలో ఉన్న వేపచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

డిచ్‌పల్లి సర్కిల్ పోలీసు ఇన్‌స్పెక్టర్ కోర్టులో దాఖలు చేసిన ఛార్జ్‌షీట్, సాక్షుల వాంగ్మూలాలు, పత్రాలను పరిశీలించిన న్యాయమూర్తి.. నిందితుడు సాయిలుపై నేరం



రుజువైనట్లు నిర్ధారించారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్) సెక్షన్ 85 (వరకట్న వేధింపులు) కింద మూడేళ్ల జైలుశిక్ష, ?1,000 జరిమానా, సెక్షన్ 108 (ఆత్మహత్యకు ప్రేరేపించడం) కింద ఐదేళ్ల కఠిన జైలుశిక్ష, ?1,000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

నిందితుడికి శిక్ష పడటంలో కీలక పాత్ర పోషించిన ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ (ఇందల్వాయి ఎస్సై) బి. మనోజ్, బ్రీఫింగ్ ఆఫీసర్ బి. సుమలత, కోర్టు లైజన్ ఆఫీసర్ టి. గోవింద్, పీపీ రాజేశ్వర్‌రెడ్డి, సీఎంఎస్, కోర్టు సీడీఓ సిబ్బందిని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయిచైతన్య ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

వీబీజీ రామ్ జి ఫీడర్ ఛానల్ పనులపై అధికారుల సమీక్ష

- గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ

- ఎంపీడీవో శారద, ఏపీవో పరిమళ

మహేశ్వరం, అక్టోబర్ 06 (ప్రజా కలం):

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కల్వకోల్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకమైన (వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ – గ్రామీణ) ఫీడర్ ఛానల్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పనులను ఈరోజు మండల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ ఆధ్వర్యంలో ఎంపీడీవో శారద మేడం, ఏపీవో పరిమళ, పంచాయతీ సెక్రటరీ వేణు ఫీడర్ ఛానల్ పనులు జరుగుతున్న ప్రదేశాన్ని



సందర్శించారు.అక్కడ పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూలీలకు పనుల విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెస్టర్ నమోదు, వేతనాలు, పని ప్రదేశంలో పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని సూచించారు.ఈ పథకం ద్వారా గ్రామంలోని నిరుపేద కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు, గ్రామానికి శాశ్వత అభివృద్ధి పనులు జరుగుతాయని, కూలీలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శారద గారు కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జనార్దన్ గౌడ్, వార్డు సభ్యుడు బొజ్జం మల్లేష్, గ్రామ పెద్దలు బక్కని రవి మాదిగ, అనిల్ కుమార్, అశోక్ మాదిగ, ఆకుల కృష్ణయ్య, నరసింహ,కూలీలు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉద్యోగ దరఖాస్తుల ఆహ్వానం

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని **ESI** ఆసుపత్రి, సిర్పూర్ కాగజ్.నగర్ లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగాలు భర్తీ చేయుటకు ఈ ప్రకటన ద్వారా అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుతున్నాయి.

ఉద్యోగ వివరాలు & అట్టి ఉద్యోగమునకు అర్హతలు ఈ క్రింద వివరించబడినవి:

క్ర.సం.	ఆఫీస్ యొక్క పేరు	పోస్ట్ యొక్క పేరు	కావాల్సిన అర్హత
1	**ESI** ఆసుపత్రి, సిర్పూర్ కాగజ్ నగర్	ల్యాబ్ టెక్నీషియన్ - 01	ఇంటర్మీడియట్ (10+2) మరియు డిప్లొమా / మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీలో (MLT / DMLT) సర్టిఫైడ్ కోర్సు లేదా దానికి సమానమైనది
నోట్: కేవలం కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కి చెందిన అభ్యర్థులకు మాత్రమే			


కావున అర్హత కలిగిన కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అభ్యర్థులు తమ సర్టిఫికెట్ జిరాక్స్ సెట్ తోపాటు ఒక **passport** సైజ్ ఫోటోని వేదీ: **07.10.2026** ఉదయం 10 గంటల నుండి **08.10.2026** సాయంత్రం 5 గంటల వరకు వ్యక్తిగతంగా విచ్చేసి దరఖాస్తు చేసుకోగలరు.

గమనిక: ఇట్టి ఉద్యోగ ప్రకటనలో సవరణలు లేదా రద్దు పర్చుటకై ప్రెసిడెంట్, శ్రీ సాయి యూత్ అసోసియేషన్ గారికి సంపూర్ణ అధికారం కలదు.

మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన చిరునామా:

శ్రీ సాయి యూత్ అసోసియేషన్ ఆఫీస్ :

H. No: 13-160, బాపునగర్, ఆసిఫాబాద్, జిల్లా: కొమురం భీమ్ ఆసిఫాబాద్, ఫోన్: 9849068124



జలాల్పూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా పాలకూర్ల రాజు గౌడ్

కాంగ్రెస్ తో అభివృద్ధి సాధ్యం

ఉప్పునూతల వెంకటేష్ యాదవ్

భూదాన్‌పోచంపల్లి అక్టోబర్ 6 (ప్రజా కలం ప్రతినిధి)

భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్,జలాల్పురం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గుండ్ల మహేష్ ఆధ్వర్యంలో జలాల్పూర్ లో నూతన యూత్ అధ్యక్షుని మంగళవారం ఎన్నుకోవడం జరిగింది. యూత్ అధ్యక్షునిగా పాలకూర్ల రాజు గౌడ్, ఉపాధ్యక్షులు శాపాక బాల నరసింహ, కార్యదర్శిగా గంజి రాజేశ్వర్, కోశాధికారి గుండ్ల అరుణ్, ప్రచార కార్యదర్శి రేవెల్లి శ్రీకాంత్, నూతనంగా ఎన్నుకోబడినారు.ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోరంటి శ్రీనివాస్ రెడ్డి, పాలకూర్ల ఆగయ్య గౌడ్, దేవాలయ చైర్మన్ కేసారం సురేందర్ రెడ్డి,గుండ్ల శ్రీరాములు, శాపాక బిక్షపతి, శాపాక శంకర్, బీసీ సెల్ అధ్యక్షులు పాలకూర్ల ఉపేందర్ గౌడ్,రైతు సంఘం అధ్యక్షులు కేసారం శ్రీకాంత్ రెడ్డి, వార్డ్ నెంబర్ బైరు శివాజీ గౌడ్,వార్డు నెంబర్ శాపాక బాలమణి శ్యామ్, కేసారం నరేందర్ రెడ్డి, గడ్డం నవీన్,కంది మహేందర్ రెడ్డి, శాపక స్వామి, వర్ణ శ్రీకాంత్ రెడ్డి, మహంకాళి శ్రీకాంత్, పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్

యాదాద్రి భువనగిరి జిల్లా, అక్టోబర్ 06 (ప్రజాకలం)


యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజలను సైబర్ మోసాల నుంచి అప్రమత్తం



చేయడంలో భాగంగా జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ భువనగిరి జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం రోజున సైబర్ ఫ్రాడ్ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ తెలియని లింకులు క్లిక్ చేయడం,OTP, PIN,CVV వంటి బ్యాంకింగ్ వివరాలను ఇతరులతో పంచుకోవడం చేయవద్దని సూచించారు.డిజిటల్ అరెస్ట్, ఖ్‌జ, ఫేక్ పోలీస్ కాల్స్, ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. "మోసగాడి మాట నమ్మితే నష్టం.. అప్రమత్తంగా ఉంటే రక్షణ!" అని పేర్కొంటూ,సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఇండియా కూటమి ధర్నా

మెదక్ అక్టోబర్ 6 (ప్రజాకలం ప్రతినిధి) ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు మెదక్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మెదక్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రజాస్వామ్య పరిరక్షణ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రజాస్వామ్య వ్యవస్థలను దుర్వినియోగం చేస్తోందని వారు ఆరోపించారు. ప్రజల ఓటు హక్కుపై దాడి జరిగితే కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి చూస్తూ ఊరుకోమని స్పష్టం చేశారు. జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు, విద్యార్థులు ఐక్యంగా ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీ నాయకత్వంలో ఇండియా కూటమి మరింత బలోపేతం అవుతుందని వారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆశీర్వాదంతో ముందుకు సాగుతుందని వారు పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ ప్రతిమా సింగ్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధిక, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజు యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేశం గౌడ్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, జిల్లా కమిటీ సభ్యులు, కౌన్సిలర్లు, సర్పంచులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ కమిషన్‌లో మాదిగ జర్నలిస్టులకు ప్రాతినిధ్యం కల్పించాలి

- సామాజిక న్యాయం నియామకాల్లోనూ కనిపించాలి.

- టీఎంజేఎఫ్ జిల్లా నాయకులు మీసాల సైదులు.

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 6 ప్రజా కలం

ఎస్సీ కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకాల్లో సామాజిక న్యాయాన్ని ప్రతిబింబించేలా రొటేషన్ విధానాన్ని అమలు చేసి, మాదిగ, అనుబంధ ఉపకులాలకు చెందిన అర్హులైన జర్నలిస్టులకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం (టీఎంజేఎఫ్) జిల్లా నాయకులు మీసాల సైదులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ-ఎస్టీ కమిషన్ ప్రస్తుత పదవీకాలం ముగిసిన నేపథ్యంలో చేపట్టనున్న నూతన నియామకాల్లో జర్నలిజం రంగంలో సేవలందిస్తున్న అర్హత, అనుభవం కలిగిన మాదిగ, అనుబంధ ఉపకులాల ప్రతినిధులను చైర్మన్, సభ్యులుగా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో అణగారిన వర్గాల గొంతుకను ప్రభుత్వానికి చేరవేయడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని సైదులు పేర్కొన్నారు. ఇప్పటివరకు జరిగిన నియామకాలకు భిన్నంగా రొటేషన్ విధానాన్ని అమలు చేసి, అన్ని సామాజిక వర్గాలకు అవకాశం కల్పించడం ద్వారా కమిషన్‌పై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా మాదిగ, అనుబంధ ఉపకులాలకు చెందిన అర్హత, అనుభవం ఉన్న జర్నలిస్టులకు ఈసారి అవకాశం కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. సామాజిక న్యాయం కేవలం మాటల్లో కాకుండా నియామకాల్లోనూ ప్రతిఫలించాలని సైదులు అన్నారు. ఈ డిమాండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, నూతన కమిషన్ నియామకాల్లో మాదిగ జర్నలిస్టులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఈ అంశాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్రవ్యాప్తంగా వినతిపత్రాల సమర్పణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.



క్రిశాంక్‌కు బీఆర్ఎస్ నేతల సంఘీభావం

అక్రమ కేసులతో వేధిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసన

సికింద్రాబాద్ కోర్టుకు తరలివచ్చిన బీఆర్ఎస్ నాయకులు



సికింద్రాబాద్, అక్టోబరు 6 (ప్రజా కలం ప్రతినిధి)

బీఆర్ఎస్ నేత క్రిశాంక్‌పై అక్రమ కేసులు బనాయించి, అరెస్టు చేసి జైలుకు పంపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. కక్షపూరితంగా వేధింపులకు గురిచేస్తున్న ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం సికింద్రాబాద్ కోర్టుకు చేరుకుని క్రిశాంక్‌కు సంఘీభావం తెలిపారు. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డా. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు కోర్టుకు చేరుకుని క్రిశాంక్‌కు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకలను అణచివేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేస్తోందని ఆరోపించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతున్న బీఆర్ఎస్ నాయకులను జైలుకు పంపేందుకు ప్రయత్నిస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. క్రిశాంక్‌కు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. రాజకీయ కక్ష సాధింపులకు భయపడేది లేదని, ప్రజా సమస్యలపై పోరాటాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రిశాంక్‌కు సంఘీభావం తెలిపారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి తలసాని

అఖిలభారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు సుక్కల సత్యం యాదవ్

గుట్టలో ఘనంగా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు



యాదగిరిగుట్ట అక్టోబర్: 06 ప్రజా కలం ప్రతినిధి :

బలహీన వర్గాల ఆశాజ్యోతి, అభివృద్ధి మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సేవలు వెలకట్టలేనివని అఖిలభారత యాదవ మహాసభ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు సుక్కల సత్యం యాదవ్ అన్నారు. మంగళవారం యాదగిరిగుట్టలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలను వైకుంఠ ద్వారం వద్ద యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పెద్ద ఎత్తున కృషి చేశారని అన్నారు బీసీలకు ఎప్పుడు ఏ ఇబ్బంది వచ్చినా వారికి అండగా నిలబడిన నాయకులు తలసాని శ్రీనివాస్ యాదవ్ అని అన్నారు పేదలు బలహీన వర్గాలు ఎప్పటికీ గుర్తు పెట్టుకునే నాయకుడు శ్రీనివాస్ యాదవ్ అని అన్నారు ఎవరికి ఎప్పుడు ఏ ఆపద వచ్చినా శీనన్న అని ఆయన ఇంటి తలుపు తడితే ఆదుకునే మంచి మనసున్న నాయకుడు శ్రీనివాస్ యాదవ్ అని అన్నారు ఈ సందర్భంగా వైకుంఠ ద్వారం వద్ద కేకులు కట్ చేసి తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన అభిమానులు స్థానికులకు కేకు సీట్లను పంపిణీ చేశారు తలసాని శ్రీనివాస్ యాదవ్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేసి ముందుకు సాగారు ఈ కార్యక్రమంలో గొర్ల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండెబోయిన అయోధ్య యాదవ్ యాదవ సంఘం జిల్లా నాయకులు కర్రె వెంకటయ్య ముక్కెర్ల సతీష్ యాదవ్ సోము రమేష్ కురుమ కొత్తపల్లి ఆనంద్ యాదవ్ కోటమర్తి మధు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరిన ఐఎన్‌టీయూసీ (ఎస్ డబ్ల్యు యు) నేత కంబాలపల్లి కుమార్



మహేశ్వరం, అక్టోబర్ 06, (ప్రజా కలం): ఐఎన్‌టీయూసీ యూనియన్ మహేశ్వరం డిపో సెక్రటరీ కంబాలపల్లి కుమార్ ఆ యూనియన్ వీధి, విధానాలు నచ్చక ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరారు. ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బి. దత్తు నాయక్, ఎంప్లాయిస్ యూనియన్ డిపో సెక్రటరీ పెయింటిష్ ఆధ్వర్యంలో ఈ చేరిక జరిగింది.ఈ సందర్భంగా కంబాలపల్లి కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం అయ్యేంత వరకు పోరాటం చేసేది కేవలం ఎంప్లాయిస్ యూనియన్ మాత్రమేనని అన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ ఇతర కార్మిక సంఘాలతో కలిసి ఐక్య పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు.అక్టోబర్ 9వ తేదీన జరిగే ఆర్టీసీ ఎన్నికల్లో బస్సు గుర్తుకు, నిచ్చెన గుర్తుకు ఓట్లేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సురేష్, శ్రీనివాస్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు మరియు అవగాహన

షాపూర్‌నగర్‌లో పట్టభద్రులకు అవగాహన కల్పించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా



కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో పట్టభద్రులకు ఓటరు నమోదు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కావడానికి అర్హతలు, అవసరమైన ధ్రువపత్రాలు, దరఖాస్తు విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలని కూన శ్రీశైలం గౌడ్ సూచించారు.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. నవంబర్ 6వ తేదీ ఓటరు నమోదు చివరి తేదీగా పేర్కొంటూ, అర్హులైన పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్, పూన రాఘవేంద్ర గౌడ్, బుచ్చిరెడ్డి, స్థానిక పట్టభద్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను సందర్శించిన ఎంపీడీవో శ్యామల

బొమ్మలరామారం,అక్టోబర్ 06 (ప్రజా కలం)

మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల బాలుర వసతి గృహంలో వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో శ్యామల అన్నారు. మంగళవారం రోజున బొమ్మలరామారం మండలం, చీకటిమామిడి



గ్రామ పరిధిలో ఉన్న ప్రభుత్వ మహాత్మ జ్యోతిరావు పూలే బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. హాస్టల్‌లోని విద్యార్థుల గదులు,మరుగుదొడ్లు తదితర వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి భోజనం నాణ్యత పరిశుభ్రత విద్యార్థులకు భోజనమందుతున్న తీరును స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సౌకర్యాలు పాఠశాల అందుతున్న మౌలిక వసతుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు విద్యార్థులకు పరిశుభ్రమైన,సురక్షితమైన వాతావరణం కల్పించేలా వసతి గృహంలో పారిశుధ్యం, మౌలిక వసతుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో శ్యామల పాఠశాల సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సునీత రెడ్డి,పంచాయతీ కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, ఉప సర్పంచ్ భూమయ్య, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మహిళలు ఆర్థికంగా ఎదగడమే ప్రభుత్వ లక్ష్యం

– ప్రభుత్వ సలహాదారు వి.హన్మంతరావు

– అంబర్‌పేట్ లో మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

– ముఖ్య అథితులుగా హాజరైన ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు,

– మైనారిటి ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మెన్ ఒబైదుల్లా కొత్వాల్,ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట, అక్టోబర్ 6 (ప్రజాకలం న్యూస్)

మహిళలు ఆర్థిక స్వావలంబన సాదించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హన్మంతరావు పేర్కొన్నారు.ఈ మేరకు అంబర్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఆర్థికంగా వెనుకబడిన 200 మంది మైనారిటీ మహిళలకు మంగళవారం ప్రభుత్వం కుట్టు మిషన్లను పంపిణీ చేసింది.రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబైదుల్లా కొత్వాల్,అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారులకు కుట్టు మిషన్లను పంపిణిచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఈ కుట్టు మిషన్లను ఉపయోగించుకుని స్వయం ఉపాధిని పొందాలని, తద్వారా తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి పేద మహిళకు కుట్టు మిషన్లు అందజేస్తాం...

ప్రస్తుతం 150 అందజేశాం ఇంకా 300 మిషన్లు పంపిణి చేస్తాం....

ఒబైదుల్లా కొత్వాల్...

ఆర్థికంగా వెనుకబడిన వర్గాల మహిళలు స్వయంశక్తితో ఎదగాలనే ప్రదాన ముఖ్య ఉద్దేశంతో పార్టీలకు సంబందం లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలంగాణ రాష్ట్ర మైనారిటి ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మెన్ ఒబైదుల్లా కొత్వాల్ పేర్కొన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 150 కుట్టు మిషన్లు పంపిణీ చేశామని ఇంకా 300 కుట్టు మిషన్లు అందజేస్తామని వారు స్పష్టం చేశారు.

అంగన్‌వాడీ చిన్నారులకు పౌష్టికాహారం, విద్యా సామగ్రి పంపిణీ



మల్కాజిగిరి, అక్టోబరు 6 (ప్రజా కలం ప్రతినిధి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా మల్కాజిగిరి బిహార్ బస్తీలో 'అంగన్ మిలాన్ సేవా అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా బిహార్ బస్తీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన రాంచందర్ రావు చిన్నారులు, అంగన్‌వాడీ సిబ్బందితో ముచ్చటించారు. చిన్నారుల ఆరోగ్యం, విద్య, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వారికి పౌష్టికాహారాన్ని అందజేశారు. అలాగే పాఠశాల బ్యాగులు, పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారుల సంక్షేమం, మహిళా సాధికారత, ప్రజారోగ్య పరిరక్షణ లక్ష్యంగా సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో చిన్నారుల సంరక్షణ, ప్రజారోగ్య పరిరక్షణలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. పరిమిత వేతనాలతోనూ వారు అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల నిస్వార్థ సేవలను గుర్తించి వారికి సముచిత గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను శాలువాలతో సత్కరించారు. వారి సంక్షేమానికి బీజేపీ కట్టుబడి ఉంటుందని రాంచందర్ రావు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, బస్తీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాదిగ విద్యార్థి ప్రతినిధుల జాతీయ సదస్సుకు ఎంఎస్ఎఫ్ భారీ తరలింపు

మల్కాజిగిరి, అక్టోబరు06 (ప్రజా కలం ప్రతినిధి):

మాదిగ విద్యార్థి ప్రతినిధుల జాతీయ సదస్సుకు మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి ఎంఎస్‌పీ (మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో విద్యార్థులు,యువత పెద్ద ఎత్తున బైకుల పైన తరలివెళ్లారు. ఆనంద్‌బాగ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ సదస్సుకు బయలుదేరారు.



ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఇన్‌చార్జి తిప్పారపు లక్ష్మణ్, జాతీయ నాయకులు కేశపాగ రామచందర్ మాదిగ మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరయ్యే జాతీయ సదస్సుకు విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నట్లు తెలిపారు. ప్రత్యేక డ్రెస్ కోడ్‌తో విద్యార్థులు సదస్సుకు తరలివెళ్లడం జరిగిందన్నారు. జాతి, సమాజ అభివృద్ధికి భవిష్యత్‌లో చేపట్టాల్సిన ఉద్యమాలు, సామాజిక అంశాలపై విద్యార్థులకు ఈ సదస్సులో దిశానిర్దేశం జరుగుతుందని పేర్కొన్నారు.విద్యార్థులు తమ హక్కులు, సామాజిక బాధ్యతలు, ఉద్యమాలపై అవగాహన పెంపొందించుకోవడానికి జాతీయ సదస్సు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.విద్యార్థులు భవిష్యత్‌లో సామాజిక సమస్యలపై బాధ్యతాయుతంగా వ్యవహరించే విధంగా తమను తాము తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంజెఎఫ్ రాష్ట్ర నాయకులు మనోహర్, వి.హెచ్.పి.ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు బచ్చలకూర స్వామి,మల్కాజిగిరి మండల అధ్యక్షుడు యు.రామచందర్, బోగారం పవన్, చిన్నబాబు, ఎంఎస్‌పీ ఆల్వాల్ మండల అధ్యక్షుడు మధు, బత్తిని శివ, పోశాలు,నరేష్, కార్తీక్, భవాని,తరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాణినగర్‌లో రోడ్డు భద్రతపై అవగాహన

'అరైవ్ అలైవ్'లో భాగంగా పోలీసుల అవగాహన కార్యక్రమం

మల్కాజిగిరి, అక్టోబరు 6 (ప్రజా కలం ప్రతినిధి): పోలీస్ కమిషనర్ సూచనల మేరకు 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా వాణినగర్‌లోని గణపతి టెంపుల్ కమాన్ వద్ద సోమవారం సాయంత్రం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మల్కాజిగిరి పోలీసులు, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వాహనదారులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మల్కాజిగిరి ఎస్‌హెచ్ఓ ఎస్. విజయ్ కుమార్, ఎస్ఐ శంకర్, ట్రాఫిక్ ఎస్ఐ రవి కుమార్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనాలను జాగ్రత్తగా నడుపుతూ తమతో పాటు ఇతరుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పోలీసులు సూచించారు.



అక్రమ నిర్మాణాలపై ఎంఎంసీ కొరడా

రోడ్లు, నాలాలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల తొలగింపు



మల్కాజిగిరి,

అక్టోబరు 6 (ప్రజా కలం ప్రతినిధి):

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలో అక్రమ, అనధికార నిర్మాణాలు, రహదారులు, నాలాలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఎంఎంసీ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు మల్కాజిగిరి,ఉప్పల్, ఎల్‌బీ నగర్ జోన్ల పరిధిలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తూ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలు, ఆక్రమణలను తొలగిస్తున్నారు. మల్కాజిగిరి జోన్ పరిధిలో అల్వాల్‌లో ఏడబ్ల్యూహెచ్ఓ నుంచి డెయిరీ ఫార్మ్ రోడ్డు వరకు ఉన్న ఆక్రమణలను తొలగించారు. బొన్‌పల్లి ఫతేనగర్‌లో అనధికార మూడో అంతస్తుకు ఏర్పాటు చేసిన సెంటరింగ్‌ను తొలగించగా, మౌలాలి ఓల్డ్ సఫిల్‌గూడలో అనధికారంగా నిర్మించిన మొదటి, రెండో అంతస్తుల స్లాబ్‌లు, గోడలపై చర్యలు చేపట్టారు. పీవీఎన్ కాలనీ, ప్రశాంత్ నగర్ ప్రాంతాల్లోనూ అనధికార మూడో అంతస్తుల స్లాబ్‌లు, గోడలను తొలగించారు.

ఉప్పల్ జోన్‌లో ఫుట్‌కేనర్ యమ్నంపేట్‌లో అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన మూడో, నాలుగో అంతస్తుల స్లాబ్‌లు, గోడలను తొలగించారు. మరో నిర్మాణంలో మూడో అంతస్తుకు ఏర్పాటు చేసిన పిల్లర్ బాక్స్‌లను తొలగించారు. కాప్రా మీనాక్షి నగర్‌లో మొదటి, రెండో అంతస్తులపై చర్యలు తీసుకోగా, కమలా నగర్--డా.ఎస్.రావు నగర్ ప్రాంతంలో అనధికార నాలుగో అంతస్తులోని నిర్మాణ భాగాన్ని తొలగించారు. నాచారంలో అనుమతులకు విరుద్ధంగా స్టిల్ట్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన గదులను తొలగించారు. ఉప్పల్ ఎక్స్‌రోడ్ నుంచి నాలా చెరువు వరకు చేపట్టిన ఆక్రమణల తొలగింపు చర్యల్లో 6 ర్యాంపులు, 15 స్టాళ్లు, 10 గుడిసెలను తొలగించారు. బోడుప్పల్ పరిధిలో నాలా చెరువు నుంచి మేడిపల్లి, వరంగల్ హైవే వరకు 11 గుడిసెలు, 19 ఆక్రమణలను తొలగించారు.

ఎల్‌బీ నగర్ జోన్‌లో నాగోల్, ఎన్‌హెచ్-65, లెక్చరర్స్ కాలనీ, హయత్‌నగర్ ప్రాంతాల్లో అనధికారంగా నిర్మిస్తున్న రెండో, మూడో అంతస్తుల గోడలు, మూడో అంతస్తుకు ఏర్పాటు చేసిన సెంటరింగ్‌ను తొలగించారు. సరోర్‌నగర్ చెరుకుతోట కాలనీలో అనుమతించిన స్టిల్ట్ ప్లస్ రెండు అంతస్తులకు విరుద్ధంగా నిర్మించిన అనధికార పెంట్‌హౌస్‌ను కూల్చివేశారు. ఎల్‌బీ నగర్ గ్రీన్ పార్క్ కాలనీ, కర్మన్‌ఘాట్ ప్రాంతాల్లో ర్యాంపులు, ప్లాంటరీ బాక్స్‌ల రూపంలో ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపట్టారు.



హయత్‌నగర్‌లో గాయత్రి కాలేజ్ నుంచి హనుమాన్ టెంపుల్, జహంగీర్‌నగర్, చింతలకుంట వరకు నిర్వహించిన డ్రైవ్‌లో 31 ఆక్రమణలు, 15 ర్యాంపులను తొలగించారు. అక్రమ నిర్మాణాలు, ఆక్రమణల కారణంగా రహదారుల వినియోగం, పాదచారుల రాకపోకలు, వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడకుండా ఎంఎంసీ చర్యలు చేపడుతోంది.

అనుమతులకు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మించడం, రహదారులు, నాలాలు, ప్రభుత్వ స్థలాలు, ప్రజా వినియోగ ప్రాంతాలను ఆక్రమించడం సహించబోమని కమిషనర్ స్పష్టం చేశారు. తొలగించిన ప్రాంతాల్లో తిరిగి ఆక్రమణలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.టౌన్ ప్లానింగ్,ఇంజినీరింగ్, రెవెన్యూ విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా స్థలాలను పరిరక్షించాలని సూచించారు.ప్రజలు కూడా అనధికార నిర్మాణాలు, ఆక్రమణలకు పాల్పడకుండా మున్సిపల్ నిబంధనలు పాటించి సహకరించాలని కమిషనర్ కోరారు.

తుక్కుగూడ జాతీయ రహదారిపై

బరితెగించిన రెడ్ మిక్స్ వాహనాలు





– నిబంధనలు పాటించని రెడ్ మిక్స్ వాహనాలు

– శ్రీశైలం జాతీయ రహదారిపై కంకర పోసుకుంటూ పోయిన రెడ్ మిక్స్ వాహనం

– వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు – ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకోని అధికారులు

– నిత్యం శ్రీశైలం జాతీయ రహదారిపై కంకర పోసుకుంటూ పోతున్న రెడ్ మిక్స్ వాహనాలు

– ప్రమాదాలు జరిగిన పట్టించుకోరా వాహనదారుల ఆందోళన

– ట్రాఫిక్ పోలీసులకు ఇది కనిపించడం లేదా

మహేశ్వరం, అక్టోబర్ 06 (ప్రజా కలం):

శ్రీశైలం జాతీయ రహదారిపై రెడ్ మిక్స్ (కాంక్రీట్ మిక్సర్) వాహనాల ఆగడాలు శృతి మించుతున్నాయి. తుక్కుగూడ పరిధిలోని జాతీయ రహదారిపై నిత్యం వందల సంఖ్యలో తిరుగుతున్న ఈ భారీ వాహనాలు నిబంధనలను ఏమాత్రం పాటించడం లేదు. ఓవర్ లోడ్‌తో, ఎలాంటి కవర్లు లేకుండా రోడ్డుపై కంకర, సిమెంట్ మిశ్రమాన్ని పోసుకుంటూ వెళ్తుండడంతో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేయాల్సి వస్తోంది.

వాహనదారులకు నరకయాతన:

రెడ్ మిక్స్ వాహనం నుంచి జారిపడుతున్న కంకర, కాంక్రీట్ వ్యర్థాలు రోడ్డుపై పేరుకుపోయి ద్విచక్ర వాహనదారులకు మృత్యు కుహరంగా మారాయి. రోడ్డుపై పడిన కంకరపై టైర్లు జారిపోవడంతో ఇప్పటికే పలు చోట్ల చిన్న, పెద్ద ప్రమాదాలు జరిగాయని స్థానికులు చెబుతున్నారు. అయినా సంబంధిత ట్రాఫిక్, రవాణా శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.తుక్కుగూడ నుంచి మహేశ్వరం, కందుకూరు వరకు ఈ సమస్య తీవ్రంగా ఉంది. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో కూడా ఈ వాహ నాలు అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



అధికారులు మేల్కోవాలని డిమాండ్:

నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, పోలీస్ యంత్రాంగం స్పందించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న రెడ్ మిక్స్ వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, జాతీయ రహదారిపై భద్రతా ప్రమాణాలు పాటించేలా చూడాలని వాహనదారులు, స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని, దానికి అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం – నిబంధనలు ఉల్లంఘిస్తున్న రెడ్ మిక్స్ వాహనాలు

తుక్కుగూడ జాతీయ రహదారిపై రెడ్ మిక్స్ వాహనాలు నిబంధనలు ఉల్లంఘిస్తూ రోడ్డుపై కంకర పోసుకుంటూ వెళ్తున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. కంకర రోడ్డుపై పడి ప్రమాదాలు జరుగుతున్నా చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. నిత్యం ట్రాఫిక్ పోలీసులు ప్రజల వద్ద నుండి ట్రాఫిక్ చలానాలు, హెల్మెట్ లేదంటూ ఆర్సీ లేదంటూ ఇన్సూరెన్స్ లేదంటూ, ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. రెడ్ మిక్స్ భారీ వాహనం ఇంత పెద్ద తప్పు చేస్తున్న పోలీసులు ఎందుకు పట్టించుకోవడంలేదని పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి.



ny, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

ISHNA, Printed at TEJOMAI PUBLICATION, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
AMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com

మత్స్యకారుల సంఘ సభ్యులకు వాహనాలను పంపిణీ

మహబూబ్ నగర్ ఎం.పి.డి.కె అరుణ, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా




మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 06:

జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకారుల సంఘాల సభ్యులకు మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు ఎం.పి.డి.కె అరుణ అరుణ తో కలిసి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా వాహనాలను పంపిణీ చేశారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఒక ఫోర్ వీలర్ వ్యాన్, ఒక త్రీ వీలర్ ఆటోను మత్స్య సంఘాల సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎం. పి.డి. కె అరుణ మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. వీటినిసద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు. కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న వాహనాలను సద్వినియోగం చేసుకొని మత్స్య వృత్తిని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. వాహనాల ద్వారా చేపల రవాణా, విక్రయాలను మరింత సులభతరం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డి.ఆర్. డి.ఓ నర్సింహులు, జిల్లా మత్స్య శాఖ అధికారి డి. రాధ రోహిణి,జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జి గోనెల శ్రీనివాసులు,మత్స్యకారుల సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో రక్షిత్ ను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

(వరంగల్/ పర్వతగిరి) అక్టోబర్ 06, ప్రజాకలం ప్రతినిధి: మంగళవారం మూడేతులతండా కు చెందిన మాజీ కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు ఉ కశీటెస్టేడ్ సర్పంచ్ మూడు యాకునాయక్ కుమారుడు రక్షిత్ ను ఆసుపత్రి లో పరామర్శించిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు బొంపెల్లి దేవేందర్ రావు, కంటెస్టెడ్ జడ్పీటీసీ జాటోత్ శ్రీనివాస్ నాయక్, గోరుగుట్ట తండా సర్పంచ్ విజయభాస్కర్ నాయక్, సీనియర్ మండల నాయకులు రతన్ రావు, మండల్ యూత్ ఉపాధ్యక్షులు మూడు దేవరాజ్ నాయక్, ఉపసర్పంచ్ జాటోతు రవీందర్, శ్రీనివాస్, తరుణ్, వసంత్, మాలోతు శ్రీనివాస్, రామారావు, బద్రు తదితరులు పాల్గొన్నారు.



శామ్యూల్ రెడ్డి నీ పరామర్శ

త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

అండగా ఉంటామని భరోసా : మద్దిశెట్టి సామేలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: అక్టోబర్ 06: ప్రజా కలం న్యూస్


హైదరాబాద్ నగరానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకులు, ప్రజా నాయకులు, ఎన్సిపి పార్టీ ఎన్వైసీ రాష్ట్ర గౌరవ సలహాదారు శామ్యూల్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని ఎన్సిపి పార్టీ ఎన్డీఏ మహాకూటమి ఎన్వైసీ రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ కార్యవర్గ సభ్యులు మద్దిశెట్టి సామేలు వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.శామ్యూల్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం తీసుకుంటున్న చికిత్స, వైద్యుల సూచనలపై ఆరా తీశారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం మద్దిశెట్టి సామేలు మాట్లాడుతూ శ్యాముల్ రెడ్డి ఒక వ్యక్తి కాదు ఒక వ్యవస్థ పేదలకు, అనాథలకు అండగా నిలబడే ఆయన సేవా దృక్పథం నిజంగా స్ఫూర్తిదాయకం. రాజకీయాలకు అతీతంగా, కుల మతాలకు అతీతంగా ఆయన చేస్తున్న సేవలు మరువలేనివి. ఆయన త్వరగా కోలుకొని మళ్ళీ ప్రజల్లోకి రావాలి.శామ్యూల్ రెడ్డి కి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని మద్దిశెట్టి సామేలు ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. శ్యాముల్ రెడ్డి త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ ఆత్మీయ కలయికలో ఇరువురు నాయకులు రాష్ట్రంలో పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై కూడా చర్చించినట్లు తెలిసింది.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దివ్యాంగుల పింఛన్ల ధ్రువీకరణలో పారదర్శకత పాటించాలి

- అదనపు కలెక్టర్ నర్సింగరావు

గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 6, ప్రజా కలం: దివ్యాంగుల పింఛన్ల ధ్రువీకరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు అధికారులను ఆదేశించారు. గద్వాల మండలంలోని సంగాల, జిల్లేడు బండ, గోనుపాడు, శెట్టి ఆత్మకూరు, మదనపల్లి, గుంటిపల్లి, ముల్కలపల్లి, లత్తిపూర్ గ్రామాల్లో మంగళవారం దివ్యాంగుల పింఛన్ల జిల్లా స్థాయి ధ్రువీకరణ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని ధ్రువీకరణ ప్రక్రియను పరిశీలించారు. అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వ పింఛన్లు అందేలా దరఖాస్తులు, లబ్ధిదారుల వివరాలు, అర్హతకు సంబంధించిన ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అర్హత ఉన్న ఏ ఒక్క లబ్ధిదారుడూ ప్రభుత్వ సంక్షేమ ప్రయోజనాలకు దూరం కాకుండా చూడాలని, అనర్హులకు పింఛన్లు మంజూరు కాకుండా నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు చేరేలా క్షేత్రస్థాయిలో ధ్రువీకరణ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. సంబంధిత రికార్డులతో వివరాలను సరిపోల్చి నమోదు చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ శైలజ, సీనియర్ అసిస్టెంట్ సూర్య ప్రకాశ్ రెడ్డి, గ్రామ పెద్దలు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రామాయపట్నం రిఫైనరీకి కేంద్రం గ్రీన్ సిగ్నల్

ఒంగోలు : ఆంధ్రప్రదేశ్‌లో మరో భారీ ప్రాజెక్టు నిర్మాణానికి మార్గం సుగమమైంది. నెల్లూరు జిల్లా రామాయపట్నం పోర్టు సమీపంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) ప్రతిష్ఠాత్మకంగా నిర్మించతలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌కు కీలక అడుగు పడింది. ఈ భారీ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖకు చెందిన నిపుణుల అంచనా కమిటీ (ఈఏసీ) పచ్చజెండా ఊపుతూ సిఫారసు చేసింది. ఈ అనుమతితో ప్రాజెక్టు నిర్మాణ పనుల ప్రారంభానికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. సుమారు రూ. 1,03,408 కోట్ల భారీ అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రామాయపట్నం పోర్టు సమీపంలో దాదాపు 5,200 ఎకరాల భూమిని కేటాయించారు. ఏడాదికి 9 మిలియన్ టన్నుల (ఎంటీపీఏ) ఉత్పత్తి సామర్థ్యంతో దీనిని నిర్మిస్తారు. ఇందులో 5.4 మిలియన్ టన్నుల పెట్రోల్, డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ వంటి రవాణా ఇంధనాలతో పాటు, 3.2 మిలియన్ టన్నుల పెట్రోకెమికల్ ఉత్పత్తులను తయారు చేయాలన్నది లక్ష్యం. పర్యావరణ పరిరక్షణకు ఈ ప్రాజెక్టులో పెద్దపీట వేస్తున్నారు. మొత్తం ప్రాజెక్టు ప్రాంగణంలో 30 శాతం, అంటే సుమారు 1,563 ఎకరాల విస్తీర్ణంలో పచ్చదనాన్ని (గ్రీన్ బెల్ట్) అభివృద్ధి చేయనున్నారు. పర్యావరణ నిర్వహణ ప్రణాళిక కోసం ప్రత్యేకంగా రూ. 3,022 కోట్లు కేటాయించడం గమనార్హం. వీటితో పాటు గ్రీన్ హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధన జోన్లు, రామాయపట్నం పోర్టుతో అనుసంధానించిన మెరైన్ క్రూడ్ ఆయిల్ టెర్మినల్ కూడా ఈ ప్రాజెక్టులో భాగం కానున్నాయి. ఈ రిఫైనరీ ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్ రూపురేఖలు మారనున్నాయని, దక్షిణ భారతదేశంలోనే ఇది ఒక ప్రధాన ఇంధన, పెట్రోకెమికల్ హబ్‌గా ఎదుగుతుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలో వేలాది మందికి, ఆ తర్వాత నిర్వహణ దశలోనూ వేల సంఖ్యలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావిస్తున్నారు. అనుమతుల ప్రక్రియ ఖరారైన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు బీపీసీఎల్ సన్నాహాలు చేస్తోంది.

ప్రొద్దుటూరులో జల్ జీవన్ మిషన్ 2.0 పనులు ప్రారంభం

కడప : రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు సురక్షిత తాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన 'జల్ జీవన్ మిషన్ 2.0 – అమరజీవి జలధార' పనులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లాంఛనంగా ప్రారంభించారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో రూ. 30,156 కోట్ల భారీ వ్యయంతో ఈ బృహత్తర పథకానికి వారు శ్రీకారం చుట్టారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు కొత్తగా కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా గండికోట రిజర్వాయర్ నుంచి చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లోని ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఉద్దేశించిన సమగ్ర తాగునీటి పథకం పనులను కూడా వారు ప్రారంభించారు. ఈ పనుల ప్రారంభానికి గుర్తుగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కలిసి మొత్తం 13 శిలాఫలకాలను ఆవిష్కరించారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని కొత్తపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించిన అనంతరం వారు బహిరంగ సభలో పాల్గొన్నారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ర్యాంపుపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కలిసి నడుస్తూ ప్రజలకు అభివాదం చేశారు.

రూ. 30,156 కోట్ల ప్రాజెక్టు.. 27 లక్షల కుటుంబాలకు తాగునీరు

రూ. 30,156 కోట్ల భారీ అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ జల్ జీవన్ మిషన్ పనులను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రొద్దుటూరు నుంచి సోమవారం ఉదయం ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు కొత్తగా తాగునీటి కుళాయి కనెక్షన్లు లభించనున్నాయి. పర్యటనలో భాగంగా ప్రొద్దుటూరు మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం, అక్కడే ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. రూ. 30 వేల అంచనా వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా 50,315 పనులు చేపట్టడం ఈ పథకం లక్ష్యం కాగా, వీటిల్లో ఇప్పటికే 27,301 పనులు పూర్తికాగా రూ. 5,587 కోట్లు ఖర్చు చేసింది కూటమి ప్రభుత్వం.

3.27 కోట్ల మంది ప్రజలకు ప్రయోజనం

'హర్ ఘర్ జల్' లక్ష్యంలో భాగంగా ఏపీ ప్రభుత్వం 24,601 ఆవాసాల్లోని 27.36 లక్షల కుటుంబాలకు కొత్త నల్లా కలెక్షన్లు ఇస్తుంది. తద్వారా సుమారు 3.27 కోట్ల మంది గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తాగునీరు అందుతుంది. గ్రామాల్లోని ప్రతి కుటుంబానికి రోజుకు సగటున 55 లీటర్ల మంచినీరు అందించనున్నారు. హిరమండలం, పీఏబీఆర్, వెలుగోడు–ఓంకారం, ఏలేరు, గండికోట, ధవళేశ్వరం, తాండవ వంటి ప్రధాన జలాశయాలు, నీటి వనరుల నుంచి నీటిని సేకరించి గ్రామీణ ప్రాంతాలకు సరఫరా చేసేలా కూటమి సర్కార్ సరికొత్త వ్యవస్థను రూపొందించింది. మరోవైపు అమరజీవి జలధార కార్యక్రమంలో భాగంగా 1,426 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. 14,995 నీటి నిల్వ నిర్మాణాలు, 77,243 కి.మీ. పైప్‌లైన్లు నిర్మించడంతో కొండ ప్రాంతాలు, నీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లోనూ ఇంటింటికీ కుళాయి ద్వారా నీటిని అందిస్తారు. గత ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు తాగునీరు అందించే జలజీవన్ మిషన్ పథకాన్ని నిర్వీర్యం చేసిందని, కేవలం రూ. 2,600 కోట్లే ఖర్చు చేసిందని కూటమి నేతలు విమర్శించారు. 2019లో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టగా పలు రాష్ట్రాలు పోటీ పడి మరీ నిధులు తెచ్చుకోగా, జగన్ హయాంలో తక్కువగా ఖర్చు చేశారని ఆరోపించారు. 2024లో చంద్రబాబు నేతృత్వంలో కూటమి అధికారంలోకి వచ్చాక కేంద్రంతో చర్చి రాష్ట్రానికి భారీగా నిధులు తెచ్చామని అధికార పార్టీల నేతలు చెబుతున్నారు

సిరిసిల్ల పూర్తయింది... ఇక సిద్ధిపేట....



మెదక్ : ఉమ్మడి కరీంనగర్, మెదక్ జిల్లాల్లో గులాబీ పార్టీ బలమైన అడ్డాగా ఉన్న నియోజకవర్గాలపై వ్యూహాత్మకంగా దృష్టి సారించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సిరిసిల్ల సభ తర్వాత తన తదుపరి పొలిటికల్ టార్గెట్‌గా సిద్ధిపేటను ఎంచుకోవడం తెలంగాణ రాజకీయంలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లపై నిధుల వర్షం కురిపిస్తూనే రాజకీయ విమర్శలతో దాడి చేసిన సీఎం రేవంత్, ఇప్పుడు బిఆర్ఎస్ ట్రబుల్ షూటర్ హరీష్ రావు స్వక్షేత్రమైన సిద్ధిపేటలో భారీ బహిరంగ సభకు సిద్ధమవుతున్నారు. అయితే, సిరిసిల్ల రాజకీయ సమీకరణలతో పోలిస్తే సిద్ధిపేట గడ్డపై బిఆర్ఎస్‌ను ఢీకొట్టడం కాంగ్రెస్‌కు అంత సులువైన విషయం కాదన్నది ప్రాథమిక అంచనా.సిద్ధిపేట నియోజకవర్గం దశాబ్దాలుగా గులాబీ జెండాకు తిరుగులేని బలమైన కోటగా ఉంది. 1985లో తొలిసారిగా కేసీఆర్ ఇక్కడి నుంచి గెలిచిన నాటి నుంచి నేటి వరకు ఈ నియోజకవర్గం కేసీఆర్ కుటుంబం చేతుల్లోనే ఉంది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా రాష్ట్ర స్థాయి రాజకీయాలకు పరిమితమైన తర్వాత, సిద్ధిపేట బాధ్యతలను స్వీకరించిన హరీష్ రావు నియోజకవర్గాన్ని కేవలం ఒక రాజకీయ స్థానంగా కాకుండా తన సొంత ఇల్లుగా మార్చుకున్నారు. వరుసగా ఆరుసార్లు రికార్డు స్థాయి భారీ మెజార్టీలతో విజయం సాధించడమే కాకుండా, ప్రత్యర్థి పార్టీల ఉనికిని కూడా ప్రశ్నార్థకం చేసే స్థాయికి నియోజకవర్గంలో పట్టు సాధించారు. హరీష్ రావు రాజకీయ విజయంలో ప్రధాన బలం ఆయన పెంపొందించుకున్న వ్యక్తిగత అనుబంధం, నిరంతర అందుబాటు . సిద్ధిపేటలోని ప్రతి గ్రామంలోనూ, ప్రతి వార్డులోనూ హరీష్ రావుకు సొంత కేడర్ ఉంది. ప్రతీ శుభకార్యానికి లేదా అశుభకార్యానికి పలకరించే స్థాయి కార్యకర్తల నెట్‌వర్క్, నియోజకవర్గంలోని ప్రతి కుటుంబంతో ఏదో ఒక రూపంలో నేరుగా కనెక్టివిటీ ఉండటం ఆయనకు శ్రీరామరక్షగా మారింది. దానికి తోడు మంత్రిగా పనిచేసిన సమయంలో రంగనాయక సాగర్ జలాశయం, వైద్య కళాశాల, ఐటీ పార్కు, మోడల్ బస్టాండ్ వంటి ప్రాజెక్టులతో సిద్ధిపేటను అభివృద్ధి నమూనాగా తీర్చిదిద్దడం ఆయన బలాన్ని మరింత ద్విగుణీకృతం చేసింది. సిద్ధిపేటలో కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మకంగా అత్యంత బలహీనమైన స్థితిలోనే ఉందనేది వాస్తవం. ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి స్థానిక స్థాయిలో గులాబీ పార్టీ పట్టును తట్టుకోగల బలమైన, జనాకర్షణ కలిగిన నాయకత్వం కరువైంది. సిరిసిల్లలో చేరికలు లేదా అంతర్గత విభేదాలను ఆసరాగా చేసుకుని విమర్శలు గుప్పించే వెసులుబాటు కాంగ్రెస్‌కు ఉన్నప్పటికీ, సిద్ధిపేటలో హరీష్ రావు కేడర్‌ను లేదా ఓటు బ్యాంకును చీల్చడం కాంగ్రెస్‌కు పెద్ద సవాలు. దీంతో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభ ఎంత భారీ స్థాయిలో నిర్వహించినప్పటికీ, అది స్థానిక రాజకీయ సమీకరణలను ఎంతవరకు ప్రభావితం చేస్తుందనేది ప్రశ్నార్థకమే సీఎం రేవంత్ రెడ్డి వ్యూహం కేవలం ఎన్నికల విజయం కోసమే కాకుండా, బిఆర్ఎస్ ప్రధాన నాయకత్వంలో మానసిక అభద్రతాభావాన్ని పెంచడమే లక్ష్యంగా కనిపిస్తోంది. హరీష్ రావు అసెంబ్లీలో ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్న తరుణంలో, ఆయన సొంత నియోజకవర్గంలోనే బహిరంగ సభ పెట్టి అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలతో పాటు రాజకీయంగా సవాల్ విసరడం ద్వారా రేవంత్ రెడ్డి డిఫెన్సివ్ రాజకీయాల కంటే ఎదురుదాడి రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని స్పష్టమవుతోంది. ముఖ్యంగా కాంగ్రెస్ కేడర్‌లో ధైర్యం నూరిపోసి, భవిష్యత్తు స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీకి ఊపిరి పోయడం కూడా ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. సిరిసిల్ల తరహాలో సిద్ధిపేటను ఒకే దెబ్బతో డిఫెన్స్‌లో పడేయడం రేవంత్ రెడ్డికి ఏమాత్రం సులభం కాదు. హరీష్ రావు నిర్మించుకున్న వ్యక్తిగత సంబంధాలు, అభివృద్ధి మార్కు, తిరుగులేని సంస్థాగత నిర్మాణం ముందు కాంగ్రెస్ కమ్యూనికేషన్ వ్యూహాలు ఎంతవరకు పారుతాయనేది వేచి చూడాలి. సభ ద్వారా కాంగ్రెస్ కొంత సంచలనం సృష్టించినప్పటికీ, సిద్ధిపేట 'కోట'ను బద్దలు కొట్టాలంటే కేవలం బహిరంగ సభలు మాత్రమే సరిపోవని, సుదీర్ఘమైన క్షేత్రస్థాయి వ్యూహం అవసరమని భావిస్తున్నారు.

అడవి జంతువులను వేటాడి కొమ్ములు, మాంసం విక్రయం..

ఆదిలాబాద్ : అక్రమంగా అడవి జంతువులను వేటాడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేయడం జరిగిందని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు.ఆదిలాబాద్ పట్టణంలోని పంజేశా ప్రాంతానికి చెందిన షోయబ్ అఫ్జల్ (34) ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. తన సంపాదన జల్సాలకు సరిపోవడం లేదని, సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో అక్రమంగా వన్యప్రాణులను వేటాడినట్లు పోలీసుల విచారణలో తెలిపారు.గత సంవత్సరం ఆగస్టు 5వ తారీఖున విశ్వసనీయ సమాచారం మేరకు నిందితుడు ఇంట్లో తనిఖీలు నిర్వహించగా, నిందితుడి ఇంట్లో ఉన్న డబుల్ బ్యారల్ తుపాకీ, కత్తులు, ఉలి కనిపించగా, అవి తన తాతలు గతంలో వేటకు ఉపయోగించినవని తెలిపాడు. అనంతరం తుపాకీతో వేటాడి అడవి జంతువుల మాంసం, కొమ్ములు మరియు ఇతర భాగాలను విక్రయించి డబ్బులు సంపాదించాలని నిర్ణయం చుకున్నట్లు తెలిపాడు.నిందితుడు మహారాష్ట్రలోని ఘాటంజి అటవీ ప్రాంతానికి వెళ్లి జింకలను వేటాడినట్లు, వేటాడిన జింకలను అక్కడే కత్తులతో కోసి, మాంసాన్ని విక్రయించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.జింకల కొమ్ములను హైదరాబాద్‌లో విక్రయిస్తే ఎక్కువ డబ్బులు వస్తాయని భావించి, వాటిని ఇంట్లో దాచిపెట్టినట్లు తెలిపాడు.

బాధితురాలికి జనసేన పార్టీ సంఘీభావం

– దళిత యువతికి న్యాయం చేయాలని డిమాండ్

– నిష్పక్షపాతంగా విచారణ జరపాలి: జనసేన నాయకులు బర్ల శివ

వర్ధన్నపేట, అక్టోబర్ 6:– (ప్రజాకలం ప్రతినిధి)

వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ కొడుకు ఐన పాలకుర్తి శ్రీకాంత్ చేతిలో ప్రేమ పేరుతో మోసపోయిన వర్ధన్నపేట పట్టణానికి చెందిన దళిత యువతికి



న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జనసేన పార్టీ నాయకులు ఆమెకు సంఘీభావం తెలిపారు. బాధితురాలికి అండగా నిలిచిన జనసేన పార్టీ నాయకులు, ఘటనపై సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని కోరారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బర్ల శివ మాట్లాడుతూ, బాధితురాలికి న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని కోరారు. బాధితురాలిపై ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా ఆమెకు రక్షణ కల్పించాలని, చట్టపరంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు ఆమెకు అండగా నిలుస్తామని జనసేన నాయకులు తెలిపారు. దళిత మహిళలకు రక్షణ కల్పించడంతో పాటు, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ జనసేన నాయకులు రాజవరపు శ్రీ ఆంజనేయులు, సునావత్ సంతోష్ నాయక్, కొత్తూరు అంజి, తుళ్ల శ్రావణ్, దుబ్బాక రాజేష్ కుమార్, మహమ్మద్ భాష, గణేష్ తదితరులు పాల్గొన్నారు.


భారతదేశం బాగుపడాలంటే అవినీతి పోవాలి..

జ్ఞానేశ్ కుమార్ ను తొలగించి, నూతన దేశాన్ని నిర్మించుకోవాలి..

ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వమే ఆదుకుంటుంది..

తల్లాడ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పిడమర్తి రవి..

పిడమర్తి రవిని సన్మానించిన తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి ఉపాధ్యక్షుడు తాళ్ల జోసెఫ్



తల్లాడ. అక్టోబర్. 6 ప్రజా కలం న్యూస్

భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే పూర్తిగా అవినీతిని నిర్మూలించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా తల్లాడలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా జ్ఞానేశ్ కుమార్ బిజెపితో కుమ్మక్కై సీఈసీని పక్కదోవ పట్టిస్తున్నాడని, తక్షణమే ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో నూతన భారతదేశాన్ని నిర్మించడం కోసం దేశ పౌరులందరూ రోడ్డు మీదకి రావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వలన అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో బిజెపి ఓడిపోతుందనే భయంతోనే డీ లిమిటేషన్ పేరుతో ఎక్కువ స్థానాలను పెంచేందుకు మోడీ ఆసక్తి చూపిస్తున్నారని వివరించారు. బిజెపికి అనుకూలంగా ఉన్న భాగస్వామ్య పక్షాలే ఆయనకు దూరంగా ఉంటున్నాయని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉద్యమకారులకు 2.50 గజాల స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందని అన్నారు. దేశంలో వేగంగా పరిస్థితులు మారుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో, రాష్ట్రంలో మరలా అధికారంలోకి వచ్చి దేశ ప్రజలందరికీ సుపరిపాలన అందిస్తుందని ఆయన అన్నారు. తొలుత ఆయనకు కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు గొడుగునూరు లక్ష్మారెడ్డి సాదర స్వాగతం పలకటంతో లక్ష్మారెడ్డిని పిడమర్తి రవి శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల ఉపాధ్యక్షులు తాళ్ల జోసెఫ్, అన్నారుగూడెం గ్రామ అధ్యక్షులు తుమ్మలపల్లి రమేష్, నాయకులు రావుల గోపి గౌడ్, రేగళ్ల శ్రీనివాసరావు, నారపోగు ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన వైకాపా

విజయవాడ:స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ వివాదం దేశ అత్యున్నత న్యాయస్థానానికి చేరింది. రాష్ట్రంలో వార్డుల విభజన, ఓటర్ల జాబితా (ఎస్ఐఆర్) అంశాలపై హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ వైకాపా నేత లేళ్ల అప్పిరెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. స్థానిక సమరానికి సంబంధించి తలెత్తిన పలు అభ్యంతరాలను అత్యున్నత న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. ఈ వ్యాజ్యాన్ని వైకాపా తరఫు న్యాయవాది భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఎస్ఐఆర్ ఆధారిత తాజా ఓటర్ల జాబితా ప్రక్రియ పూర్తయిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని కోర్టును కోరారు. పాత జాబితాలతో కాకుండా, నూతన ఓటర్ల జాబితా సిద్ధమయ్యాకే ప్రక్రియ చేపట్టాలన్నారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏ క్షణంలోనైనా ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసే అవకాశముందని విన్నవించారు.

సమైక్యంగా శ్రమించి స్థానిక ఎన్నికల్లో విజయదుందుభి మోగిద్దాం:

పత్తికొండ : సమైక్యంగా శ్రమించి స్థానిక ఎన్నికల్లో విజయదుందుభి మోగిద్దాం: కంగాటి శ్రీదేవమ్మ పిలుపునిచ్చారు.పత్తికొండ వైఎస్ఆర్ పార్టీ కార్యాలయంలో మండల పరిషత్ పాలకవర్గం పదవీకాలం ముగిసిన సందర్భంగా వైఎస్ఆర్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మాజీ జడ్పీటీసీ,మాజీ ఎంపీపీ, మాజీ కో ఆప్షన్,మాజీ ఎంపీటీసీల సన్మాన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గత ఫలితాలను పునరావృతం చేసేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు.గత ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించామని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాటి అమలులో జరిగిన మోసాలను గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు.